సంపుటి 10 సంచిక 5 జులై - ఆగష్టు 2022

# పల్లెసృజన

www.pallesrujana.org

గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక

honeybee.org
Vol-10 Issue-5








# పల్లెసృజన

# చిన్న శోధయాత్ర – జ్ఞాన యాత్ర

'పల్లెసృజన' ఒక స్వచ్ఛంద సంస్థ. దీని నిర్వాహకులు, వాలంటీర్లు అంతా స్వచ్ఛందంగా పనిచేస్తారు. గ్రామాల్లోవున్న సృజనాత్మకతను వెతికి, సమాజానికి తెలియపరచడం, సృజనాత్మకత గల వ్యక్తులను (ఇన్నోవేటర్స్‌ను) గౌరవించి వారిని ప్రపంచానికి పరిచయం చేయాలన్న ప్రధాన లక్ష్యంతో 2005లో 'పల్లెసృజన' స్థాపించబడింది. చదువుకోని గ్రామ ప్రజల్లో కూడా శాస్త్రవేత్తలు ఉన్నారని త్రికరణశుద్ధిగా 'పల్లెసృజన' నమ్ముతుంది. అలాంటి జ్ఞానవేత్తల జ్ఞానాన్ని గుర్తించి, గ్రంథీకరించి, ఆ జ్ఞానాన్ని సమాజానికి అందించటంతో పాటు ఆ జ్ఞానకర్తను సమాజం గుర్తించేలా చేయటం 'పల్లెసృజన' ప్రధాన కార్యక్రమం. జ్ఞానశోధనకై 'పల్లెసృజన' ఆధ్వర్యంలో సాగుతున్న యాత్రే 'చిన్నశోధయాత్ర'.

మరుగున పడుతున్న జ్ఞాన దేవాలయాలను (గ్రామాలను) దర్శిస్తూ జ్ఞానాన్వేషణ చేయడం, ప్రకృతితో సమన్వయంగా సహజీవనం చేస్తూ ప్రకృతినుంచి జ్ఞానాన్ని పొందే గ్రామీణులను కలవాలన్నదే 'శోధయాత్ర' ప్రధాన ఉద్దేశ్యం. ఇలాంటి శోధయాత్రలను 'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్' (ఎన్.ఐ.ఎఫ్.) సంవత్సరానికి రెండుసార్లు దేశంలోని అన్ని రాష్ట్రాలలో నిర్వహిస్తుంది. అందుకే ఇది చిన్న శోధయాత్ర.

తెలుగు రాష్ట్రాలలో 'చిన్నశోధయాత్ర'ను ఎన్.ఐ.ఎఫ్. స్ఫూర్తితో పల్లెసృజన నిర్వహిస్తున్నది. గత 11 సంవత్సరాలుగా 41చిన్నశోధయాత్రలు దాదాపు ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని జిల్లాల్లో జరిగాయి. మూడు రోజులపాటు జరిగే ఈ యాత్రలో పాల్గొనే యాత్రీకులు స్వచ్ఛందంగా ప్రకృతితో మమేకమై గ్రామీణ ప్రజలతో జ్ఞానాన్ని పంచుకుంటూ. నేర్చుకుంటూ యాత్ర సాగిస్తారు.

**యాత్ర ముఖ్య ఉద్దేశ్యాలు :**

❀ ప్రజలలోని జ్ఞానాన్ని గుర్తించి వెలికి తీయటం. ❀ మారుమూల అడవుల్లో వున్న జీవవైవిధ్యాన్ని దానికి జోడించివున్న జ్ఞానాన్ని సంకలనం చేయటం. ❀ కొండల్లో, అడవుల్లో, మారుమూల ప్రాంతాల్లో నివసించే ప్రజల జ్ఞానాన్ని శోధించి వెలికి తీయడం. ❀ ఆ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రయోగాత్మక రైతులు, స్త్రీలు, పిల్లలు, జ్ఞానవృద్ధులను, పశు వైద్యులను సత్కరించడం. ❀ వ ా ర ం వ ం ా ల ప్రాంతాల్లోని ప్రజలు, ప్రకృతి సమన్వయంతో ఎలా జీవిస్తారో గమనించడం. ❀ ఒక గ్రామంలో సేకరించిన జ్ఞానాన్ని మరో గ్రామంలో పంచడం. ❀ గ్రామాల్లోని క్రియాశీల వ్యక్తులను ఏకం చేయడం.

**ఈ ఉద్దేశ్యాన్ని నెరవేర్చడానికి మీరు మాకు సహాయ పడాలనుకుంటున్నారా? అయితే....**

❀ పల్లెసృజన సంస్థలో వాలంటీర్‌గా చేరండి. ❀ రైతులకు మా యాత్ర గురించి వివరించండి. ❀ విద్యార్థులను జీవవైవిధ్య పోటీలకు ప్రోత్సహించండి. ❀ క్రియాశీల రైతులు, మహిళలు, పశువైద్యులను గుర్తించటానికి సహకరించండి. ❀ శోధయాత్రలో పాల్గొనండి. ❀ పల్లెసృజన పత్రిక చందాదారులు కండి.

(శోధయాత్రల వివరాలు లోపలి పేజీల్లో చూడగలరు)

**గత శోధయాత్రలోని కొన్ని దృశ్యాలు**









చిరునామా : పల్లెసృజన, 77, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్ - 500 094.

ఫోన్ : 040-40253096

E-mail : president@pallesrujana.org Visit us : www.pallesrujana.org

వివరాలకు సంప్రదించండి

బ్రిగేడియర్ పి. గణేశం : 9866 001678

అంజిరెడ్డి : 99666 46276

**బ్రిగేడియర్ పోగుల గణేశం**

పల్లెసృజన స్వచ్ఛంద సేవా సంస్థ

సంపుటి-10 సంచిక - 5 జులై - ఆగష్టు 2022

# పల్లెసృజన

పల్లెసృజన, 102, వాయుపురి,
సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్– 500 094.
ఫోన్ : 040–40253096, 98660 01678
E-mail : president@pallesrujana.org,
Visit :www.pallesrujana.org

**సంపాదకవర్గం**

ప్రధాన సంపాదకులు :
**బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం**

సంపాదకులు :
**జమ్ములమడక శశిమోహన్**

ఉప సంపాదకులు :
**పల్లె వీర రాఘవ రెడ్డి**

సలహాదారులు :
**ప్రొ. అనిల్ గుప్త**
**పి. చంద్రకాంత్ శర్మ**
**జాగర్లమూడి దుర్గాప్రసాద్**
**జమ్ములమడక శ్రీకర్**
**కల్పనా శాస్త్రి**

డిజైనింగ్ & ప్రింటింగ్ :
**నరేంద్ర గ్రాఫిక్స్**, హైదరాబాద్.
ఫోన్ : 81257 99904,
E-mail : narendragrafixhyd@gmail.com

**Rs. 400/-**
**for 2 years Subscription**

## ఈ సంచికలో.....

* నాగస్వామి స్వయం కృషి - సామాన్య రైతుకు అందుబాటులో వరి నాటు యంత్రం - 4
* సాంప్రదాయం - ఆధునికత సమ్మేళనమే మక్తుం అలీ సృజన ఎడ్లబండితోనే పంటలపై పిచికారి - 7
* మెండె శ్రీనివాస్ ఇన్నోవేషన్ - రైతు మరియు గృహ వినియోగదారుల నీటిపంపు కష్టాలకు విముక్తి - 10
* పునాది స్థాయి ఇన్నోవేషన్లతో గ్రామీణ యువతకు స్వయం ఉపాధి - 13
* అభివృద్ధి చేయబడ్డ సాంప్రదాయ దేశీ సజ్జ విత్తనాలు 'సుల్కానియా సజ్జ' - 15
* జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు - 18
* 75 వీక్లీ వెబినార్లపై సమాజ స్పందన - 20
* ఇతర రాష్ట్రాల పల్లె జ్ఞానం - 22
* వృక్షాయుర్వేదము - 24
* మరుగున పడుతున్న జ్ఞాన దేవాలయాల్లో (గ్రామాల్లో) జ్ఞానాన్వేషణ పల్లెసృజన వాలంటీర్ల జ్ఞాన యాత్రలు - 26
* ఎపిజె అబ్దుల్ కలాం 'ఇగ్నైటెడ్ మైండ్' చిన్న పిల్లల సృజనాత్మక మరియు ఇన్నోవేషన్ పురస్కారాలు - 2020 - 27
* ఆయుర్వేద జ్ఞాన మథనం - 30
* స్పందన - 31

**కవర్ లోపలి పేజీల్లో ...**

'పల్లెసృజన' చిన్న శోధయాత్ర – జ్ఞానయాత్ర
అమ్మకానికి సిద్ధంగా వున్న రైతుల కోసం రైతుల ఇన్నోవేషన్లు

**మధ్య పేజీలో :**

మే – జూన్ 2022 లో జరిగిన 'పల్లెసృజన' విశేషాలు

Printed, Published and Owned by **P. Ganesham** and Printed at **M/s Narendra Grafix**, 1-5-1055/2/14, Saibaba Nagar, Old Alwal, Secunderabad, Medchal- Malkajgiri Dist. - 500010.Telangana State and Published at 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal- Malkajgiri Dist. –500094. Telangana State, Editor : **J. Sesimohan.**

**HoneyBee Regional Collaborators & Publications**

**Honey Bee (English)**
AES Boys Hostel Campus, Near Gujarat University Library & SBI Bank, Navrangapura, Ahmedabad - 380 009 Gujarat, India.
Phone: 91-79-27912792, Fax: 91-79-27913293 Email: honeybee@sristi.org

**Karshakan Samsarikkatte (Malayalam)**
Fr Hubby Mathew
Peermade Development Society,
Peermade, Idukki - 685531,
Kerala hmathew@gmail.com

**Nam Vali Velanmai (Tamil)**
Mr P Vivekanandan
45, T P M Nagar,Virattipathu,
Madurai - 625010 Tamil Nadu
vivekseva@gmail.com

**Palle Srujana (Telugu)**
Brig Pogula Ganesham VSM (Retd)
102, Vayupuri, Sainikpuri Post
Secunderabad-500 094 Telangana.
president@pallesrujana.org, www.pallesrujana.org

**Loksarvani (Gujarati)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

# 'వ్యవసాయం' అయోమయ స్థితిలో ఎన్నాళ్ళు?

ప్రస్తుతం "ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్" (ఎఐ) గురించి వ్యవసాయ పరిశ్రమలో, వ్యవసాయ పరిశోధనా సంస్థలలో, కొన్ని ప్రభుత్వ శాఖలలో సీరియస్‌గా చర్చలు జరుగుతున్నాయి. కొన్ని 'ఐసిఎఆర్' పరిశోధనా సంస్థలు 'ఎఐ'పై ప్రాజెక్టులు తయారు చేస్తున్నాయి. ఉన్నత విద్యాసంస్థలు 'ఎఐ' వ్యవసాయంలో ఎలా ఉపయోగించాలన్న విధానాలపై తర్జన భర్జనలు, పరిశోధన కార్యక్రమాలు ఉపాధ్యాయులతో, విద్యార్థులతో, అంతర్జాతీయ సంస్థలతో కలసి ముందుకు సాగుతున్నాయి. ఇవన్నీ అవలోకిస్తే భారత వ్యవసాయ రంగంలోకి 'ఎఐ' రావటానికి ఎక్కువ కాలం పట్టదేమో అనిపిస్తుంది.

అసలు 'ఎఐ' అంటే ఏమిటి? కృత్రిమ మేధస్సు అని క్లుప్తంగా చెప్పవచ్చు. మనుష్యుల మేధస్సును వాడకుండా కృత్రిమ మేధస్సును వాడటం. రైతులందరికీ సాంకేతిక పరిజ్ఞానం ఒకేలాగా ఉండకపోవచ్చు, వాతావరణం గురించి, భూమి గురించి, మొక్కల పెంపకం గురించి పూర్తి అవగాహన లేకపోవచ్చు. దానివల్ల వ్యవసాయ పనుల్లో, ఉత్పత్తిలో పూర్తి లాభాలు రాకపోవచ్చు. ఈ తేడాలను లేకుండా చేయాలంటే తప్పులు చేయని, పూర్తి అవగాహన గల కృత్రిమ మేధస్సును రైతుకు బదులుగా వాడాలని శాస్త్రజ్ఞుల అభిప్రాయం. పరిసరాలను సమగ్రంగా అవగాహన చేసుకుని శాస్త్రపరంగా సరియైన నిర్ణయాన్ని కృత్రిమ మేధస్సు అమలు పరుస్తుంది. ఈవిధంగా అన్ని పరిస్థితులకు, అన్ని పంటలకు సరియైన నిర్ణయాలు అమలు పరచడం వల్ల వ్యవసాయ రంగంలో ఉత్పత్తి పెరుగుతుందని, రైతుల ఆదాయం దానివల్ల అధికమవుతుందని 'ఏఐ' వాదుల నమ్మకం. ఈ పద్ధతిని అమలు పరచాలంటే పరిశోధనకు, యంత్రాల ఉత్పత్తికి, వాటిని దేశమంతా నియమించడానికి, వాటన్నిటినీ సరిగా వాడటానికి వేల బిలియన్ల డాలర్లు కావాలి. ఈ సాంకేతికత ప్రధానంగా విదేశాల నుండి దిగుమతి చేసుకోవాలి కాబట్టి విదేశీ మారకద్రవ్యం తప్పనిసరిగా కావాలి.

ప్రస్తుతం వ్యవసాయదారుల్లో 86 శాతం చిన్న, సన్నకారు రైతులు ఉన్నారు. వీరి ఆదాయాలు పెరగాలంటే ఆధునిక సాంకేతికత వల్ల సాధ్యమవుతుందని విశేషజ్ఞులు వాదిస్తున్నారు. ఆధునిక సాంకేతిక పరికరాలు ఎక్కువ ఖర్చుతో కూడుకున్నవి కాబట్టి చిన్న సన్నకారు రైతులు వాటిని కొనలేరు. అంతే కాకుండా కృత్రిమ మేధస్సులాంటి సాంకేతికతను చిన్న కమతాల్లో ఉపయోగించడం ఆర్థికంగా సాధ్యం కాదు. పశ్చిమ దేశాల్లో వందల హెక్టార్లు ఒకే వ్యవసాయంగా ఉంటాయి కాబట్టి అతి ఎక్కువ ధరలో లభించే ఆధునిక సాంకేతికత వాడటం వారికి కొంత లాభసాటిగా ఉంటుంది. మన పరిస్థితుల్లో అలా చేయాలంటే వ్యవసాయ వైశాల్యం పెంచాలి. చిన్న సన్నకారు రైతులను సమీకృతం చెయ్యాలి. ఇది ఎంతవరకు సాధ్యం? దీనివల్ల రైతులకు వచ్చే సమస్య ఏమిటి?

శాస్త్రజ్ఞుల, విశేషజ్ఞుల పై వాదనలు అసమంజసంగా ఉన్నాయి. రైతు క్షేమం, రైతు ఆదాయం పెరగడం లక్ష్యంగా పెట్టుకుని ఆధునిక యంత్రీకరణ ఒకేఒక పరిష్కారంగా పరిగణిస్తున్నారు. దానికై వ్యవసాయ వైశాల్యాన్ని పెంచడం అత్యవసరం అని వక్కాణిస్తున్నారు. ఇది సాధ్యం కావాలంటే సన్న, చిన్నకారు రైతులను సమిష్టీకరణ చెయ్యడం, కమతాల వైశాల్యాన్ని ఆధునిక సాంకేతికత, ఆర్థిక వ్యయాలకు సరితూగేలా పెంచడం జరగాలి. ఈ చర్చలలో రైతుల సాంప్రదాయాలు, వారి ఆశయాలు, స్థానిక సంస్కృతి, సమూహాల చరిత్ర, స్థానిక వాతావరణ పరిస్థితులు, వగైరాల ప్రమేయం ఎక్కువగా కనిపించదు. స్వంత భూమి, స్వతంత్ర వ్యవసాయం, భూమి హక్కులు లాంటివి వీరి చర్చలలో కనిపించటం లేదు. వీటిని ప్రభావితమైన అంశాలుగా విశేషజ్ఞులు పరిశీలించటం లేదు. రైతుల భవిష్యత్తుకై ఎవరూ పూచీకత్తు ఇవ్వటం లేదు. గత ఏడు దశాబ్దాలుగా వైజ్ఞానికులు, విశేషజ్ఞులు, రాజకీయ నాయకులు ఏవిధంగా నిర్దయతో, స్వార్థంతో సాంకేతికత, అధిక ఉత్పత్తి, ఆహార భద్రత పేరుతో రైతుల జీవితాల్లో కష్ట నష్టాలను నింపారో, వారిని ఆత్మహత్యలకు దారితీయించారో, ప్రకృతి వైపరీత్యాలను పెంచి (అతి వాడకం వల్ల) పెట్టుబడులు అతిగా పెంచి విత్తనాలపై, ఎరువులపై, పురుగు మందులపై అధిక వ్యయాన్ని రైతులతో చేయించి, అన్ని రకాలుగా వ్యవసాయాన్ని కష్టభరితంగా, నష్టపరంగా చేసిన ఈ విశేషజ్ఞులు, మరో పెద్ద వైపరీత్యాన్ని బడుగు వర్గాల రైతుల జీవితాల్లోకి, వారి తరువాతి తరాన్ని కూడా నాశనం చేయడానికి సన్నద్ధమయ్యారు.



## సంపాదకీయం

ఇలాంటి సాంకేతిక వైపరీత్యాలను రైతులకై విశేషజ్ఞులు, శాస్త్రజ్ఞులు పొందుపరుస్తుంటే, భారత ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయం దేశమంతా ఆచరించాలని, ప్రతి గ్రామ వ్యవసాయానికి కావలసిన ఇన్‌పుట్‌లను అక్కడే సమీప ప్రాంతాల్లోనే తయారు చేసుకోవాలని, రసాయనాల వాడకం క్రమ క్రమంగా తగ్గించాలని, సాంకేతిక పరిశోధనలు ప్రకృతి వ్యవసాయానికి అనుకూలంగా ఉండాలని, ప్రతి గ్రామం తద్వారా భారత దేశం 'ఆత్మనిర్భరత'ను త్వరలో సాధించాలని, స్వయం సమృద్ధి, పుష్కలంగా ఆహారం, సమతుల ప్రకృతి వనరుల ఉపయోగం, ప్రకృతి పునరుత్పత్తి తత్వాన్ని సమయోచితంగా ఉపయోగించడం లాంటివి సమాజంలోని అన్ని వర్గాలు గంభీరంగా చేపట్టాలని ఆదేశించింది.

ఆధునిక సాంకేతికతకు ప్రకృతి వ్యవసాయానికి ఎంత పొత్తు కుదురుతుందో ఎవరికీ అవగాహన లేనట్టుగా ఉంది. 'ఎవరికి వారే యమునా తీరే'లా ప్రైవేటు సంస్థలు తమ స్వార్థ ఉద్దేశ్యాలకై ఆధునిక సాంకేతికతను ప్రజలపై రుద్దడానికి మీడియా, విదేశీ భారీ సంస్థల ఆర్థిక సహాయం, దేశభక్తి లేని రాజకీయ పాలకులు, నాయకులు ('జయచంద్' లాంటివారు) వీరి తోడుతో ప్రజలను ఆకర్షిస్తున్నారు. ఆధునిక సాంకేతికత, పెద్ద యంత్రాలు కాని, కృత్రిమ మేధస్సు కాని, వీటివల్ల ప్రకృతిపై ప్రభావం సమాజ జీవనంపై, భారతీయ సంప్రదాయంపై మన సంస్కృతిపై, మనుష్యుల బంధాలపై పడే సాంఘిక, ఆర్థిక, మానసిక నష్టాలను, ప్రతికూల ప్రభావాలను దాచిపెడుతున్నారు. వీటిగురించి చర్చించేవారిని వెలివేస్తున్నారు.

వచ్చే రెండు మూడు సంవత్సరాలు వ్యవసాయానికి గడ్డు రోజులు. సరియైన నిర్ణయాలు సంపూర్ణ చర్చల ద్వారా రైతుల క్షేమం, లాభం లక్ష్యంగా సమాజంలోని అన్ని వర్గాలు, వేరువేరుగా, సమిష్టిగా సమగ్ర సంభాషణలు జరపాలి. యువతరాన్ని సంపూర్ణంగా ఇందులో పాల్గొనేట్లు చేయాలి. మన నిర్ణయాలు వారి "ఆధునిక సాంకేతిక, కృత్రిమ మేధస్సుతో కూడిన లోప భూయిష్టమైన వ్యవసాయ పద్ధతులను అవలంబిద్దామా? మనకై మనమే నిర్ణయించుకోవాలి.

దీనికై 'పల్లెసృజన' వేదిక కావడానికి సిద్ధంగా ఉంది. మీ ఆలోచనలు, విమర్శలు, స్పందన, భవిష్యత్తు కార్యాచరణలు తెలపండి. ఉమ్మడిగా మన రైతులను కాపాడుకుందాం. వారి భవిష్యత్తు సునాయాసం చేద్దాం. మన చిరంజీవుల జీవితాలకు ఒక సుగమ మార్గాన్ని తయారు చేద్దాం.

ఈ సంచికలో మూడు అతి ప్రభావితమైన ఇన్నోవేషన్లను మీకు అందిస్తున్నాం. 41 శోధయాత్ర 'నారాయణ్‌పేట్' జిల్లాలో జరిగినప్పుడు ఇన్నోవేటర్ 'ముక్తుం'ను కలుసుకున్నాం. వారి "సాంప్రదాయం, ఆధునిక సాంకేతికతలను మేళవించి తయారు చేసిన స్ప్రేయర్" చూడటం జరిగింది. ఎద్దుల బండిపై స్ప్రేయర్‌ను వాడటం, సునాయాసంగా పొలంలో పురుగు మందు పిచికారి చేయడం ఎంతో కనువిందుగా ఉంది. 'నాగస్వామి' తయారు చేసిన "వరినాటు యంత్రం" చూడ్డానికి సులభంగా ఉన్నా అత్యంత కౌశల్యంతో రైతుల కష్టాలు నివారించడానికే తయారు చేసాడు. ఖర్చు తక్కువ, రైతుకు లాభం ఎక్కువ. మూడవ ఇన్నోవేషన్ మెట్‌పల్లి వాసి 'మెండె శ్రీనివాస్' చేసింది. ఇదొక విప్లవాత్మక ఇన్నోవేషన్. అందరూ సాంకేతిక వైపే మొగ్గుతూ, ఎక్కువ ఖర్చు పెడుతూ రైతుల సమస్యలు పరిష్కరిస్తుంటే, శ్రీనివాస్ రైతు ఖర్చు, కష్టం, నష్టం, వాతావరణంపై ప్రభావం ఇన్నోవేషన్ ఉత్పత్తికై వనరుల ఉపయోగించడం లాంటి ఎన్నో తగ్గించి, రైతు నీటిని పంపు చేయుటంలోని అత్యధిక సమస్యలకు పరిష్కారం చూపించాడు తన ఇన్నోవేషన్‌తో. ఈ మూడు ఇన్నోవేషన్లను పాఠకులకు పరిచయం చేయడం 'పల్లెసృజన' అదృష్టంగా భావిస్తుంది. మీరంతా ఈ అద్భుత ఇన్నోవేషన్లను ఆదరిస్తారని, వాటిని ఉపయోగించి, లాభసాటిగా వ్యవసాయం సాగిస్తారని మనసారా ఆశిస్తున్నాం.

వర్షాలు పడ్డాయి కాని, రైతులకు కొన్ని ఇబ్బందులను కలిగించాయి. ప్రకృతి రైతుకు వచ్చేచ మూడు నాలుగు నెలలు సంపూర్తిగా సహకరిస్తుందని, వారి కృషికి తగిన ఫలితాన్ని వారికి చేరేట్టుగా చేస్తుందని ఆశిస్తూ..... అంతటా శాంతిని కోరుతూ....

భవదీయ

బ్రిగేడియర్ పోగుల గణేశం (రిటైర్డ్)

### 'పల్లెసృజన' చందాదారులు కండి - స్థానిక జ్ఞానం విశ్వవ్యాప్తం కావటానికి తోడ్పడండి

'పల్లెసృజన' ద్వారా ఎన్నో పునాది స్థాయి ఇన్నోవేషన్లు, ఇన్నోవేటర్లు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందటంతో పాటు వారి ఇన్నోవేషన్లు కూడా విస్తృత స్థాయిలో సమాజం వినియోగించటం జరుగుతోంది. తక్కువ ఖర్చుతో, ఎక్కువ పనితనాన్ని అనుభవిస్తున్న వినియోగదారులే ఇందుకు సాక్షి. కావున 'పల్లెసృజన' పత్రికను మీరు చదవటమే కాదు, మీ తోటి వారికి కూడా ఈ పత్రికను గురించి తెలియజేసి, వారిని చందాదారులుగా చేర్పించండి. పునాది స్థాయి జ్ఞానాన్ని ప్రపంచ స్థాయికి చేర్చడంలో మీరూ సహకరించండి. -ఎడిటర్

# నాగస్వామి స్వయం కృషి
# సామాన్య రైతుకు అందుబాటులో వరి నాటు యంత్రం




కామారెడ్డి జిల్లా, బిక్కనూరు మండలం, కాచాపూర్ గ్రామానికి చెందిన కమ్మరి సిద్ధరాములు, పుష్పలతల ప్రథమ పుత్రుడు కమ్మరి నాగస్వామి చారి (వయస్సు 32 సంవత్సరాలు). తమ్ముడు సంగీత్ కుమార్ చారి ప్రస్తుతం ఇంజనీరింగ్ చదువుతున్నాడు. ఇతనికి భార్య, ఒక కుమారుడు (రెండవ తరగతి), కుమార్తె (అంగన్ వాడికి వెళ్తోంది) ఉన్నారు.

నాగస్వామి చిన్న వయస్సులోనే తండ్రి అపెండిసైటిస్ వ్యాధితో చనిపోయాడు. తల్లి పుష్పలత బీడీ కార్మికురాలిగా ఎంతో కష్టపడి, తన ఆర్థిక ఒడిదుడుకు లను ఎదుర్కొని పదవ తరగతి వరకు చదివించింది. ఉన్నంతలోనే బ్రతికుదెరువు కొనసాగించే వారే తప్ప ఇతరులను యాచించేవారు కాదు. పదవత తరగతి తరువాత ఇక పెద్ద చదువులు చదివే స్థోమత లేదని డ్రిల్లింగ్ పనులు చేసే వారివద్ద కూలీగా చేరి అక్కడ డ్రిల్లింగ్ పనులు నేర్చుకున్నాడు. ఈవిధంగా ఒక సంవత్సరం గడిచిన తర్వాత నాగ స్వామికి దేవుడిచ్చిన మేనమామగా ఎదురింట్లోనే వున్న ఉపాధ్యాయుడు కృష్ణ చైతన్య రూపంలో లభించి, వీరి బ్రతుకు తెరువుకు అవసర మైన చదువులకు ఆర్థికంగా, హార్థికంగా ఎంతో సహకరించాడు. అతని సహకారంతో 10వ తరగతి తర్వాత ఇంటర్మీడి యట్ లో (ఇడబ్ల్యు& యస్ఇఎ) ఒకేషనల్ కోర్సు చేశాడు. ఇంటర్ పూర్తయిన వెంటనే ఎలక్ట్రిక్ సబ్ స్టేషన్ లో ఆపరేటర్‌గా ఉద్యోగం వచ్చింది. కానీ, ఉద్యోగానికి వెళ్ళకుండా, ఐటిఐ డిప్లమాకు వెళ్ళటం జరిగింది కానీ, తన కుటుంబ నేపథ్యం దృష్ట్యా చదువుపై శ్రద్ధ చూపలేక, దాన్ని కూడా పూర్తి చేయలేక పోయాడు.

ఐటిఐ నైపుణ్యంతో ఉద్యోగాన్వేషణకై హైదరాబాద్ చేరుకున్నాడు. అక్కడక్కడా పని చేస్తూ తమ్ముడిని మంచి చదువులు చదివించాలనే నిర్ణయంతో అతన్ని ఇంజనీరింగ్‌లో చేర్పించాడు. మంచి ఉద్యోగానికి వెళ్దామంటే ఎక్కడికి వెళ్ళినా అప్రెంటిస్ చేశావా, ఉద్యోగానుభవం ఎక్కడైనా పొందావా అంటూ ప్రశ్నిస్తున్నారే తప్ప ఉద్యోగం ఇవ్వటం లేదు. బ్రతుకు తెరువు కోసం ఇళ్ళల్లో కరెంటు వైరింగ్ పని చేసుకుంటూ జీవనం సాగించాడు నాగస్వామి. ఇలా అక్కడక్కడా పనులు చేస్తూ ఉంటే ఒక టీవీ యాజమాన్య సంస్థలో ఎలక్ట్రీషియన్‌గా ఉద్యోగం లభించింది. ఒక సంవత్సరం పాటు అందులో పని చేశాడు. ఆ తర్వాత హైదరాబాద్ లోనే మరో సంస్థలో కాస్త జీతం ఎక్కువ ఇచ్చేలా మరో ఉద్యోగానికి మారటం జరిగింది. అక్కడ రెండు సంవత్సరాలు ఉద్యోగ జీవితం గడిపాడు. ఆ తర్వాత తల్లి పుష్పలత నాగస్వామికి 'ఆమణి'తో 2014లో వివాహం జరిపించింది. వివాహం తర్వాత హైదరాబాద్‌లోని 'కిమ్స్' ఆసుపత్రిలో ఎలక్ట్రీషియన్‌గా ఉద్యోగం లభించింది. ఆ ఉద్యోగం ఒక సంవత్సరం చేసిన తర్వాత తన ఆరోగ్యం కాస్త దెబ్బ తినటం, తనకు ఒక కుమారుడు జన్మించడం లాంటి కారణాల వల్ల ఆ ఉద్యోగం కూడా వదులుకుని, స్వగ్రామం చేరవలసి వచ్చింది. గ్రామంలో రైతుల కష్టాలు కొద్ది కొద్దిగా అర్థమయ్యాయి. వరినాటు వేయటానికి కూలీల లేమి, చిన్న కమతాల్లో యంత్రాలతో నాటు వేయలేని పరిస్థితిని గమనించి, చిన్న, సన్నకారు రైతులకు కూడా అనూకూలమైన చిన్న నాటు వేసే యంత్రం బావుండేదని ఆలోచించాడు. వాటి గురించిన సమాచారాన్ని ఇంటర్‌నెట్ లో శోధించడం ప్రారంభించాడు.

ఆ సమయంలో కరోనాతో ఇల్లు కదలలేని పరిస్థితి. ఏదో ఒక పని చేసుకోకుంటే తప్ప ఇల్లు గడవటం

**వరినాటు యంత్రం ద్వారా నారు పొసే విధానమే ప్రత్యేకమైనదని గ్రహించి, ఆ నారు పొసే విధానాన్ని కూడా పరిశీలించాడు. ఇలా వివిధ రకాల యంత్రాలను ప్రత్యక్షంగా, యూట్యూబ్‌లో పర్యవేక్షించాడు. ఆ తర్వాత తన మిత్రులతో ఇన్ని నారు నాటే యంత్రాలు ఉన్నపుడు వరి నాటేందుకు కూలీలతో ఎందుకు ఇబ్బంది పడుతున్నారు అని తన అనుమానాన్ని వ్యక్తం చేశాడు. అందుకు వారు ఈ యంత్రాలన్నీ పెద్ద పెద్ద నారుమడులలో నాటేందుకు పనికి వాస్తయి కానీ, మనలాంటి చిన్న చిన్న మడులలో నాటు వేసేందుకు పనికి రావు.**



కష్టమయ్యే పరిస్థితి. ఇలా ఉద్యోగాల వేటతోనే జీవితం అంతా గడిచి పోవాలా? మరో మార్గం లేదా అని ఆలో చించాడు. ఈ బాధలన్నీ చూసిన తర్వాత తనకంటూ ఒక స్వంత పని ఏర్పాటు చేసుకుంటే బావుంటుందని ఆలోచించాడు నాగస్వామి. అదే సమయంలోనే తను పని చేసిన వివిధ ఉద్యోగాల వల్ల దాచుకున్న పి.ఎఫ్. డబ్బులు ఒక లక్ష రూపాయల దాకా వచ్చాయి. తన ఆలోచనలో మెదలుతున్న వరినాటు యంత్రం తయారు చెయ్యాలన్న ఆలోచనను తన తల్లితో పంచుకున్నాడు. ఈ పరిస్థితుల్లో డబ్బు వృధా చెయ్యకుండా మంచి ఆలోచన చెయ్యమని సలహా ఇచ్చారు తల్లి, భార్య. మొదట ప్రోత్సాహం ఇవ్వక పోయినా, ఆ తర్వాత సరే నీకంతగా నమ్మకం ఉంటే వరినాటే యంత్రం తయారు చెయ్యమని ప్రోత్సహించారు.

ఇట్లో తనకు ప్రోత్సాహం లభించటంతో తన మిత్రుల పొలాలకు వెళ్ళి నారుమడులను బాగా పరిశీలించడం, సమీపంలో ఎవరైనా యంత్రంతో వరినాటు వేస్తున్నారని తెలుసుకొని అక్కడికి వెళ్ళి దాన్ని తదేకంగా పరిశీలించడం చేశాడు. వరినాటు యంత్రం ద్వారా నారు పొసే విధానమే ప్రత్యేకమైనదని గ్రహించి, ఆ నారు పొసే విధానాన్ని కూడా పరిశీలించాడు. ఇలా వివిధ రకాల యంత్రాలను ప్రత్యక్షంగా, యూట్యూబ్‌లో పరిశీలించాడు. ఆ తర్వాత తన మిత్రులతో ఇన్ని నారు నాటే యంత్రాలు ఉన్నపుడు వరి నాటేందుకు కూలీలతో ఎందుకు ఇబ్బంది పడుతున్నారు అని తన అనుమానాన్ని వ్యక్తం చేశాడు. అందుకు వారు ఈ యంత్రాలన్నీ పెద్దపెద్ద నారుమడులలో నాటేందుకు పనికి వాస్తయి కానీ, మనలాంటి చిన్న చిన్న మడులలో నాటు వేసేందుకు పనికి రావు. పైగా వీటి ఖరీదు ఎక్కువ కాబట్టి మన సమీపంలో ఎవ్వరూ వీటిని కొనుగోలు చెయ్యలేదు. ఇక చైనా, జపాన్ లాంటి దేశాల్లో చిన్న చిన్న యంత్రాలు తయారైనట్టు యూట్యూబ్‌లో వస్తున్నా, అవి మన నారుమళ్ళకు సరిపోయేలా ఉండవు. ఇలాంటి ఎన్నో విషయాలను తన



మిత్రుల ద్వారా అవగతం చేసుకున్నాడు. ఆ తర్వాత మన రైతులకు అనువుగా, మన టెక్నాలజీతో ఒక నారునాటే యంత్రాన్ని ఎలాగైనా తయారు చెయ్యాలని పూనుకుని పని మొదలు పెట్టాడు.

మొదట యంత్రం నమూనాను ఒక పేపరుపైన గీసుకుని, ఆ తర్వాత దాన్ని తయారు చెయ్యటానికి అవసరమైన పనిముట్లను (కటింగ్, వెల్డింగ్ యంత్రాలు మొదలైనవి) కొనుగోలు చేసి ఇంటివద్దనే యంత్రం తయారీకి పూనుకున్నాడు. యంత్రం తయారు చేయటానికి మొదల పెట్టినపుడు ఎలాగైనా మూడు నాలుగు ట్రయల్స్‌లోనే యంత్రం పరిపూర్ణంగా తయారు చెయ్యాలని నిర్ణయించుకున్నాడు. అలాగే తయారు చేశాడు కూడా. మొదటి ప్రయత్నం విఫలమైంది. అందులోని లోపాలను సరిచేసి మళ్ళీ రెండోసారి పరీక్షించాడు. అది కూడా విఫలమైంది. తనకు తోచిన లోపాలను సరిదిద్ది మూడవసారి పరీక్షించాడు. యంత్రం నాటు వేసింది కానీ, అక్కడక్కడా రంధ్రాలు ఏర్పడ్డాయి. అంటే కొన్నిచోట్ల నాటు వెయ్యకపోవటం వల్ల సాలులో ఎక్కువగా ఖాళీ ప్రదేశాలు కనబడ్డాయి. అది ఎందుకలా జరిగిందని పరిశీలించి, ఆ లోటును సరిదిద్ది, నాలుగోసారి పొలంలో పరీక్షించగా విజయవంతంగా నాటు వేయటం జరిగింది.

తనకున్న 30 గుంటల భూమిలో వరిని నాటుకోవటం జరిగింది. తన ప్రయత్నం విజయవంతం కావటంతో ఈ యంత్రం పనితనాన్ని తన మొబైల్‌లో వీడియో తీసి, తన గ్రామానికి చెందిన ఒక వాట్స్‌యాప్ గ్రూప్‌లో పోస్టు చేశాడు. అంతవరకు తాను వరినాటు వేసే యంత్రం తయారు చేస్తున్నట్టు తనకు సన్నిహితులు, కుటుంబ సభ్యులకు తప్ప ఇతరులెవరికీ తెలియదు. అలా ఆ వీడియో చుట్టు పట్ల గ్రామాలకు కూడా తెలిసి, యంత్రం పనితీరును చూడటానికి చాలామంది రైతులు వచ్చి వెళ్ళారు. ఈ విషయం అలా అలా ప్రచారమై జిల్లా వ్యవసాయ అధికారులు, వారి ద్వారా కలెక్టర్ వరకు వెళ్ళింది.



ఒక సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన యువకుడు స్వదేశీ పరిజ్ఞానంతో మొట్టమొదటిసారి మన వాతావరణానికి, మన భూములను అవసరమైన వరినాటే యంత్రం తయారు చేసినందుకు అభినందించారు. దీని ప్రత్యేకత ఏమిటంటే, ఇందులో పెద్దగా రిపేర్లు వచ్చే సమస్య ఉండదు. ఒకవేళ వచ్చినా రైతు వీలైనంత వరకు తనంతట తానే రిపేరు చేసుకోవచ్చు. లేదా సమీపంలోని ఏ మెకానిక్ వద్దకు తీసుకు వెళ్ళినా అతను దాన్ని సులభంగా అర్థం చేసుకుని మరమ్మత్తులు చేసి ఇవ్వగలిగేంత సులభమైన సాంకేతికతతో కూడుకున్నది ఈ యంత్రం.

ఈ యంత్రం తయారు చెయ్యటానికి దాదాపు 2 సంవత్సరాల సమయం పట్టింది. సుమారుగా 50 వేలకు పైగా డబ్బు ఖర్చయింది. మొత్తంమీద తాను అనుకున్నది సాధించి, సామాన్య రైతుకు అందుబాటు ధరలో లభించేలా, చిన్న కమతాలలో సైతం వరినాటు సులభంగా వేసుకునేలా యంత్రాన్ని తయారు చేశాడు నాగస్వామి.

అయితే ఇక్కడ రైతులు ఒక విషయం గమనించాలి. ఈ యంత్రంతో వరినాటు వెయ్యాలి అనుకున్న రైతులు ముందుగా వరి నారును సాధారణ పద్ధతిలా భూమిలో (వరిమడిలో) నేరుగా పెంచకూడదు. ఒక ప్లాస్టిక్ పేపర్ ను వరిమడిలో పరిచి, వాటిపైన నారు పోసి పెంచాల్సి ఉంటుంది. నారును 15 నుండి 25 రోజుల లోపలనే నాటాల్సి ఉంటుంది. ఎక్కువ రోజులు అయినట్లయితే వేరు వ్యవస్థ బాగా పెరిగిపోయి, యంత్రంతో నాటు వెయ్యటం చాలా ఇబ్బందిగా ఉంటుంది.

వరి మాగాణిలో యంత్రాన్ని సులభంగా ఒక వ్యక్తి లాక్కుంటూ





యంత్రంతో నాటు వేసిన రోజు

నాటిన 10 రోజుల తర్వాత

వెళ్తే, వెనకాల ఈ యంత్రంలో ఏర్పాటు చేసిన చిన్న మోటారు పని చెయ్యటం ద్వారా యంత్రం వరిని నాటు వేసుకుంటూ వస్తుంది. ఈ యంత్రం 5 సాళ్ళలో వరిని నాటుతుంది. వరినాటు వేసే సమయంలో మరో వ్యక్తి సహాయకారిగా ఉండటం చాలా అవసరం. ఎందుకంటే, యంత్రంలో ఏర్పాటు చేసిన దానికన్నా నారు ఎత్తుగా ఉన్నట్లయితే ఆ ఎత్తయిన నారు పిలకలను కత్తిరించి, యంత్రంలో సర్దాల్సి ఉంటుంది. సాధారణంగా ఒక ఎకరం వరినాటును మనుషుల ద్వారా వేయించాలి అంటే 5 నుండి 8 మంది కూలీలు అవసరం. అంటే ఎకరాకు కనీసం 5 నుంచి 6 వేల దాకా ఖర్చవుతుంది. ఈ యంత్రం ద్వారా కేవలం ఇద్దరు వ్యక్తులు 2 ఎకరాలలో వరి నాటవచ్చు. సాధారణంగా కూలీలు నాటే వరి ఎక్కువ లేదా తక్కువ లోతుగా నాటడం జరుగుతుంది. కానీ ఈ యంత్రం ద్వారా సమాన లోతులో వరి నాటడం జరుగుతుంది. కాబట్టి పొలం అంతా ఒకే ఎత్తులో పెరిగి సరియైన దిగుబడి వస్తుంది. నాటు వేసే విధానం కూడా సాళ్ళుగా ఉంటుంది కాబట్టి మాగాణిలో కలుపు తీయటం కూడా చాలా సులభంగా వుంటుంది.

ఈ యంత్రం ద్వారా వరి నాటు వేసుకోవటం వల్ల నాటే సమయం నుండి నూర్పిడి సమయం వరకు ఎన్నో రకాలుగా కూలీల ఖర్చు తగ్గి, దిగుబడి పెరిగే అవకాశాలు మెండుగా ఉంటాయి. కాబట్టి రైతుకు దిగుబడి పెరిగి అందువల్ల రాబడి కూడా పెరుగుతుంది. ముఖ్యంగా కూలీల ఖర్చు చాలావరకు తగ్గుతుంది.

నాగస్వామి తయారు చేసిన ఈ వరి నాటు యంత్రాలు పెద్దయెత్తున తయారు చేసి, రైతాంగానికి అందించేందుకు ప్రభుత్వం, సమాజం ముందుకు రావాల్సిన అవసరం ఉంది. ఇతనికి అవసరమైన సలహాలు, సూచనలను అందించేందుకు 'పల్లెసృజన' తన శాయశక్తులా కృషి చేస్తుంది. 50 వేల రూపాయలకన్నా తక్కువ ఖరీదులో రైతుకు ఈ యంత్రం అందుబాటులో అతి త్వరలో వచ్చేందుకు ఇన్నోవేటర్ నాగస్వామి కృషి చేస్తున్నాడు. వచ్చే సీజన్ లోగా ఈ యంత్రం రైతులకు తప్పక అందుబాటులోకి రావటానికి అన్ని ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఊరికి ఒకటి రెండు ఈ యంత్రాలు ఉంటే చాలు . గ్రామంలో రైతులకు వరినాటు వల్ల అయ్యే ఖర్చు చాలా తగ్గుతుంది.

**ఇన్నోవేటర్ కమ్మరి నాగస్వామి ఫోన్ : 9908070307**

# సాంప్రదాయం ఆధునికత సమ్మేళనమే మక్తుం అలీ సృజన

# ఎడ్లబండితోనే పంటలపై పిచికారి



- వీరరాఘవ రెడ్డి

వ్యవసాయం గురించి ఎవరు ఎన్ని మాటలు చెప్పినా, పరిష్కారాలు చూపినా ఇంకా అవసరం అవుతునే ఉన్నాయి, ఉంటాయి కూడా. ఒక పరిష్కారం చూపి, ఇది ఎంతో ఉపయోగకారి, దీన్ని అందరు రైతులు వినియోగించుకోవాలి అంటే కుదరదు. ఎందుకంటే వ్యవసాయంలో ప్రతి పని ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకంగా చేస్తారు. అంతెందుకు ఒకే ఊర్లోని రైతులు ఒక్కొక్కరు ఒక్కో పద్ధతి వినియోగిస్తూ ఉంటారు. కాబట్టి రైతుకు ఆర్థికంగా, శారీరకంగా ఊరటనిచ్చే ఎటువంటి ఇన్నోవేషన్ అయినా అది ఎంతోకొంత మందికి ఉపయోగి పడుతుందే తప్ప వృధా కాదు అని విశ్వసిస్తుంది 'పల్లెసృజన'.

ప్రస్తుతం రైతు తన పంటలకు పురుగు మందు పిచికారి చేయకుండా పంట చేతికొచ్చే సమస్యే లేదు అన్నంతగా తయారైంది పంటల పరిస్థితి. అది సేంద్రియ పురుగు మందు కావచ్చు, లేదా రసాయనిక పురుగు మందు కావచ్చు. ఏదైనా సరే పంటపై తప్పక పిచికారి చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పురుగు మందుల పిచికారి చూస్తుండగానే అతి కొద్ది సమయంలో ఎన్నో రకాల మార్పులు చోటు చేసుకున్నాయి. ఒకప్పుడు చేతితో ఒక కడ్డీని పైకి, క్రిందకు ఆడిస్తూ పురుగు మందు పిచికారి చేసేవారు. అలాగే ఎక్కువ పరిమాణంలో పిచికారి చేయాల్సిన వారు పంపును కాలితో తొక్కడం ద్వారా పురుగు మందు పిచికారి చేసేవారు. ఈ రెండు విధానాల్లో కూలీల ఖర్చు, శ్రమ అధికంగా ఉండేది. ఆ తర్వాత పెట్రోలు ఆధారంగా పనిచేసే పంపులు వచ్చాయి. దీనివల్ల శ్రమ తగ్గింది కానీ, పెట్రోలు ఖర్చు అదనంగా మారింది. అయినా కూలీల ఖర్చుతో పోలిస్తే కొంత వరకు రైతుకు లాభమే. కానీ, ఈ పద్ధతి వల్ల రసాయనిక పురుగు మందులు పిచికారి చేసేవాళ్ళు చాలామంది అనుపత్రుల పాలు కావడం, కొంతమంది చనిపోవడం, మరికొంత మంది శాశ్వత రోగగ్రస్తులుగా ఉండిపోవటం జరిగింది.

ఆ తర్వాత ట్రాక్టరు అనుసంధానిత స్ప్రేయర్ మార్కెట్‌లోకి వచ్చింది. ఈ స్ప్రేయర్ వల్ల చాలా తక్కువ ఖర్చు, సమయంతో ఎక్కువ విస్తీర్ణంలో మందు పిచికారి చేయటం జరుగుతోంది. ఇది కూడా కొంతమంది రైతులకు ఉపయోగించలేని స్థితి ఉంది. దానికి కారణం చిన్న చిన్న కమతాలు గల రైతులు ఎక్కువగా ఉండటం. వారి పొలం విస్తీర్ణం చాలా తక్కువగా ఉంటుంది కాబట్టి ఆ చిన్న పొలంలో ట్రాక్టరు అటు, ఇటు తిరగటం కుదరదు. ఒకవేళ కుదిరినా, ట్రాక్టర్ తిరగటం వల్ల ఏర్పడే పంట నష్టం రైతుకు ఎంతో నష్టదాయకం.

ఈ సమస్యకు పరిష్కారం కనుగొన్నాడు నారాయణ్‌పేట్ జిల్లా, నర్వ మండలం, కల్వాల్ గ్రామ రైతు "మక్తుం అలీ". 35 సంవత్సరాల వయసుగల ఈ యువ రైతుకు ఒకటిన్నర ఎకరం పొలం ఉంది. స్వంతంగా ఎద్దులను పోషించే స్థోమత లేదు. కాబట్టి కిరాయి ఎద్దులతోనే తన వ్యవసాయ పనులు చేసుకుంటూ ఉంటాడు. ఇతని ప్రధాన పంటలు ప్రత్తి, మిరప. ఈ రెండు పంటలకూ పురుగు మందులను తప్పక వినియోగించాల్సిన పరిస్థితి ఏర్పడింది ప్రస్తుత వాతావరణంలో. తనది చిన్న కమతం కావటం వల్ల ట్రాక్టరుతో పిచికారి చేయించలేడు,



మనుషులతోనే చేయించాలంటే ఇప్పుడు కూలీలు మందు పిచికారికి అంటే వచ్చేవాళ్ళు చాలా తక్కువ. రోజంతా 20లీటర్ల నీటి ట్యాంకు బరువును మోయాలంటే చేతకాదు అని తప్పించుకునేవారు. వచ్చినా విపరీతమైన కూలీ అడుగుతున్నారు. ఈ సమస్యకు ఎలాగైనా పరిష్కారం కనుగొనాలి అనుకున్నాడు మక్తుల అలీ.

పురుగు మందు పిచికారీకి మనుషులు లభించక పోవటంతో తన స్నేహితుడిని ఎద్దుల బండితో కిరాయికి తీసుకుని, దానిపైన రెండు నీటి డ్రమ్ములను ఏర్పాటు చేసి, అందులో పురుగు మందు కలిపి, బండిపైన కూర్చుని పంటపై పురుగు మందు పిచికారి చేశాడు. ఈ పద్ధతి కూడా చేసేందుకు మనుషులు రావటం మానేశారు. దానికి కారణం కూర్చొని పురుగు మందు పిచికారి చేసినా, గాలికి పురుగు మందు ముఖం పైకి రావటం వల్ల అనారోగ్యానికి లోనవుతామనే భయం వల్ల ఈ సమస్య ఏర్పడింది. అప్పుడు వచ్చింది మక్తుం అలీకి ఒక ఆలోచన.

ప్రత్తి, మిరప లాంటి పంటలలో పురుగు మందు ట్రాక్టరుతో పిచికారి చెయ్యాలంటే ట్రాక్టరు ద్వారా చేయటం వల్ల పంట నష్టం జరుగుతుంది. దీనికి పరిష్కారం ట్రాక్టరు టైర్ల వెడల్పు తక్కువగా ఉండాలి. కాబట్టి ట్రాక్టరుకన్నా, ఎద్దుల బండికే ట్రాక్టరు లాగా స్ప్రేయర్‌ను ఏర్పాటు చేస్తే బావుంటుంది కదా అనుకున్నాడు. తోచిందే తడవు తన స్నేహితుడిని అడిగి తన ఆలోచనను సమీప పట్టణంలోని స్ప్రేయర్లు రిపేరు చేసే వ్యక్తి వద్దకు వెళ్ళి తన ఆలోచన ప్రకారం ఎద్దుల బండికి అమర్చుకునేలా ఒక స్ప్రేయర్‌ను తయారు చేయించాడు. ఈ పద్ధతి తాను ఊహించిన దానికన్నా ఎక్కువ ఫలితాన్ని ఇచ్చింది.

సాధారణంగా వీపుకు తగిలించుకునే స్ప్రేయర్‌తో పిచికారి చేయటం వల్ల పంటను ఆశించిన దోమ లాంటిది మందు పిచికారి చేసే సమయంలో ప్రక్కకు వెళ్ళి కాసేపటి తర్వాత మళ్ళీ పంటను ఆశించి నాశనం చేస్తుంది. కానీ, ఇలా ఎద్దుల బండికి పిచికారి చేయటం వల్ల పురుగు మందు ఒకసారి 5-6 సాళ్ళకు వేగంగా పిచికారి చేయటం వల్ల దోమ వేరేచోటకి పారిపోయే అవకాశం లేక అక్కడికక్కడే చనిపోతుంది. ఈ విధంగా పంటకు చాలావరకు లాభం చేకూరి, పురుగు మరియు దోమల ధాటి తక్కువ అవుతుంది. ఇది ప్రధానంగా చేకూరే లాభం అయితే, బండి తోలే మనిషి ముందు వైపు ఉంటాడు, ఎద్దులు ఇంకా ముందుకు ఉంటాయి. అంటే పురుగు మందు పిచికారి జరుగుతున్న స్థలానికి, ఎద్దుబండి తోలే మనిషికి మధ్య దూరం రెండు మీటర్లకు పైగా





ఉంటుంది, అలాగే మందు పిచికారి అయ్యే వద్దనుండి ఎద్దులు 3-4 మీటర్ల దూరం ఉంటుంది. కాబట్టి మనిషికి కానీ, ఎద్దులకు కానీ ఎటువంటి ప్రమాదం ఉండదు. డ్రమ్ములో పురుగు మందు అయిపోయిన వెంటనే రైతు సమీపంలో గల వాగు లేదా కుంట వద్దకు వెళ్ళి ఈ స్ప్రేయర్‌కే ఏర్పాటు చేసిన పంపు సహాయంతో నీటిని తోడుకుని, మళ్ళీ పొలంలోకి వచ్చి పంటపై పిచికారి చేస్తాడు. పొలానికి నీటి కయ్యలు దూరంగా ఉన్నచోట్ల అయితే ఇద్దరు ముగ్గురు చేయాల్సిన పని కేవలం ఒక వ్యక్తి రెండు ఎద్దులతో చేయటం వల్ల ఎంతో ఉపయోగకారిగా తయారైంది ఈ స్ప్రేయర్. మక్తుం అలీ తయారు చేయించిన స్ప్రేయర్ ఇప్పుడు తన మిత్రుడైన ఎద్దుల బండి యజమానికి ఒక పెద్ద జీవనాధారంగా మారింది.

ఈ స్ప్రేయర్ కొత్తది తయారు చెయ్యటానికి 45 వేల రూపాయల వరకు ఖర్చవుతుందని అంటున్నాడు మక్తుం అలీ. ఇలా ప్రతి రైతు తమ సమస్యలకు పరిష్కారాలను ఆలోచించి తగిన పరికరాలను తయారు చేసుకో గలిగితే శ్రమతో పాటు, ఖర్చు కూడా మిగలటం వల్ల రైతుకు అదనపు ఆదాయం సమకూరినట్లే. ఈ స్ప్రేయర్ తయారు చేయించుకోవాలి అనుకున్న రైతులు ఇన్నోవేటర్‌ను సంప్రదించండి.

ఆధునిక సాంకేతికత - సాంప్రదాయ ఎద్దుల బండిని కలిపి తయారు ఈ స్ప్రేయర్ మక్దుంను ఒక విశిష్ట ఇన్నోవేటర్‌గా సమాజం గుర్తిస్తుంది. ఇలాంటి ఇన్నోవేషన్లు వ్యవసాయంలో మరిన్ని వస్తాయని 'పల్లెసృజన' విశ్వాసం. మక్దుం ఇన్నోవేషన్‌కు రాష్ట్ర స్థాయిలో, జాతీయ స్థాయిలో గుర్తింపుకై 'పల్లెసృజన' ప్రయత్నిస్తుంది. ఈ ఇన్నోవేషన్‌కు దేశమంతా తెలియపర్చటానికి కూడా పూర్తి సహకారం అందిస్తుంది. ●

**ఇన్నోవేటర్ మక్తుం అలీ, ఫోన్ : 97038 20608**

# నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) - ఇండియా

స్వయంప్రతిపత్తి గల సంస్థ, శాస్త్ర సాంకేతిక శాఖ, భారత ప్రభుత్వము.

National Innovation Foundation-India

# జాతీయ 13 వ ద్వైవార్షిక పోటీలు



**పునాది స్థాయిలో సహాయం అందని సాంకేతిక ఆవిష్కరణలు (ఇన్నోవేషన్లు) మరియు సంప్రదాయ జ్ఞానముల గుర్తింపు**

## ఆకాశాన్ని అందుకోవాలన్న ఆశ....

**నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్** (ఎన్.ఐ.ఎఫ్.) తన 13వ జాతీయ ద్వైవార్షిక పోటీలకు గాను ఎవరి సహాయమూ లేకుండా రూపొందించిన పునాది స్థాయికి చెందిన సాంకేతిక ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞానం గురించిన దరఖాస్తులను కోరుతున్నది. ఈ ఇన్నోవేషన్లను రైతులు, కళాకారులు, చేతివృతుల వారు, జాలర్లు, మహిళలు వ్యక్తిగతంగా కాని, సామూహికంగా కాని పంపవచ్చు. మహిళలు, మురికి వాడల్లో నివసించే వారు, వర్క్‌షాప్ మెకానిక్‌లు, విద్యార్థులు, స్థానిక సమాజాలకి ప్రాధాన్యత ఇవ్వబడును. ఈ సృజనలు వ్యవసాయం (పనిముట్లు, యంత్రములు, కొత్త పద్ధతులు, కొత్త వంగడాలు మొదలైనవి), గృహోపకరణాలు, రవాణా, శక్తి (ఎనర్జీ), ఉత్పత్తి/ పరిరక్షణ, పని భారాన్ని తగ్గించటము, మూలికా వైద్యము (మానవులు మరియు జంతువులు) మొదలైన వాటికి సంబంధించినవై మరియు తక్కువ ఖర్చుతో కూడుకుని, ఎక్కువ కాలం మనగలిగి, పర్యావరణానికి హానికరం కానివై ఉండాలి. ఈ ఆలోచనలు లేదా నమూనాలు బయటివారి సహాయము/ పర్యవేక్షణ లేకుండా తాము స్వంతంగా తయారు చేసినవై, ఇతరుల నుండి ఎటువంటి సాంకేతిక సలహాలు తీసుకోకుండా రూపొందించినవై ఉండాలి. మహిళల కొరకు మహిళలచే, వికలాంగుల కొరకు వికలాంగులచే రూపొందించబడిన ఇన్నోవేషన్లు, ఉత్తమమైన సాంకేతిక జ్ఞానానికి ప్రత్యేకమైన బహుమతులు ఇవ్వబడుతాయి.

ఉత్తమమైన వాటిగా గుర్తించ బడిన వాటిలో జాతీయ మొదటి **బహుమతిగా రూ. 5,00,000, జాతీయ** రెండవ **బహుమతిగా రూ. 3,00,000, జాతీయ మూడవ బహుమతిగా రూ. 1,00,000లను వివిధ వర్గాలలో ఇవ్వబడును. జీవిత కాలపు సాఫల్యత పురస్కారం క్రింద రూ. 7,50,000లు గొప్ప ఇన్నోవేటర్‌కు లేదా ఇన్నోవేషన్లనే జీవితంగా ఏర్పరచుకొన్న వారికి ఇవ్వబడును.** అంతే కాదు **ప్రోత్సాహక బహుమతి క్రింది రూ. 10,000లను వివిధ వర్గాలలో ఎన్నుకోబడిన ఇన్నోవేషన్లు, సమాజ శ్రేయస్సుకు, పర్యావరణానికి తోడ్పడ్డ వాటికి ఇవ్వబడును.**

ఇవే కాక పునాది స్థాయిలో సాంకేతిక విజ్ఞానాన్ని వెతికి వెలికి తీయటానికి దోహదపడిన వ్యక్తులు లేదా సంస్థలకు కూడా గుర్తింపు ఉంటుంది. అదేవిధంగా సాంకేతిక జ్ఞానం కలవారు, పునాది స్థాయిలో ఇన్నోవేషన్లను వెలికి తీయటానికి కృషి చేసిన ఎలక్ట్రానిక్/ ప్రింట్ మీడియా జర్నలిస్టులకి కూడా గుర్తింపు ఉంటుంది. ఈ దరఖాస్తులను **31 మార్చి, 2023** లోగా మాకు చేరేలా పంపండి.

## దరఖాస్తు దారులకు గమనిక

**వ్యక్తిగతంగా కానీ, సమూహంగా కానీ ఎన్ని ఐడియాలనైనా వ్రాసి పంపవచ్చు.**
**మీ ఐడియా/ ఇన్నోవేషన్/ సాంప్రదాయ జ్ఞానానికి సంబంధించిన సాంకేతిక వివరాలు, ఫోటోలు, వీడియోలు ఏవి వున్నా పంపాలి.**
**దరఖాస్తుదారుడు తన విద్యార్హతలు, మీ వృత్తి వివరాలను తెలియజేయాలి.**
**మీ గుర్తింపు కార్డు (ఆధార్/ ఓటర్ కార్డు/ ప్రభుత్వం నుండి పొందిన ఏదైనా) కాపీని తప్పనిసరిగా జత చేయాలి.**
**మీ పూర్తి పోస్టల్ చిరునామా తప్పనిసరిగా పంపాలి.**

## దరఖాస్తు చేయుటకు చివరి తేది 31 మార్చి, 2023

**మీ ఆవిష్కరణలను పంపవలసిన చిరునామా :**

**National Innovation Foundation,**
**C/o Gram Bharati, Amrapur, Gandhi Nagar-Mahudi Road, Gandhi Nagar, Gujarat-382 721.**
**Phone: (02764) 350001/ 02/ 03/ 04/ 05/ 06 Email: campaign@nifindia.org, Website: www.nif.org.in**

**సూచన :** వృత్తిపరమైన అనుభవం కలవారు లేదా వృత్తి కళాశాలలో చదువుకొనే విద్యార్థులు ఎన్.ఐ.ఎఫ్. నుండి ఏవిధమైన ఆర్థిక సహాయానికి కాని, పురస్కారాలకు కానీ అర్హులు కారని గమనించవలెను. అయినప్పటికీ అటువంటి వారు గ్రామస్థాయి ఇన్నోవేషన్లకి మెరుగు దిద్దినట్లయితే ఎన్.ఐ.ఎఫ్. వారిని గుర్తిస్తుంది. అర్హత వివరాలు, ఇతర మార్గదర్శకాలకై https://nif.org.in/announcement/biennial_competition సంప్రదించండి. లేదా 'పల్లెసృజన' కార్యాలయాన్ని (**ఫోన్ : 040-40253096**) సంప్రదించండి.

### మెండె శ్రీనివాస్ ఇన్నోవేషన్ రైతు మరియు గృహ వినియోగ దారుల

# నీటిపంపు కష్టాలకు విముక్తి



- ❀ ఒక మనిషిలా పనిచేసే మొట్టమొదటి మెకానికల్ పరికరం 'నీరటి రోబో'.
- ❀ రైతుల విద్యుత్ షాక్ ప్రమాదాలకు చెక్.
- ❀ రైతులు ప్రతిరోజూ మోటారు వద్దకు వెళ్ళవలసిన అవసరం లేకుండా మెకానికల్ టైమర్ బెల్ట్ ఏర్పాటు.
- ❀ రైతుకు అవసరమైనప్పుడే నీరు తోడేలా వాడుకునే 'నీరటి రోబో'.
- ❀ వాపార సంస్థలు, గృహాలలో కష్టాలని తీర్చిన రోబో.

సమాజంలో ఎంతోమంది ఎదుర్కొంటున్న సాధక బాధకాలను అవగాహన చేసుకుని, వాటికి పరిష్కరాలు వెతకటం అంటే శ్రీనివాస్‌కు ఎంతో ఇష్టం. అలా ఇతనికి ఎదురైంది తన పొలంలోని మోటారు సమస్య. తన ఇంటికి పొలానికి మధ్య దూరం దాదాపు 3 కి.మీ. పంట పొలానికి నీరు పెట్టాలంటే అంత దూరం వెళ్ళి మోటారు ఆన్ చేసి రావాల్సి ఉంటుంది. తన తండ్రికి వయసు రీత్యా వచ్చిన మోకాళ్ళ నొప్పుల కారణంగా కష్టపడి ఎలాగో వెళ్ళి మోటార్ ఆన్ చేసి వచ్చినా, బోరు బావిలో నీళ్ళు అయిపోయినా మోటార్ అలాగే పని చేస్తూ ఉండటం వల్ల మోటార్ త్వరగా దెబ్బ తినటం జరుగుతుండేది. ఇతనేమో వ్యాపార రీత్యా సమీపంలోని జగిత్యాల లో ఉండటం వల్ల ప్రతిరోజూ వచ్చి మోటార్ వేయటం, తీయటం తనవల్ల అయ్యే పని కాదు. పోనీ ఎవరితోనైనా ఆ పని చేయిద్దామంటే ప్రతిరోజూ ఇతరులను అభ్యర్థించడం కుదరని పని. ఈ సమస్యకు ఎలాగైనా పరిష్కారం కనుగొనాలని అనుకున్నాడు మెండె శ్రీనివాస్.

టెక్నాలజీతో పరుగులు పెడుతున్న నేటి తరుణంలో ఎలాంటి విద్యుత్ పరికరాలు, టెక్నాలజీ, మానవ ప్రమేయమే లేకుండా ఒక మోటార్ ఆన్/ఆఫ్‌తో పాటు టైమర్‌తో కూడిన పరికరాన్ని తయారు చేసి విజయవంతంగా నిరూపించాడు మెండె శ్రీనివాస్. పూర్వము పంట పొలాలకు 'నీరటి వాడు' అనే వ్యక్తి అందరి పొలాలకు నీరు పెట్టేవాడు. అందుకే ఈ పరికరానికి 'నీరటి' అని, అలాగే మానవ ప్రమేయం లేకుండా పని చేస్తుంది కాబట్టి 'రోబో' అని, వెరసి దీని పేరు "నీరటి రోబో" అని పెట్టడం జరిగింది.

'నీరటి రోబో' సృష్టికర్త యొక్క పూర్తి వివరాల్లోకి వెళ్తే జగిత్యాల జిల్లా, మల్లాపూర్ మండలం, రాఘవపేట గ్రామానికి చెందిన మెండె నారాయణ, రాజగంగుల ముగ్గురు సంతానంలో చిన్నవాడు 'మెండె శ్రీనివాన్'. వృత్తిరీత్యా వ్యవసాయ కుటుంబం. కావున పెద్దన్న వ్యవసాయం నడిపితే, రెండవ అన్న కిరాణం దుకాణం నడిపిస్తుంటాడు. తన తండ్రి మరియు అన్నలు చాలా సంవత్సరాలు గల్ఫ్ దేశాలకు వెళ్ళి వచ్చారు. అయితే చిన్నవాడు కావటంతో ఆ కుటుంబంలో ఇతన్ని ఉన్నత చదువులు చదివించాలని డిగ్రీ వరకు చదివించారు. శ్రీనివాన్ చిన్నప్పటినుండి సరికొత్తది ఏదైనా చెయ్యాలనే ప్రయత్నాలు చేస్తుండేవాడు. ఈ క్రమంలో డ్రాయింగ్, మిమిక్రీ అలాగే సిమెంట్ విగ్రహాలు చేయడం లాంటి అలవాట్లు ఉండేవి.

తను 5వ తరగతిలో వున్నపుడు వాళ్ళ నాన్న, అన్నలతో పంట పొలాలకు నీరు పెట్టడానికి వెళ్ళేవాడు. అప్పుడే రాత్రుళ్ళు రావటం దేనికి? మోటారు వద్దకు రాకుండా నీరు పెట్టలేమా అనే ఆలోచనలు వచ్చేవి. కాని అప్పుడు టెక్నాలజీ తెలియదు. అలా చదువులో తర్వాత డిగ్రీ పూర్తి చేశాడు. ఎలాగైనా గ్రామాల్లోనే ఉంటూ ఏదైనా చెయ్యాలనీ, అనేక వ్యాపారాలు పెట్టాడు. తనకు ఇష్టమైన వృత్తి జర్నలిస్ట్‌గా కూడా పని చేశాడు. వీరికున్న వ్యవసాయ భూమి రెండు ఎకరాలు. అందులో వరి పండించేవారు. సమీప మండల కేంద్రమైన మెట్‌పల్లిలో ఒక దుకాణం ఉండటంతో షాపునుండి ఇంటికి రావడం ఆలస్యం అయ్యేది



శ్రీనివాస్‌కి. ఒక్కోసారి వచ్చేసరికి బోరుబావిలో నీరు అయిపోయి ఖాళీ మోటారు నడుస్తూ ఉండేది. అలా ఖాళీ మోటారు నడవటం వల్ల అది చాలాసార్లు కాలిపోవటం కూడా జరిగింది.

ఒకరోజు శ్రీనివాస్ బాగా ఆలోచనలో పడ్డాడు. నేను రాకుండా ఇక్కడే ఆఫ్ చేయలేనా అని అనుకున్నాడు. తనవద్దనున్న పరికరాలతో ఒక ప్రయోగం చేసి అనుకున్న పరికరాం చేసిమోటారుకు ఏర్పాటు చేశాడు. మరునాడు మోటారు వద్దకు వెళ్ళేసరికి ఆఫ్ అయివుంది. అప్పుడు ఇతనికి మరో ఆలోచన వచ్చింది. తను ఇంజన్‌ను ఆఫ్ చేయగలిగినప్పుడు ఆన్ చేయలేనా అనుకున్నాడు. తిరిగి ఆన్ చేయగలిగాడు కూడా. అప్పుడు తన తండ్రి మోకాళ్ళ నొప్పులతో ఇంటివద్ద నుండి 3 కిలోమీటర్ల దూరం వెళ్ళాల్సిన అవసరం లేకుండా పోయింది అని సంతోషించాడు. తన అన్న కూడా ప్రతిరోజూ 3 కిలోమీటర్ల దూరం వెళ్ళి మోటారు వేయాల్సిన అవసరం లేకుండా వారికున్న మూడు మోటార్ల వద్ద కూడా ఈ పరికరాన్ని బిగించాడు.

అప్పుడు మరో ఆలోచన వచ్చింది శ్రీనివాస్‌కు. ఎన్ని గంటలు మోటారు నడవాలి అనుకుంటే అన్ని గంటలు మాత్రమే నీరు పారేలా చేయొచ్చు అనుకున్నాడు. అలా ఆలోచించి ఆ పరికరానికే టైమర్ ను ఏర్పాటు చేసి, కొన్ని రోజులు పరీక్షించాడు. రైతు తనకు అనుగుణంగా టైమ్ అమర్చుకునేలా ఏర్పాటు చేశాడు. స్థానికంగా కొందరికి ఈ విధానాన్ని చూపించాడు. శ్రీనివాస్ తన అన్న, నాన్నల సమస్యను తీర్చడంతో వారు ఇతని ఇన్నోవేషన్ ప్రశంసించారు. దాన్ని తెలంగాణ ప్రభుత్వం వారు ఏర్పాటు చేసిన 'ఇంటింటా ఇన్నోవేటర్' కార్యక్రమానికి తెలియజేయడంతో వారు ఇతని ఇన్నోవేషన్‌కు మెచ్చి పురస్కారం అందించి ప్రోత్సహించారు.

అదే సమయంలో తమ గ్రామానికి చెందిన నరేష్ అనే ఒక యువకుడు తమ పొలం వద్ద విద్యుత్ షాక్‌తో మరణించాడు. అతనికి ఒక చిన్న పాప ఉండటంతో చాలా బాధ పడ్డాడు శ్రీనివాస్. ఒక వేళ తాను తయారు చేసిన పరికరం అమర్చుకుని ఉంటే ఇలా జరిగి ఉండేది కాదుకదా అని ఎలాగైనా విద్యుత్ మరణాలు ఆపాలని అనుకున్నాడు. ఆ తర్వాత కొద్ది రోజులకు తమ ప్రక్క గ్రామంలో తల్లీ కొడుకు కూడా ఇలాగే విద్యుదాఘాతంతో మరణించారు. అప్పుడు శ్రీనివాస్ తన అన్వేషణకు ఇంకా పదును పెట్టడం మొదలు పెట్టాడు. తనచుట్టూనే ఇంతమంది ఇలా మరణిస్తున్నారంటే రాష్ట్రవ్యాప్తంగా, దేశ వ్యాప్తంగా ఎన్ని మరణాలు సంభవిస్తున్నాయో కదా అనుకుని తన పరికరం ఒక్క రైతు మరణాన్ని అయినా ఆపగలిగితే తన జీవితం ధన్యమవుతుందని అనుకున్నాడు. తన స్వంత పనులను ప్రక్కన పెట్టి ఈ ఇన్నోవేషన్‌కు తుదిమెరుగు దిద్దటం మొదలు పెట్టి మొత్తానికి ఆకర్షణీయంగా, విజయవంతంగా తన పరికరం పనిచేసేలా తయారు చేశాడు. పురస్కారం అందుకునే సమయంలో 'పల్లెసృజన' వాలంటీర్ హరీష్ తమ సంస్థను గురించి తెలియజేశారు. తర్వాత కొద్ది రోజులకు 'పల్లెసృజన' కార్యాలయానికి వెళ్ళి బ్రిగేడియర్ గణేశం గారిని కలిసి తన ఇన్నోవేషన్ గురించి వివరించడం జరిగింది.

ఆ తర్వాత ఈ పరికరాన్ని బావులకే కాకుండా బోరు బావులకి, వాగులు, చెరువులు, కాలువలలో ఏర్పాటు చేసుకున్న మోటార్లకు అమర్చడం జరిగింది. అలాగే ఇళ్ళు, అపార్ట్‌మెంట్‌లలో మిద్దె పైన ఏర్పాటు చేసిన నీళ్ళ ట్యాంకులకి కూడా దీన్ని వాడవచ్చా అని కొందరు అడగటంతో మళ్ళీ ఆలోచించి, వాటన్నిటికి ఉపయోగ పడేటట్లు చేయడానికి ఎన్నో ఇబ్బందులను ఎదుర్కోవలసి వచ్చింది. అయితే ఇందులో ప్రతిది ఎలాగైనా మెకానికల్‌గా తప్ప ఎలాంటి సెన్సార్లు, విద్యుత్ పరికరాలు వాడకూడదని ముందుగానే నిర్ణయించుకున్న శ్రీనివాస్ మొత్తానికి తాను అనుకున్న సాధించాడు.

అనేక మంది రైతులు, కోళ్ళ ఫారాలు, ఇళ్ళు, వీధి ట్యాంకుల వద్ద ఈ పరికరాన్ని ప్రయోగాత్మకంగా అమర్చాడు. అనంతరం దీనిని ప్రతి ఒక్కరికి చేర్చాలనే ఉద్దేశ్యంతో ఆన్‌లైన్ మార్కెట్ ఎంచుకోవడంతో పాటు, వాడే విధానం అందరికీ అర్థమయ్యేలా చెయ్యాలని MS Niirati ROBO పేరున ఒక 'యూ ట్యూబ్' ఛానల్ ఏర్పాటు చేశాడు. అలాగే వెబ్‌సైట్ (www.msinnovationsind.com) మరియు మొబైల్ ఆప్ (MS Niirati ROBO)తయారు చేయించాడు. కేవలం తను మాత్రమే కాకుండా యువతకు ఉపాధి, ఉద్యోగం కల్పించాలని డీలర్‌షిప్‌లు ఏర్పాటు చేయాలి అనుకుంటున్నాడు. అలాగే మరమ్మతులు ఏవైనా ఉంటే ఎక్కడికక్కడ చేయటానికి ప్రాంతాల వారిగా సర్వీస్ ఉద్యోగులను ఏర్పాటు చేయాలని, ఇన్నోవేటర్ల వేదిక ద్వారా దీన్ని అందరికీ అందుబాటులోకి తీసుకు రావలని నిర్ణయించుకున్నాడు.





'నీరటి రోబో' అనే పరికరం 14 రకాల పద్ధతులలో అనేకచోట్ల అమర్చుకునే వెసలుబాటు కలిగి ఉండటం దీని ప్రత్యేకత. ఎలాంటి నిర్వహణా ఖర్చులు కాని, మరమ్మతులు కాని, ఎలాంటి సాంకేతికత కాని లేకపోవడం 'నీరటి రోబో' ప్రత్యేకత అంటాడు శ్రీనివాస్.

ప్రకృతికి మేలు చేయాలన్నది తన ఎన్నో ఏళ్ళ తపన. అందుకే తన వ్యాపార నినాదం 'భవిష్యత్తు కొరకు ప్రకృతిని కాపాడండి' (సేవ్ నేచర్ ఫర్ ఫ్యూచర్) అని పెట్టుకున్నాడు. ఎలాంటి హాని లేకుండా, నీటి వృధాను, విద్యుత్ వృధాను. సమయాన్ని, శ్రమను, ఆర్థిక భారాన్ని కేవలం ఒక్క పరికరంతో ఏర్పాటు చేయడం పట్ల తనకు సంతోషమే కాదు, సామాజిక బాధ్యత అని కూడా అంటాడు శ్రీనివాస్.

కేవలం మోటారు నుండి వచ్చే నీరు, మరియు గాలి ఆధారంగా ఒత్తిడిని సృష్టించి, ఇవన్నీ సాధ్యం చేయగలిగాడు. ముందు మరిన్ని పరికరాలు తక్కువ ధరలో లభించేలా అందిస్తానని, తను దీనిని ప్రజలకు అందించడానికి తన స్వంత వ్యాపారాలను, వృత్తిని పక్కన పెట్టడం జరిగింది. యువతలో చాలామంది తనలాగే అనేక ఆలోచనలతో ఉంటారని, అలాంటి వారు దాన్ని సాధ్యం చేసుకునే దిశగా పని చేస్తే పరిస్థితులను తమకు అనుకూలంగా మార్చుకొని లక్ష్యం దిశగా పోరాడితే తప్పకుండా విజయం సాధిస్తారని తన స్వీయ అనుభవాన్ని యువతకు గుర్తు చేసారు. మాలాంటి గ్రాస్‌రూట్స్ ఇన్నోవేటర్లకు ప్రభుత్వం సహకరిస్తే మరిన్ని కొత్త ఆలోచనలతో ఉత్సాహంగా పని చేస్తామని అన్నాడు.

**ఈ పరికరం వల్ల ఉపయోగాలు :**

❀ 24 గంటల విద్యుత్ కారణంగా అనేక మోటార్లు వృధాగా నడుస్తున్నాయి. ఆటోమాటిక్‌గా మోటార్‌ను ఆన్ చేసే స్టార్టర్లను ఏర్పాటు చేసుకోవటం వల్ల కరెంటు పోయి వచ్చినప్పుడు అన్ని మోటార్లు ఒకేసారి ఆన్ కావటం వల్ల ట్రాన్స్‌ఫార్మర్‌లపై వత్తిడి పెరిగి మోటార్లు కాలిపోయే ప్రమాదం నుండి ఇది కాపాడుతుంది.

❀ రైతుకు ప్రతి రోజు మోటార్ వద్దకు వెళ్ళి ఆన్ చేసే పని తగ్గడంతో, ఇతర పనులు చేసుకోవచ్చు.

❀ కొన్ని ప్రాంతాలలో పంటకు సరిపోయేంత నీరు లేనపుడు రైతు రోజు సుమారు 3-4 సార్లు పగలు/ రాత్రిళ్ళు కూడా మోటారు వద్దకు వెళ్ళాల్సిన అవసరం లేకుండా ఇది పని చేస్తుంది.

❀ పగలు నీటి ఊట ఆధారంగా అనేకసార్లు పంటకు నీరు అందించి, పంట ఎండిపోకుండా ముఖ్యంగా ఎండాకాలంలో ఈ ఇబ్బందులకు గురి కాకుండా చేస్తుంది.

❀ రైతుకు అవసరం ఉన్నంత మేర మాత్రమే వాడుకునే వెసలుబాటు ఉండటంతో అనవసరమైన నీరు, విద్యుత్‌ను ఆదా చేయవచ్చు.

**యం.యస్. నీరటి రోబో పరికరం వివరాలు :**

వ్యవసాయ పంపు సెట్ల పరికరం ఖరీదు : రూ. 2 వేలకు పైగా (టైమర్ బెల్టును బట్టి ధరలో వ్యత్యాసం ఉంటుంది)

శ్రీనివాస్ క్రియాశీలతను, సాధించాలన్న దీక్షను, సమాజానికి లాభం చేయాలన్న తపనను 'పల్లెసృజన' గుర్తించి అన్ని రకాల సహాయాలు, ప్రోత్సాహాలు అందించింది. ఈ వినూత్న ఇన్నోవేషన్‌ను విస్తృతంగా ప్రచారం చేసి, లక్షలాది రైతులు, గృహస్తులు ఉపయోగించేలా చేయటానికి పూర్తిగా కృషి చేస్తుంది. దాంతో రైతుల వల్ల శక్తి వినియోగం తగ్గి, అనేక లాభాలను దేశం అనుభవిస్తుందని 'పల్లెసృజన' విశ్వాసం. ●

ఇంటి అవసరానికి రోబో ఖరీదు : రూ. 1,000 పైన.

**ఇన్నోవేటర్ మెండె శ్రీనివాస్, ఫోన్ : 90102 76570**

# సమస్యలకు ఆహ్వానం

'పల్లెసృజన' ఇంతవరకు సమాజంలోని సమస్యలకు పరిష్కారాలు (ఇన్నోవే షన్‌లను) వెతికి, వెలుగులోకి తీసుకు రావడానికి స్వచ్ఛందంగా గత పదిహేను సంవత్సరాలుగా ప్రయత్నాలు చేస్తున్నది. వాటివల్ల పునాది స్థాయి ఇన్నోవేటర్ల సృజనాత్మక శక్తి వెలుగులోకి రావటంతో పాటు, ఎంతోమందికి శారీరకంగా, ఆర్థికంగా, సమయ పరంగా ఎంతో లాభం చేకూరింది. ఈ ప్రయాణంలో పరిష్కారాలు వెతికిన అనుభవంతో సమాజంలో వున్న సమస్యలను కూడా వెతికి పల్లెసృజన కుటుంబంలో వున్న ఇన్నోవేటర్ల ద్వారా పరిష్కారాలు చేయిస్తే సమాజానికి ఇంకా లాభం చేకూరు తుందని భావించాం.

గ్రామాల్లో మీరెవరైనా వ్యక్తిగతంగా లేదా నలుగురికీ సంబంధించిన ఏదైనా సమస్యకు పరిష్కారం వుంటే బావుంటుంది అనుకుంటున్నారా? ఐతే అటువంటి సమస్యలను క్రింద ఇచ్చిన వాట్స్ యాప్ నంబర్లకి పంపగలరు. ఎన్ని సమస్యలైనా పంపవచ్చు. పరిష్కారాలను మా ఇన్నోవేటర్ల సహాయ సహకారాలతో వెతికే ప్రయత్నాలను, వాటి ప్రగతిని మీకు 'పల్లెసృజన' పత్రిక ద్వారా తెలియజేస్తూ వుంటాము. – ఎడిటర్

వాట్స్ యాప్ నంబర్లు : బ్రిగేడియర్ గణేశం, 9866001678, సుభాష్ చందర్, 9652801700

# 'పునాది స్థాయి ఇన్నోవేషన్ల'తో గ్రామీణ యువతకు స్వయం ఉపాధి



- జమ్మలమడక శశిమోహన్

గ్రామల్లో యువతీ యువకులు వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులు, ఇతర కారణాల రీత్యా ఉన్నత చదువులు చదవలేక పోతున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే మన దేశంలో ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత స్థాయి చదువులకు వెళ్తున్న యువత కేవలం 23 శాతం. అంటే 73 శాతం యువత ఉన్నత చదువులు చదవలేక పోతున్నారు. ఎంతోమంది ఉపాధి కోసం ఎదురు చూపులు చూస్తున్న సంగతి అందరికీ విదితమే. తమ చదువుకు తగిన ఉపాధి లభించటం లేదని కొందరు, ఏదైనా ఉద్యోగం సాధిద్దామంటే తగినంత చదువు చదవలేక పోయామే అని కొందరు, ఏదైనా వ్యాపారం చేసుకుందామంటే బ్యాంకులు ఎలాంటి తనఖా లేకుండా తమకు రుణం ఇవ్వటం లేదని కొందరు..... ఇలా ఎన్నో రకాలుగా ఆలోచిస్తూ, ఏమి చెయ్యాలో తెలీక నిస్సహాయంగా గ్రామ యువత కాలం గడుపుతున్నారు.

ఇలాంటి యువత కొరకు తమ గ్రామంలోనే వుండి, తాము తల్లిదండ్రులపైన ఆధార పడకుండా తమ ఖర్చులకు అవసరమైన ధనాన్ని తామే సంపాదించుకోవటంతో పాటు తామే కుటుంబానికి కాస్త చేదోడుగా తయారవుతూ, తమను తిట్టిన నోళ్ళే పొగిడేలా తయారు కావడానికి అవసరమైన ఎన్నో పునాది స్థాయి ఇన్నోవేషన్లను 'పల్లెసృజన' వెలుగులోకి తెచ్చింది. ఏ పని చేస్తున్నామన్నది ముఖ్యం కాదు, తాము చేస్తున్న పని ఎంత మందికి ఉపయోగ పడుతున్నది, దానివల్ల తాము ఎంత సంపాదిస్తున్నాము, గతంకన్నా ఇప్పుడు మనపైన ఎంత గౌరవం పెరిగింది అన్నది ఆలోచిస్తే చాలు మీ భవిష్యత్తును మీరే తీర్చి దిద్దుకున్నవారు అవుతారు. ఈ పరంపరలో 2021 జులై–ఆగస్టు సంచిక నుండి యువత ఉపాధి కొరకు వెలుగులోకి వచ్చిన ఇన్నోవేషన్లను గురించి తెలియజేస్తోంది 'పల్లెసృజన'.

- ఎడిటర్.

## కొబ్బరి బోండాంల ష్రెడ్డర్
## ఉపాధితో పాటు ఊరు పరిశుభ్రం

ఈరోజుల్లో మనిషి ఆరోగ్య రీత్యా మొట్టమొదటిగా డాక్టరు కొబ్బరి నీళ్ళు త్రాగమని చెబుతున్నారు. అందువల్ల ప్రతి గ్రామం మరియు పట్టణాల్లో కొబ్బరి బోండాంల విక్రయం బాగా పెరిగింది. కొబ్బరి నీళ్ళు త్రాగడం మంచి ఆరోగ్యాన్ని ఇస్తుంది. కానీ, ఆ త్రాగి పారవేసిన కొబ్బరి బోండాంల వలన ఇటు పురపాలక శాఖ, అటు గ్రామ పంచాయతీలు వాటిని సేకరించి డంపింగ్ యార్డుకు తీసుకువెళ్ళడం పెద్ద సమస్యగా మారింది. అలాగే డంపింగ్ యార్డులో కూడా గుట్టలు గుట్టలుగా బోండాంలు పేరుకు పోవడం వలన వీటి నిర్వహణ సమస్యగా మారుతుంది. అలాగే స్థల సమస్య అధికమౌతోంది.

కానీ ఈ వ్యర్థ కొబ్బరి బోండాముల వల్ల కూడా ఎన్నో లాభాలు చేకూర్చుకోవచ్చు!

ఈ రోజుల్లో రైతులు పంటలు పండించడానికి ఎన్నో రకాల క్రిమి సంహారక మందులను వాడుతున్నారు. ఈ వ్యర్థ కొబ్బరి బోండాములు మరియు ఎండు కొబ్బరి కాయలను ఉపయోగించి, రైతులు పంటలకు కావలసిన సహజ ఎరువులను గ్రామాల్లోనే తయారు చేసి, తోటి రైతులకు అందించి ఉపాధి పొందవచ్చు.

ఈ సమస్యను దృష్టిలో పెట్టుకొని తెలంగాణ లోని సంగారెడ్డి జిల్లా, మెట్‌పల్లికి చెందిన ఇన్నోవేటర్ అల్లాడి ప్రభాకర్ "కోకనట్ ష్రెడ్డర్ మిషన్" తయారు చేయడం జరిగింది. వీరు ఇప్పటికే తయారు చేసిన ఎన్నో ఇన్నోవేషన్లు పల్లెసృజన పాఠకులకు సుపరిచితమే. ఆయన







ఇటీవల తయారు చేసిన ఈ యంత్రం ద్వారా వ్యర్థ కొబ్బరి బోండాముల నుండి 2 రకాల ఉత్పత్తులను తయారు చేయవచ్చు.

**1. కోకో పిత్:** ఇది పౌడర్ లాగా ఉండి రైతులు పంటలు పండించ డానికి ఎరువుగా తమ పంట పొలాలు, నర్సరీలు, గార్డెన్స్ మరియు తమ ఇళ్ళల్లో మొక్కలకు ఎరువుగా వాడుతున్నారు. దీనివలన నేలలో నీటి శాతం ఎక్కువ రోజులు ఉండటం వలన పంటలకు, మొక్కలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

**2. కోకో ఫైబర్:** ఇది వాణిజ్యపరంగా ఎంతో లాభసాటిగా ఉంటుంది. ఈ కొబ్బరి పీచు ద్వారా కొబ్బరి తాళ్ళు, కుర్చీలు, సోఫాలు, ఫాల్స్ సీలింగ్ వంటి వాటి తయారీలో ఎక్కువగా వినియోగిస్తున్నారు.

ఈ 'కోకనట్ ష్రెడ్డర్ మిషన్'ను చిన్న గ్రామాలు, పట్టణాలలో కూడా సులువుగా ఏర్పాటు చేసుకొనే విధంగా ఈ మిషన్‌ను తయారు చేయడం జరిగింది.

- ఈ యంత్రంలో సింగల్ ఫేస్ మరియు 3 ఫేస్ విద్యుత్‌తో నడిచే 3 హార్స్‌పవర్‌ల మోటారు బిగించడమైనది.
- ఈ మిషన్ గంటకు సుమారు 200 కొబ్బరి బోండాంలను క్రష్ చేస్తుంది.
- ఈ యంత్రం ద్వారా చిన్నపాటి పరిశ్రమ ఏర్పాటు చేసుకొని నలుగురు సభ్యులకు ఉపాధి అవకాశాలను సృష్టించుకోవచ్చు.

గ్రామీణ యువత ఈ యంత్రాన్ని ఏర్పాటు చేసుకోవడం ద్వారా మీ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు మీ ఉపాధిని కూడా సులభంగా పొందవచ్చు. ప్రస్తుతం చాలా ప్రాంతాల్లో రైతుకు అవసరమైన వివిధ పంటల నారును పోషించి విక్రయించుకునేందుకు 'గ్రీన్ షేడ్ నర్సరీ'లు ఏర్పాటు చేసుకుంటున్నారు. వాటిల్లో నారు పెంచేందుకు ట్రేలను ఉపయోగిస్తారు. ఆ ట్రేలలో ఈ యంత్రం ద్వారా తయారైన కోకోపిత్‌ను నింపి అందులో నారును పెంచడం ద్వారా నారును చాలా సులభంగా పీకవచ్చు. కోకోపిట్‌తో పాటు వచ్చే కొబ్బరి నారును మీ గ్రామానికే వచ్చి పైన చెప్పిన వివిధ రకాల వ్యాపారస్తులు తీసుకు వెళ్తారు.



ఈ యంత్రం ఏర్పాటు చేసుకున్న యువకులు ప్రధానంగా చేయవలసింది కొబ్బరి బోండాంలను, తాటి ముంజలను సేకరించడం, ఒకరిద్దరు యువకులు యంత్రం వద్ద ఉండి కోకోపిత్ మరియు కొబ్బరి పీచులను తయారు చేసి ఉంచ గలిగితే చాలు. వీటి మార్కెటింగ్ చాలా సులభం. ఇందులో కొబ్బరి బోండాంలే కాదు, తాటి ముంజలు, తాటిచెట్టు, కొబ్బరి చెట్టు, పామోలిన్ చెట్ల ఆకుల మొదళ్ళను కూడా వేసి కోకోపిత్ మరియు పీచులను తయారు చేయవచ్చు.

తక్కువ పెట్టుబడి, కొద్దిపాటి శ్రమతో మంచి ఆదాయం పొందటంతో పాటు, మీ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో మీ పాత్ర అమోఘంగా ఉంటుంది. మీకు ఆదాయమే కాక, గ్రామీణుల దృష్టిలో మీ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్నారన్న మంచి ఖ్యాతి మీకు దక్కుతుంది.

ఇందుకు మీరు కొనుగోలు చేయవలసింది ఒక్క ఈ యంత్రం మరియు కొబ్బరి బోండాంలు, తాటి నుంజలు, ఆ చెట్లకు ఉన్న వాటి ఆకుల మొదళ్ళను సేకరించి, వాటిని మీ యంత్రం వరకు చేర్చేలా ఒక ట్రాక్టరును కిరాయికి తీసుకుంటే సరిపోతుంది.

ఇక ఆలస్యమెందుకు కనీసం మండలానికి ఒక యూనిట్‌ను ఏర్పాటు చేసుకో గలిగితే గౌరవప్రదమైన ఆదాయ మార్గం మీకు సొంతం.

ఈ వ్యాపారం ప్రారంభించేందుకు అవసరమైన సలహాలు, సూచనలు, యంత్రాలను గురించి వివరాలు 'పల్లెసృజన' కార్యాలయాన్ని సంప్రదించి పూర్తి వివరాలు తెలునుకోవలసిందిగా కోరుతోంది 'పల్లెసృజన'.

**ఇన్నోవేటర్ అల్లాడి ప్రభాకర్ ఫోన్ నెం.: 94400 37475**

# అభివృద్ధి చేయబడ్డ సాంప్రదాయ దేశీ సజ్జ విత్తనాలు 'సుల్కానియా సజ్జ'



62 సంవత్సరాల 'హనుమాన్‌రాం ఝూరియా' రాజస్థాన్, చూరు జిల్లాలో గల 'సుల్కానియా' గ్రామంలో గత 40-45 సం.ల నుంచి ఉత్తమమైన గింజల ఎంపిక పద్ధతిలో సజ్జలు పండిస్తున్నాడు. తాను పండించే సజ్జలకి తన గ్రామం పేరే 'సుల్కానియా సజ్జలు' అని పెట్టుకున్నాడు. పొడవైన కంకులు కలిగి వుండి, తియ్యటి గింజలు కలిగి, ఎక్కువ దిగుబడినివ్వటం, కరువు పరిస్థితులను తట్టుకోవటం, ఎక్కువ పశుగ్రాసం ఇవ్వటం ఈ సుల్కానియా సజ్జల ప్రత్యేకత.

హనుమాన్‌రాం తాత ముత్తాతలు కూడా ఈ రకమైన సజ్జలనే పండించేవారట. బికనీర్ నుంచి వచ్చిన ఒక ఆధ్యాత్మిక గురువు 300 సంవత్సరాల క్రితం వీరి ముత్తాతకి ఈ విత్తనం ఇచ్చారట! అప్పటినుండి అదే రకాన్ని వీరి కుటుంబం పండిస్తున్నారట. హనుమాన్‌రాం గత 45 సంవత్సరాల నుండి మేలైన గింజలను ఎంపిక చేసి, ప్రత్యేకమైన పంట గా వేస్తూ ఉత్తమమైన సజ్జ రకాన్ని 'సుల్కానియా' అనే పేరున రైతులకు అందజేస్తుంటాడు. ప్రతి సంవత్సరం పంట వచ్చిన తర్వాత ఆరోగ్యం గా వున్న గింజలను ఏరి, ఎండిన వేపాకులతో కలిపి నిలువ చేస్తాడు. ఈవిధంగా 5 సంవత్సరాల వరకు నిలువ చేసుకోవచ్చు అంటాడితను.

ఈ 'సుల్కానియా' సజ్జ తొలకరి వర్షాలకు విత్తుకునే రకం. ఇది ఇసుకమట్టి నేలలు, నీరు తక్కువగా వున్న ప్రాంతాలలో, సమ ఉష్ణ ప్రాంతాలలో కూడా విత్తటానికి అనువైన రకం. వర్షపాతం తక్కువైన కరువు వాతావరణాన్ని కూడా తట్టుకుంటుంది. విత్తిన తర్వాత కొంత కాలం వర్షం లేకపోయినా ఇది బాగా మొలకెత్తి ఎదుగటం దీని ప్రత్యేకత. ఈ లక్షణాలు సాధారణ సజ్జ రకాలలో వుండవు.



ఈ రకం సజ్జతో హెక్టారుకు 20 నుండి 25 క్వింటాళ్ళ వరకు దిగుబడి సాధించవచ్చు. 20 నుండి 30 అంగుళాల పొడవాటి కంకులు, రుచిలో తియ్యదనం, గింజలు ఒత్తుగా వుండటం దీని ప్రత్యేకత. ప్రతి మొక్కకు 6 నుండి 10 కంకులు వస్తాయి. ప్రతి కంకిలో 90 శాతానికి పైగా మంచి బలమైన విత్తనాలే వుంటాయి. విత్తిన 90 రోజులకే పంట కోతకు వస్తుంది. హెక్టారుకు 40 క్వింటాళ్ళ వరకు పశుగ్రాసం లభిస్తుంది.

వర్షాధారం బాగా వుంటే ఈ రకంలో ఇంకా ఎక్కువ ఉత్పత్తి సాధించవచ్చునని శాస్త్రవేత్తలు అభిప్రాయ పడ్డారు. ఇది సాధారణ రకంకన్నా ఎక్కువగా చీడ పీడలను తట్టుకునే శక్తి కలిగి వుంటుంది. గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాలలో క్షేత్ర స్థాయిలో జరిపిన పరిశోధనా ఫలితాలను బట్టి చూస్తే వర్షాభావ పరిస్థితులలోనే మంచి ఫలితాలను ఇస్తున్న ఈరకం కొద్దిగా వర్షాలు ఎక్కువున్న ప్రాంతాలలో మరింత మెరుగైన ఫలితాలు ఉండవచ్చని అనుకుంటున్నారు రైతులు.

సుల్కానియా గ్రామ రైతులతో పాటు, శాస్త్రవేత్తలు, కృషి విజ్ఞాన కేంద్ర అధికారులు, సెంటర్ ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్‌మెంట్ సంస్థ నిష్ణాతులు 'హనుమాన్ రాం రూపొందించిన ఈ సజ్జ రకం ఇతర రకాల విత్తనాల కన్నా చాలా మేలైనవని, అధిక దిగుబడిని ఇస్తున్నాయని, చీడ పీడలను బాగా తట్టుకోగలవని అన్నారు. ఆ గ్రామ రైతులు తాము కూడా దాదాపు 30 సంవత్సరాల నుండి ఆ విత్తనాలే వేస్తున్నామని వెల్లడించటం జరిగింది. వచ్చిన అధికారులు, శాస్త్రవేత్తలు కూడా పండించిన పంటని పరిశీలించి, పొడవైన కంకులను గుర్తించి, మేలు రకం విత్తనాల రుచి చూసి, తాము చూసిన అనేక రకాలకన్నా ఇవి ఉత్తమమైనవని కితాబునిచ్చారు. బైట మార్కెట్‌లో లభించే హైబ్రిడ్ విత్తనాలకన్నా ఇవి ఎన్నోరెట్లు ఉత్తమంగా వున్నాయని రైతులు తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. ముఖ్యంగా అధిక దిగుబడి, రుచి, అధిక పశుగ్రాసం, చీడ పీడలను తట్టుకోవటం, వర్షాభావ పరిస్థితుల్లో కూడా దిగుబడి తగ్గకపోవటము మొదలైన లక్షణాలు రైతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ విత్తనాలను అభివృద్ధి చేసినందుకు గాను ఎన్.ఐ.ఎఫ్. వారు 9వ ద్వైవార్షిక పునాది స్థాయి ఇన్నోవేషన్లు, సాంప్రదాయ జ్ఞాన పోటీల్లో ఇన్నోవేటర్ హనుమాన్‌రాం ఝూరియాను రాష్ట్రస్థాయి పురస్కారంతో సత్కరించారు.

విత్తనాలు కావలసిన వారు **వీరరాఘవ రెడ్డి, ఫోన్ : 8125799904, సుభాష్ చందర్, ఫోన్ : 9652801700 లలో సంప్రదించండి.**

# జులై - ఆగస్టు 2022 లో జరిగిన 'పల్లెసృజన' విశేషాలు





30 ఏప్రిల్ 2022 న సిద్ధిపేట ప్రభుత్వ డిగ్రీ & పిజి కళాశాలలో జరిగిన ఇన్నోవేషన్ల సదస్సు మరియు క్రియేటివిటీ ఎట్ గ్రాస్‌రూట్స్ అనే అంశంపై ఒకరోజు ప్రదర్శన మరియు సెమినార్ దృశ్యాలు.





29 జులై, 2022 హైదరాబాద్ కుత్బుల్లాపూర్ సమీపంలోని సూరారం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 40 మంది విద్యార్థులు, 4గురు ఉపాధ్యాయులు 'పల్లెసృజన' కార్యాలయాన్ని సందర్శించి పునాది స్థాయి ఇన్నోవేషన్లను పరిశీలించడం జరిగింది.




2 జులై, 2022న 'నియూ సైన్స్ హబ్' యూట్యూబ్ ఛానల్ బృందం 'పల్లెసృజన' కార్యాలయాన్ని సందంర్శించి, పునాది స్థాయి ఇన్నోవేషన్లను పరిశీలించి, చిత్రీకరిస్తున్న దృశ్యాలు.



ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా ఎలక్ట్రిక్ లైన్‌మెన్‌లుగా ఉద్యోగంలో చేరిన వారికి ప్రభుత్వం తరుపున మన ఇన్నోవేటర్ నన్నం తిరుపతి కరెంటు స్తంభాలను ఎక్కడంలో శిక్షణ ఇవ్వటం జరిగింది. శిక్షణ పూర్తయిన సందర్భంగా శిక్షణార్థులు, విద్యుత్ సిబ్బందితో ఇన్నోవేటర్ నన్నం తిరుపతి






తాండూరు వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో 'పల్లెసృజన' వెలుగులోకి తెచ్చిన పునాది స్థాయి ఇన్నోవేషన్లపై అవగాహనా సదస్సులో పాల్గొన్న రైతులు, వ్యవసాయ అధికారులు.



# జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు

- 'ఎన్.ఐ.ఎఫ్. వారి
రెడీ టు సేల్' ప్రచురణ సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

## మల్టి యాంగిల్ పవర్ వీడర్

**సమస్య - పరిష్కారం :**

పెట్రోల్ ఇంజన్‌తో నడిచే వీడర్‌ను తయారు చేసేటప్పుడు తమిళనాడుకు చెందిన నందరాజ్ వీడర్‌కు అమర్చిన బ్లేడ్లు ఏవిధంగా ఉండాలి? అన్నదానిపై అనేక వ్యాసాలు చదివాడు. ఫలితంగా తాను చేస్తున్న ప్రయోగాలలో బ్లేడ్ యొక్క యాంగిల్ మార్చినపుడు వీడర్ త్రవ్విన మట్టి ఒక్కోవైపు ఒక్కోరకంగా పడటం గమనించాడు. దాన్ని దృష్టిలో వుంచుకొని అన్ని రకాల పంటలకు, చెట్లకు అనువుగా వుండేలా వీడర్ బ్లేడ్లను మార్చుకునే వద్ధతిలో కొత్తరకం వీడర్‌ను రూపొందించాడు.

**పరికరం :**

డీజిల్ ఇంజన్ కలిగి, స్వయం శక్తితో నడిచే ఈ వీడర్ వెనక 'ఎల్' ఆకారంలో తిరిగే బ్లేడ్లు అర్చబడి వుంటాయి. వీడర్‌ను నడుపుతున్నపుడే చేతితో క్రిందనున్న బ్లేడ్ యాంగిల్‌ను మార్చుకోవచ్చు. తద్వారా మట్టి ఎటు కావాలంటే అటు పడేలా ఏర్పాటు చేసుకోవచ్చు. కనుక దీనిని మొక్కల ఎత్తు, అవసరాన్ని బట్టి బ్లేడ్ల యాంగిల్ మార్చి మట్టి ఎగదోసుకోవచ్చు. హెక్టారుకు పొలంలో పని చేయటానికి 4 గంటల సమయం పడుతుంది. గంటకు ఒక లీటర్ డీజిల్ ఖర్చవుతుంది.



**సాంకేతిక వివరాలు :**

- ఈ యంత్రంలో 5 హెచ్‌పి ఎయిర్‌కూల్ (గ్రేవిస్) ఇంజన్ కలిగి వుంటుంది. వెనక 50 సెం.మీ. పొడవున్న రోటర్ షాఫ్ట్‌కు 4 ఎల్ ఆకారంలో గల స్పైరల్ బ్లేడ్లు అమర్చబడి వుంటాయి.
- మొక్క ఎత్తును బట్టి వెనక బేడ్ల యాంగిల్ మార్చుకునే సదుపాయం వుంటుంది.
- మరీ చిన్న మొక్కలైతే బ్లేడ్ల యాంగిల్ మార్చుకోకుండా నేరుగా పెట్టి మొక్కలకు హాని జరగకుండా కలుపు నివారణ చేసుకోవచ్చు.
- 240 కిలోల బరువున్న ఈ వీడర్ ప్రత్యేకించి మిరప, వంగ, ప్రత్తి, మల్లె, అరటి, టమోట, పొగాకు మొదలైన పొలాల్లో అంతర సేద్యాలకు బాగా పని చేస్తుంది.

**ముఖ్యాంశాలు :**

- 40 సెం.మీ. వెడల్పులో, 5 సెం.మీ. లోతువరకు ఇది పని చేస్తుంది.
- 190 ఆర్.పి.యం. వేగంతో పని చేస్తుంది.
- దీని బ్లేడ్లు కార్బన్ (స్ప్రింగ్స్ స్టీల్‌తో తయారు చేయబడ్డాయి కనుక దృఢంగా వుంటాయి.

**పురస్కారాలు :**

- ఎన్.ఐ.ఎఫ్. 2013లో తమ 7వ జాతీయ ద్వైవార్షిక పోటీలలో పి.ఆర్. నందరాజ్‌ను ప్రోత్సాహక బహుమతితో సత్కరించింది.

## బైక్ స్టార్ట్ చేసే ఇగ్నీషన్‌గా 'హెల్మెట్'

**సమస్య - పరిష్కారం :**

రోజూ దినపత్రికలలో ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడక పోవటం వల్ల జరిగే ప్రమాదాలను గురించి చదివి, జరిగే అనర్థాలను గురించి తెలుసుకొని, హెల్మెట్ వాడితే ప్రమాదం జరిగినా ప్రాణాలు కాపాడుకోవచ్చు అన్న ఆలోచనతో విడివిడిగా ఆర్‌పి. వినోత, లైలా, జితేంద్రలు ఈ సమస్యకు పరిష్కారంగా హెల్మెట్ ధరిస్తే కాని ద్విచక్ర వాహనం స్టార్ట్ కాకుండా ఉండాలన్న ఆలోచన చేశారు. ఒకవిధంగా ఇంజన్ స్టార్ట్ చేసే తాళం చెవే ఈ హెల్మెట్ అని చెప్పుకోవచ్చు. వాహనదారుడు హెల్మెట్ పెట్టుకుని క్రింద బెల్టు క్లిప్పు పెట్టుకుంటే తప్ప వాహనం స్టార్ట్ కాదు.





**పరికరం :**

ద్విచక్ర వాహనం ఇగ్నీషన్‌లో అనుసంధానం చేయబడిన ఒక ఎలక్ట్రానిక్ పరికరానికి సంబంధించిన ట్రాన్స్ రిసీవర్ హెల్మెట్‌కి అమర్చటం ద్వారా ఈ పరికరాన్ని రూపొందించారు. అంటే హెల్మెట్ ధరించి దాని బెల్ట్ పెట్టుకుంటేనే ఇగ్నీషన్‌కి స్విచ్ వేసినట్లు. ఇది చేస్తే కాని, అసలు ఇగ్నీషన్ పని చేయదు. హెల్మెట్‌కి, ఇగ్నీషన్‌కి జత కలపడం ద్వారా మాత్రమే ఇది సాధ్యమవుతుంది.

**సాంకేతిక వివరాలు :**

- ఇది ఎలాంటి వైర్లు లేని ఎలక్ట్రానిక్ పరికరం.
- మనిషి తలమీద హెల్మెట్ పెట్టుకుటే తప్ప సెన్సార్లు పని చేయవు.
- హెల్మెట్‌ను తలమీద పెట్టుకున్నపుడు మాత్రమే దీనిలోని మైక్రో కంట్రోలర్ సర్క్యూట్ ద్విచక్ర వాహనంలోని ఇగ్నీషన్‌లోకి సంకేతాలు పంపుతుంది.

**ముఖ్యాంశాలు :**

- వాహనదారుడు హెల్మెట్‌ను తలమీద పెట్టుకుంటే తప్ప వాహనం స్టార్ట్ కాదు.
- వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ పెట్టుకోవటం ద్వారా ప్రమాదాలు జరిగినపుడు దెబ్బల తీవ్రతను అరికట్టవచ్చు.

**పురస్కారాలు :**

- ఎన్.ఐ.ఎఫ్. 2011లో జాతీయ స్థాయిలో విద్యార్థులకు జరిపిన పోటీలలో ఎన్నికై, 2015లో ద్వైవార్షిక పోటీలలో ప్రత్యేక పురస్కారం అందజేయ బడింది.

**పై ఇన్నోవేషన్లు కావలసిన వారు సంప్రదించ గలరు :**
**సుభాష్ చందర్,** సి.ఇ.ఓ., **"క్రియేటివ్ మైండ్స్"**
ఫోన్ : 040-40253096, మొబైల్ : 9652801700.

## 'పల్లెసృజన' ఇన్నోవేటర్లకు విజ్ఞప్తి

'పల్లెసృజన' పత్రిక అప్రతిహతంగా 16 సంవత్సరాలుగా మీ ముందుకు వస్తున్న విషయం మీకందరికీ విదితమే. స్వచ్ఛందంగా వాలంటరీ వ్యవస్థ మీద ఆధారపడి, ఎటువంటి వ్యాపార ప్రకటన లు, డొనేషన్‌లు లేకుండా ఇప్పటి వరకు ఈ పత్రికను తద్వారా నూతన ఇన్నోవేషన్లను, ఇన్నోవేటర్లను మీకు పరిచయం చేస్తూ వారికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకు వస్తున్న విషయం కూడా మీకు తెలుసు.

కోవిడ్ మహమ్మారి ప్రపంచ వ్యాప్తంగా సృష్టిం చిన అలజడి లో కూడా నిరాఘాటంగా పత్రిక నడిపే ప్రయత్నంలో సఫలీకృతులం అయ్యాము. కానీ, రోజు రోజుకూ పెరిగి పోతున్న పేపర్ ధరలు, ముద్రణా ఖర్చులను తట్టుకోవటం కొద్దిగా కష్టంగా మారు తోంది. కావున దయచేసి ఇన్నోవేటర్లు ఒక విషయం గమనించాలి. ఇప్పటి నుంచి మీకు చేరుతున్న పత్రిక ఉచితంగా పంపడం కొంత భారంగా అనిపిస్తోంది. కావున మీ పత్రికకు మీరు కూడా చందాదారులు కావలసిందిగా కోరుతున్నాము.

మీరు పత్రికకు అందిస్తున్న సహకారం మమ్మల్ని ఎప్పటికప్పుడు కార్యోన్ముఖులను చేస్తూ ఆనందంగా ముందుకు సాగేలా చేస్తోంది. కావున మీకు తెలిసిన వారికి, మీ మిత్రులకు ఈ పత్రికను గురించి తెలియజేసి, కొత్త చందా దారులను చేరేలా మీవంతు ప్రయత్నం చేయ గలరు. వీలైనంత వరకు పత్రిక ధర పెంచకుండా, చందా దారులను అధికం చేసినట్లయితే ముద్రణా ఖర్చు కొంత వరకు తగ్గుతుం దని భావిస్తున్నాము. 'పల్లె సృజన' ప్రతి పల్లెకు చేరాల న్నదే మా ఆకాంక్ష. శుభ కార్యాలలో ఈ పత్రిక చందా నే మీరిచ్చే బహుమతిగా చేసుకుని పత్రిక ఎక్కువ మందికి చేరేలా సహకరిస్తా రని ఆశిస్తున్నాము.

– ఎడిటర్.

# 'పల్లెసృజన' నిర్వహించిన 75 వీక్లీ వెబినార్లపై సమాజ స్పందన



'పల్లెసృజన – క్రియేటివ్ మైండ్స్' ప్రతి బుధవారం నిర్వహిస్తున్న పెద్దలకు, కార్య నిర్వాహకులకు హృదయపూర్వక ధన్యవాదములు. నా పేరు చిట్టిబాబు, శ్రీకాళహస్తి, తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్. రైతు లోకానికి వారానికోసారి కొత్త విషయాలు, నూతన విధానంతో పాటు వ్యవసాయంలో విత్తనం వేయడం నుండి పంట కోత దశ వరకు చేసే పనిలో చిన్న చిన్న పరికరాలతో ఎక్కువ పని, తక్కువ శ్రమ, పనితీరు ఎక్కువతో రైతే తన ఆలోచనలతో రూపొందించిన పరికరాలు ఒక కార్యక్రమం ద్వారా వారానికి ఒకసారి రైతులకు పరిచయం చేయడం అన్నది రైతుల పాలిట వరం అనుకుంటున్నాను. ఓ రైతు తయారు చేసిన పరికరాన్ని పుస్తక రూపంలో ప్రచురించి ప్రతి మూల గ్రామాలకు చేరవేయడం అన్నది చాలా గొప్ప విషయం. అలాగే ప్రతి బుధవారం ఆన్‌లైన్‌లో 'వెబినార్' ద్వారా కొత్త కొత్త పరికరాలు, కొత్త విషయాలు మా రైతులకు అందించడం మాకు ఒక వరం లాంటిది. నా విన్నపం చాలా మంది రైతులు కొన్ని కొత్త పరికరాలు సొంతంగా తయారు చేసుకుంటున్నారు కానీ, వాటిని 10 మందికి అందించడంలో వెనుక ఉన్నారు. కారణం జీవన పరిస్థితి మరియు ఆర్థిక పరిస్థితి. మీలాంటి సంస్థలు అలాంటి వారి ప్రతిభను 10 మందికి పంచాలంటే తయారు చేసేవారు కావాలి అంటే చాలామంది రైతుల ఆలోచనలు ఉన్నా చేసి చూపించలేని పరిస్థితి. అలాంటి ఆలోచనలు ఉన్నవారు మన చుట్టుప్రక్కల ఉంటారు. 'అరె ఆ రైతు ఫలానా వస్తువుతో భలే సులభంగా చేస్తున్నాడు' అనటమే కాని, అతని మేధస్సుని పదిమందికి చెప్పం. అలాంటివారి ఆలోచలను మనద్వారా బయట పెట్టాలి. ఇది నా చిన్న విన్నపం. ఇలాంటి వెబినార్స్ ఆపకుండా నిర్వీర్యంగా జరగాలి అని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ధన్యవాదములు.

– **చిట్టిబాబు,** శ్రీకాళహస్తి, తిరుపతి జిల్లా. ఆం.ప్ర.



అందరికీ నమస్కారం. నాపేరు బొబ్బేపల్లి సాంబశివరావు. నేను ఆం.ప్ర. వ్యవసాయ శాఖ ప్రకృతి విభాగం నందు ఇంటర్నల్ క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌గా పని చేస్తున్నాను. 'పల్లెసృజన – క్రియేటివ్ మైండ్స్' వారు నిర్వహిస్తున్న వెబినార్ ఎంతోమందికి స్ఫూర్తిదాయకం. 74వ వెబినార్ పూర్తి చేసుకుని 75వ వెబినార్ జరుపుకుంటున్నందుకు ముందుగా క్రియేటివ్ మైండ్స్ సీఈవో సుభాష్ చంద్ర గారికి ప్రత్యేక ధన్యవాదాలు. ఈ వెబినార్ నిర్వహించడం వల్ల రైతులకు కొత్త కొత్త రకాల పనిముట్లను వారికి పరిచయం చేయటం జరుగుతుంది. వారికి తెలియని విషయాలు తెలియజేయటం జరుగుతుంది. ఇలాంటి వెబినార్ నిర్వహించడం వలన ఇంకా ఎంతోమంది కొత్త కొత్త ప్రోడక్ట్స్ తయారు చేసి అందించే అవకాశం ఉంటుంది కావున ఈ వెబినార్ నిర్వహించడం ఎంతో అభినందనీయం. ఇలాంటి వెబినార్‌లను నిరంతరాయంగా ఏర్పాటు చేయవలసిందిగా ప్రార్థిస్తున్నాను. – **బొబ్బేపల్లి సాంబశివరావు,** పూనూరు గ్రామం,

యద్దనపూడి మండలం, బాపట్ల జిల్లా. ఆం.ప్ర.



పల్లెసృజన – క్రియేటివ్ మైండ్స్ వెబినార్ లు చాలా నిబద్ధతతో సాగుతున్నాయి. రైతులకోసం ఆలోచించే ఇలాంటి సంస్థ ఉందా అని కొన్ని సందర్భాల్లో వెబినార్లో చేరిన కొత్తవారు ఆశ్చర్య పోతున్నారు. ఇన్నోవేషన్లకు సంబంధించిన సమాచారం అందరికీ తెలియజేయడం వల్ల చిన్న, సన్నకారు రైతులు వాటిని ఉపయోగించుకొని కొంత లబ్ది పొందడం గమనించాను. పల్లె జ్ఞానాన్ని గ్రంథస్తం చేయడంలో ఈ తరానికి ఆద్యులు 'పల్లెసృజన' వారు అని నేను అనుకుంటున్నాను. రైతులకు మరియు అన్నదాతలకు వ్యవసాయం చెయ్యడంపైనే వారు నిమగ్నమై ఉంటారు. వారికి, వారి గురించిన ఆలోచన చాలా తక్కువ. పల్లెసృజనవారు వారి శైలిలో వారికి వీలైనంత వరకు రైతుల కోసం రైతుల్ని ఆలోచించేలా చేస్తున్నారు. – **హరీష్,** సిద్ధిపేట.

ఈ ప్రపంచంలో ప్రతి ఒక్క వర్గం వారి వారి గమ్యాలను చేరడం అంత సునా యాసం కాదు. కానీ, ఎన్ని ఆటంకాలు వచ్చినా ముఖ్యంగా మనదేశ వెన్నెముక అయిన రైతులు సునాయాసంగా ఎలా గమ్యం చేరాలి? అలాగే మారుతున్న కాలాన్ని బట్టి ప్రకృతికి అనుకూలంగా మారుతూ పనులు ఎలా చేసుకోవాలో నేర్పుతూ, వారి చేయి పట్టుకొని దాదాపు గమ్యం చేర్చే విధంగా మన పల్లెసృజన టీం రైతులకు అందించే నిస్వార్థ ప్రత్యక్ష సహాయ సహకా రాలు మరువలేనివి. కరోనాతో ప్రజలకు ప్రత్యక్ష సంబంధాలు తెగిపోవడంతో అంతటితో ఆగకుండా 'వెబినార్' ద్వారా రెట్టించిన ఉత్సాహంతో తిరిగి అందరితో సంబంధాలు ఏర్పరచుకొని తిరిగి ససాయ సహకారాలు అందజేసిన ఘనత ఒకే ఒక్క 'పల్లెసృజన'కే దక్కుతుంది. అందుకు చోహాన్ క్యూ & సివిఆర్ కుటుంబ సభ్యుల తరుపున పల్లెసృజన టీం అందరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. వ్యవసాయం మన పని కాదు. ఒక జీవిత పయనం.

– **శివ షిండే,** వ్యవస్థాపకుడు, న్యూలైఫ్ ఫౌండేషన్, హైదరాబాద్.



'పల్లెసృజన' మరియు 'క్రియేటివ్ మైండ్స్' చేస్తున్న కార్యక్రమాలు చాలా బాగున్నాయి. ముఖ్యంగా రైతుల కోసం చేస్తున్న కార్యక్రమాలు చాలా బాగున్నాయి, చాలా ఉపయోగ పడుతున్నాయి. పల్లెల్లో ఉండే అతి సామాన్యులు తయారు చేస్తున్నటు వంటి గొప్ప గొప్ప ఆవిష్కరణలు సృజనాత్మక మైన పరికరాలు గుర్తించి, వారికి అవార్డులు వచ్చేలాగా చేసి, జాతీయ స్థాయిలో కూడా అవార్డులు వచ్చేలాగా చేస్తున్న 'పల్లెసృజన'కు అభినందనలు. రైతు స్థాయిలో రైతులు అందరూ తయారు చేసుకునే విధంగా పల్లెసృజన ఇలాంటి గొప్ప గొప్ప కార్యక్రమాలు చేస్తోంది. ఎలాంటి లాభాపేక్ష లేకుండా, సమాజానికి, రైతులకు, విద్యార్థులకు ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్న 'పల్లెసృజన'కు అభినందనలు. పల్లెల్లో ఉండే మట్టి వాసన ప్రపంచానికి తెలిసేలా ఇంకా గొప్ప గొప్ప కార్యక్రమాలు చేస్తూ ముందుకు వెళ్ళాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

– **అశోక్,** న్యాచురల్ ఫార్మర్, ఖమ్మం.



ఎవరైతే కొత్త కొత్త ఆవిష్కరణలు చేస్తున్నారో వాళ్ళని గుర్తించి, మిగతా రైతులకు, సమాజానికి తెలియజేయటం గొప్ప విశేషం. ఎందుకంటే ఆవిష్కర్తలు కొత్త ఆవిష్కరణలు చేసినా సమాజానికి తెలియదు. అలాంటి పని 'పల్లెసృజన' వెతికి, వాటిని ఎవరు ఏవిధంగా తయారు చేస్తున్నారు, ఏవిధంగా పని చేస్తుంది అనేది చాలా క్షుణ్ణంగా తెలియజేస్తుంది. ఆ విషయాన్ని ప్రతి బుధవారం నిర్వహించే వెబినార్ ద్వారా, 'పల్లెసృజన' పత్రిక ద్వారా ప్రపంచానికి తెలియజేస్తోంది. ఈ విధంగా చేయడం అటు ఇన్నోవేటర్లకు, ఇటు రైతులకు చాలా ఉపయోగకరమైన పని. గ్రామాల్లో చదువు రాని వారికి కూడా ఈవిధంగా తెలియజేయటం వల్ల ఇన్నోవేటర్లకు, రైతులకు చాలా ఉపయోగకరంగా ఉంటోంది. ఈ కార్యక్రమం నిరంతరం కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

– **మహేష్ రెడ్డి,** ఈరట గ్రామం, నిజామాబాద్ జిల్లా.



నేను 'పల్లెసృజన, క్రియేటివ్ మైండ్స్' ప్రతి బుధవారం నిర్వహిస్తున్న 'వెబినార్' లలో క్రమం తప్పకుండా పాల్గొంటున్నాను. గత పదిహేను సంవత్సరాలుగా బ్రిగేడియర్ గణేశం గారు సుపరిచితులు. వారిచేత మా ఎన్.ఐ.టి., వరంగల్‌లో చాలాసార్లు ప్రసంగాలు ఏర్పాటు చేయటం జరిగింది. అలాగే పునాది స్థాయి ఇన్నోవేషన్ల ప్రదర్శన కూడా నిర్వహించాము. వరంగల్ చుట్టుప్రక్కల ఉన్న పునాది స్థాయి ఇన్నోవేటర్లకు ఎన్ఐటి నుండి ప్రోత్సాహం మరియు వాళ్ళకి సాంకేతిక సలహాలు ఇస్తూ ఉంటాము. క్రియేటివ్ మైండ్స్ నిర్వహిస్తున్న ఈ ప్రతి వారం వెబినార్ ఒక అద్భుతమైన వేదిక. ఇన్నోవేటర్ల ఉత్పత్తులను వారి సృజనాత్మక ఆలోచనని వెలుగులోకి తీసుకు రావటానికి ఇది ఒక గొప్ప అవకాశం. అలాగే 'పల్లెసృజన' పత్రికలో వీరియొక్క ఇన్నోవేషన్ గురించి ప్రచురించి, అవి విరివిగా అందరికీ తెలియజేయటం గొప్ప ప్రయత్నం. ప్రభుత్వం బ్రిగేడియర్ గారి ప్రయత్నాన్ని గుర్తించి, ఆయన గత 17 సంవత్సరాలు చేస్తున్న కృషి చాలా గొప్పది. ప్రభుత్వం కూడా వీరికి కావలసిన ఆర్థిక మరియు ఇతర సదుపాయాలను కూడా కల్పిస్తే బావుంటుందని నా అభిప్రాయం.

ఈ వెబినార్‌ల ద్వారా చాలా మంది రైతు సోదరులకి ఈ ఇన్నోవేటివ్ పరికరాల గురించి తెలియటం, వారు ఈ పరికరాలను కొనుగోలు చేయటానికి అవకాశం కల్పిస్తుంది. 'పల్లెసృజన' పత్రిక మరియు ఈ వెబినార్ వలన పునాది స్థాయి ఇన్నోవేషన్లు ఎక్కువ మందికి చేరేలా ఉపయోగ పడుతాయి. ప్రతివారం వెబినార్లో మాట్లాడుతున్న వాలంటీర్లు, ప్రొఫెసర్లు, పారిశ్రామికవేత్తలు, సీనియర్ ఇన్నోవేటర్లు, ఎంటర్‌ప్రెన్యూర్ల అభిప్రాయాలు ఇన్నోవేటర్లను ప్రోత్సహించేవిధంగా ఉంటున్నాయి. ఈ కార్యక్రమం భవిష్యత్తులో కూడా ఇలాగే నిర్వహించాలని కోరుకుంటున్నాను.

– **ప్రొఫెసర్ ఎల్. ఆంజనేయులు,** హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్, ఎలక్ట్రానిక్ & కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎన్ఐటి., వరంగల్.



'పల్లెసృజన' ప్రతి బుధవారం నిర్వహిస్తున్న వీక్లీ వెబినార్‌లో ఇన్నోవేటర్లు అందరినీ ఒకచోట చేర్చి, వాళ్ళు చేసిన ప్రయోగాలను అందరికీ చూపిస్తూ అలాగే అందులో ఏమైనా తప్పు ఒప్పులు ఉంటే వాటిని సరిచేస్తూ చాలా అద్భుతంగా ముందుకు వెళ్తోంది. ఇలా మరెన్నో కార్యక్రమాలు చేసి ఇంకా ముందుకు వెళ్ళాలని మా కోరిక.

– **బోశెట్టి భగత్ ప్రశాంత్,** గోదావరి ఖని, పెద్దపల్లి జిల్లా.



"దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్" అన్నారు గురజాడ. కానీ ఇప్పుడు మనిషికన్నా మట్టి ముఖ్యం (రియల్ ఎస్టేట్)! దేశాన్ని కాపాడే వాడు సైనికుడు. అదే దేశంలోని సైనికులకి, పాలకులకి, ప్రజలకి అన్నం పెట్టేవాడు రైతు. ప్రసిడెంట్ కన్నా ముందు రైతే ప్రధాన పౌరుడు (ఏ దేశమైనా). అలాంటి మట్టిలో మాణిక్యం మన 'పల్లెసృజన'. పల్లె జ్ఞానాన్ని ఒకరినుంచి మరొకరికి శోధయాత్ర చేసి అందరికీ తెలిసేలా కృషి చేస్తున్నారు. నూతన ఆవిష్కరణలు, కర్తలను ఎంతో ప్రోత్సహిస్తూ దేశానికి తనవంతు కృషి చేస్తున్న మన పల్లెసృజనకి నా వందనములు. పల్లెసృజన పెట్టాలి అని ఆలోచన కూడా ఒక ఇన్నోవేషనే. 75 వెబినార్లను దిగ్విజయంగా నిర్వహించిన రథసారథులు, మరియు తోటి ఆవిష్కర్తలు అందరికీ నా శుభాకాంక్షలు.

– **శేషగిరి. విల్లూరి,** విశాఖపట్నం.

'పల్లెసృజన' – 'క్రియేటివ్ మైండ్స్' నిర్వహిస్తున్న 75 వీక్లీ వెబినార్ లలో పాల్గొని, ఈ కార్యక్రమాన్ని మీరు ఆస్వాదించిన తీరు మీ స్పందనలో వ్యక్తమవుతోంది. కోవిడ్ కారణంగా బయటకు వెళ్ళలేని పరిస్థితుల్లో ఎలాగైనా పాఠకులతో మమేకమై ఉండాలన్న అభిప్రాయంతో ఏర్పాటు చేసిన ఈ వెబినార్‌లు మిమ్మల్ని ఇంతగా ఆకట్టుకోవటం మాకెంతో ఆనందంగా ఉంది. ఈ వీక్లీ వెబినార్ల ద్వారా సమాజానికి, ముఖ్యంగా రైతు లోకానికి ఇంతగా ఉపయోగ పడుతున్నదని మీ మాటల ద్వారా తెలిసింది. మీ ఆదరాభిమానాలతో ఈ కార్యక్రమాన్ని నిర్విరామంగా కొనసాగిస్తామని తెలియజేయుచున్నాము. **–ఎడిటర్**

# ఇతర రాష్ట్రాల పల్లె జ్ఞానం

'హనీబీ' ఆంగ్ల పత్రిక సౌజన్యంతో

લોકસરવાણી
*Loksarvani*
(Gujarati version of Honey Bee)
SRISTI, P O Box No. 15050
Ambawadi, Ahmedabad - 380015, Gujarat
loksarvani@sristi.org

**24401**

**రసంపీల్చే పురుగు, గొంగళి పురుగు నివారణకు :**

ప్రపంచవ్యాప్తంగా ఎటువంటి పంటలకైనా నష్టం చేసేవి రసంపీల్చే పురుగులు, గొంగళి పురుగులు. వీటి నివారణకి రకరకాల పద్ధతులున్నా, గుజరాత్ రాష్ట్రంలోని జాంనగర్ జిల్లా కళ్యాణ్‌పూర్ తాలూకాకి చెందిన 'పర్బత్ భాయ్ హాజీభాయ్ భాటియా' పూర్తి సేంద్రియ పద్ధతిలో చాలా విజయవంతంగా ప్రయోగించి సఫలం చెందుతున్నాడు. ఆయన పద్ధతి ప్రకారం ఒక కిలో వేప ఆకులు, కిలో సీతాఫలం ఆకులు, కిలో ఉమ్మెత్త ఆకులు, కిలో కలబంద ఆకులకి 250 గ్రా. ఉల్లి, 250 గ్రా. ఎండుమిర్చి, 250 గ్రా. వెల్లుల్లి, 200 గ్రా. పొగాకు పొడిల మిశ్రమానికి 10 లీటర్ల నీటిని చేర్చి మూతపెట్టిన బాండాలో సన్నని సెగపై మరిగించాలి. బాగా మరిగిన తర్వాత మిశ్రమాన్ని చల్లార్చి వడకట్టాలి. ఈ వడకట్టిన మిశ్రమంలో 2 లీటర్ల గోమూత్రం, 250 గ్రా. బెల్లం చేర్చి బాగా కలియతిప్పాలి. ఈ మిశ్రమాన్ని పంటపై పిచికారి చేస్తే రసంపీల్చే పురుగులు, గొంగళి పురుగులను సమర్థవంతంగా నిర్మూలించవచ్చు.

**24402**

**ధాన్యం నిలువ చేయటానికి ఊదుగ ఆకులు**

ధాన్యాన్ని పండించటం ఒకయెత్తయితే దాన్ని నిలువ చేయటం మరోయెత్తు. రోజుకో కొత్త పద్ధతి వస్తున్నా, తాను చాలాకాలం నుంచి ఏ ఇబ్బందీ లేకుండా ఓక పద్ధతి వాడుతున్నాను అని చెపుతున్నారు వడోద్రా జిల్లా, ఛోటా ఉదేపూర్ తాలూకా నివాసి 'వసంత్ భాయ్ బి. ధనక్'. తన పద్ధతిని వివరిస్తూ జొన్న, రాగులు, సజ్జలు మొదలైన ధాన్యాలను సాధారణంగా పొడగాటి వెదురు బుట్టలు (గుమ్మిలు) లో నిలువ చేస్తారని, ముందుగా వెదురు బుట్టను ఆవుపేడతో అలుకుతానని, తర్వాత ఒక వరుస ఊదుగ ఆకులు (ఎండినవి), తర్వాత దాన్యము, తర్వాత మరలా ఆకులు, తర్వాత ధాన్యము ఇలా బుట్ట నిండేవరకు పోసి, పైన ఆకులు వేసి మూత పెట్టి గాలి చొరబడకుండా ఆవుపేడతో కప్పెయ్యాలి. తాను ఇరవై కిలోల ధాన్యం నిలువ చేయటానికి ఒక కిలో ఆకులు వాడుతున్నానని, ధాన్యం తీసినప్పుడల్లా మళ్ళీ జాగ్రత్తగా గాలి చొరకుండా ఆవుపేడతో కప్పి పెడతానని ఈ పద్ధతి చాలా చౌకగా వుండటమే కాక, ఎలాంటి పురుగులు ధాన్యాన్ని సోకవని, ఈ పద్ధతిని తాను ఎన్నో సంవత్సరాల నుంచి వాడుతున్నానని చెపుతున్నారు.

**24403**

**పత్తి, కూరగాయల పంటలలో చీడల నివారణకు**

పత్తి, ఏ కూరగాయల పంటలలోనైనా చీడ పట్టకుండా తాను చాలా సులువైన పద్ధతిని వాడుతున్నానని గుజరాత్ రాష్ట్రంలోని జూనాఘడ్ జిల్లా, మాల్యా తాలూకా నివాసి గీతాబెన్ కాంతిలాల్ సోలంకిచెప్తున్నారు. ఈమె తేలుకొండి కాయ ఆకులు, వేర్లను సేకరించి,



నీడలో బాగా ఆరనిచ్చి, వాటిని పొడిచేసి, నీటిలో కలిపి ప్రతి పంట, కూరగాయల పంటలపై పిచికారి చేస్తుందట. తాను 10 మీటర్ల చదరం గల పంటకి 500 గ్రా. పొడిని వాడుతానని చెపుతున్నారు. ఈ పద్ధతి వాడటం ప్రారంభించిన తర్వాత తన పత్తి, కూరగాయల పంటలలో చీడ పట్టడం బాగా తగ్గిపోయిందని చెపుతున్నారీమె.

**24404**

**మిరప పంట అధికోత్పత్తి, చీడ నివారణకు:**

గుజరాత్ రాష్ట్రం, బనస్‌కాంతా జిల్లా, దనేరా తాలూకాకు చెందిన అంబా భాయ్ ధరమ్‌భాయ్ పటేల్ తను వాడే పద్ధతి దేశంలో మిరప పండించే అందరు రైతులకు ఉపయోగ పడుతుందని గట్టిగా చెపుతున్నారు. తన పద్ధతిని వివరిస్తూ ఆయన "ఒక కిలో వేపాకులు, ఒక కిలో జిల్లేడు ఆకులు, ఒక కిలో జెముడు ఆకులు తీసుకొని నీరు కలిపి ఈ మిశ్రమంలో కొంచెం ఉప్పును కలిపి 4 నుండి 5 రోజులపాటు ఒక పాత్రలో వేసి మూతపెట్టి మురగ బెట్టారు. తర్వాత ఈ మిశ్రమాన్ని వడకట్టి, మిరప పంటపై పిచికారి చేస్తే పంట ఆరోగ్యంగా ఉండటమే కాక, అధిక దిగుబడిని ఇస్తుంది అని చెపుతున్నారు.

**24405**

**పొలంలో ఎలుకల నివారణకు మూలికలతో మందు**

పొలాల్లో ప్రత్యేకించి ధాన్యం పండించే పొలాల్లో ఎలుకల బెడద ఎక్కువ. అవి పంటకు చాలా నష్టం కలుగజేస్తుంటాయి. గుజరాత్ రాష్ట్రంలోని సూరత్ జిల్లా, ఉమర్‌పాడ తాలూకా నివాసి 'కన్సర్‌భాయ్



గజలాభాయ్ చౌదరి' తాను ఎలుకల బాధనుండి తప్పించుకోవటానికి మూలికలు వాడుతానని చెపుతూ తనపద్ధతిని ఈవిధంగా వివరించారు. ఆయన గచ్చకాయ గింజలు, ఇప్ప విత్తనాలు, జొన్నలు కలిపి పొడిచేసి, తగినంత నీటిని చేర్చి చిన్న చిన్న గులికలుగా తయారు చేస్తానని, ఈ గుళికలను ఎలుక బొర్రలలో ఉంచుతానని, ఈ గులికల వాసన, రుచి నచ్చక ఎలుకలు పారిపోతాయని, తానీ పద్ధతి చాలా సంవత్సరాల నుంచి వాడుతున్నానని చెపుతున్నారు.

**24407**

**పశువులలో గాయాలకు లేపనం:**

గుజరాత్ రాష్ట్రానికి చెందిన సబర్‌కాంతా జిల్లా, సాతన్‌పూర్ ఇదర్ తాలూకా నివాసి 'చౌదరీ మంగూబెన్ బాబా భాయ్' పశువులకి దెబ్బలు తాకితే త్వరగా నయం కావని, దానికి కారణం గాయాలపై ఈగలు చేరి, పుండును ఇంకా రణం చేయటం వల్లనేనని, దీనికి విరుగుడుగా తానొక పద్ధతిని అవలంభిస్తున్నానని చెప్తున్నారు. ఈమె పద్ధతి ప్రకారం తక్కలి ఆకుల రసాన్ని తీసి మెత్తటి దూదితో ఆ పుండుపైన అద్దటం వలన పుండు త్వరగా నయమౌతుందని, తక్కలి ఆకులని దాణాతో కలిపి రెండు మూడు రోజులపాటు తినిపిస్తే ఫలితం ఇంకా త్వరగా వస్తుందని తాను కనుగొన్నానని చెప్తున్నారు.

**24414**

**మొక్కలపై చీడ నివారణకు ఒక మతగురువు కనుగొన్న చికిత్స:**

మణిపూర్ రాష్ట్ర రాజధాని ఇంఫాల్ సమీపంలోని లాంజింగ్ ప్రాంత నివాసి 'లాంగ్‌జామ్ లోకేంద్రో సింగ్' క్రీస్తవ మతగురువు. డిగ్రీ వరకు చదివిన ఈయన మత ప్రవక్తగానే కాక, వ్యవసాయం కూడా చేస్తూవుంటారు. తన పొలంలో మొక్కలకు పట్టిన చీడల నివారణకు తానే ఒక సేంద్రియ పద్ధతిని కనుగొన్నారు. పోకబంతి ఆకులను, పూలను నీడపట్టున ఆరబెట్టి పొడిచేసి ఉంచుకుంటాడు. రెండు లీటర్ల నీళ్లలో 500 గ్రా. ఈ పొడిని కలిపి 50 గ్రా. ఉతికే సోడాను కలిపి రెండు గంటల తర్వాత పొలంలో పిచికారి చేస్తారు. ఈ కలిపిన మిశ్రమం 10 చ.మీ. ప్రాంతానికి సరిపోతుంది. ఈవిధంగా రెండు మూడు రోజులకోసారి పూత పూసే ముందు లేదా కాపు కోతకు ముందు పంటలపై పిచికారి చేస్తే మంచి ఫలితం వుంటుందని చెప్తున్నారీయన. ఇది పేనుబంక నివారణకు సమర్థవంతంగా పనిచేస్తుంది అంటారాయన.

**24416**

**ధాన్యం నిలువకి బిరియాని ఆకు:**

బీహార్ రాష్ట్రంలోని బక్సద్ జిల్లా, మొహల్లా సోనయ్‌పట్టి ప్రాంత నివాసి 'మురళీ శరణ్ సింఘు' ధాన్యం నిలువకి బిర్యాని ఆకు వాడుతానని చెప్తున్నారు. పప్పులు, ధాన్యం నిలువ చేయటానికి ముందు వెదురు గుమ్మిలో క్రింద బిర్యాని ఆకులు వేసి, వాటిపై ధాన్యాన్ని పోసి మళ్ళీ ఒకసారి మధ్యలో ఆకులు వేసి, ఆపైన మళ్ళీ ధాన్యం వేసి, పై భాగంలో మళ్ళీ బిర్యాని ఆకులు పరిచి నిలువ చేస్తే ధాన్యాన్ని 7 నుండి 8 నెలల వరకు సురక్షితంగా కాపాడుకోవచ్చు అని చెపుతున్నారీయన. ఈ పద్ధతిలో ప్రత్యేకత ఏమిటంటే బిర్యాని ఆకు (తేజ్ పత్తా)ని వంటలో వాడిన తర్వాత కూడా శుభ్రం చేసి ఎండబెట్టి ధాన్యం నిలువ చేయటానికి వాడుకోవచ్చు. చాలా రకాల పంటలలో ఆకుముడత తెగులు పంటకు ఎంతో నష్టాన్ని చేకూరుస్తుంది. ఈ తెగులు ప్రత్యేకించి, చలికాలం, మేఘావృతమైనప్పుడు ఎక్కువగా సోకుతుంది. దీని నివారణకు గుజరాత్ రాష్ట్రం, సురేంద్రనగర్ జిల్లా, హన్వాడ్ తాలూకా,



దేవీపూర్ గ్రామ నివాసి 'మహేష్ భాయ్ జయరామ్ భాయ్ లఖాత్రియా' గన్నేరు చెట్లను ఆశ్రయిస్తాడు. ఇది పూర్తి సేంద్రియ పద్ధతే అని చెపుతాడాయన. ఆయన రెండు కిలోల గన్నేరు ఆకులను తీసుకుని, మెత్తగా నూరి ముద్దచేసి, ఆ ముద్దను 5 లీటర్ల నీటిలో కలిపి ఐదారు రోజులపాటు మురగబెడ్తాడు. తర్వాత ఈ ద్రావకాన్ని కొద్దిసేపు మరిగించి, 150 మి.లీ. ఈ మరిగించిన ద్రావకంలో 15 లీటర్ల నీటిని కలిపి పంటపై ఆకులు క్రింద భాగానికి తగిలేలా పిచికారి చేస్తాడు. దీంతో ఆకుముడత తెగులు సమర్థవంతంగా అరికట్ట బడుతుంది అంటారు. ఈ ద్రావకాన్ని మురగబెట్టేటపుడు గాలి పారకుండా మూత పెడితే త్వరగా మురిగిపోతుందట. ఈద్రావకం బూజు తెగులుకు కూడా బాగా పనిచేస్తుంది అంటారాయన.

## NIF లో మీకు అవసరమైన ఇన్నోవేషన్‌ల అన్వేషణ

నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ గత 14 యేళ్ళుగా సేకరించిన గ్రామీణ ఇన్నోవేషన్లు, సాంప్రదాయ జ్ఞానం ప్రజలందరికీ అందుబాటులో వుండటానికై ఒక వెబ్‌సైట్ తయారు చేసింది. ఈ జ్ఞానమంతా వెబ్‌సైట్ www.nifindia.org లో చూడవచ్చు. అలాగే మీకు ఏ సమస్యకైనా పరిష్కారం ఈ జ్ఞానం కోశంలో వుందో లేదో తెలుసుకోవాలి అనుకుంటే

**NIF టోల్ ఫ్రీ నెంబర్ 1800 233 5555**

కు కూడా ఫోన్ చేసి తెలుసుకోవచ్చు. కానీ ఫోన్‌లో మాట్లాడాలనుకునేవారు ఇంగ్లీషు లేదా హిందీలో మాత్రమే సంప్రదించవలసి వుంటుంది.




కాల, ప్రాంతాలకు అతీతంగా శాస్త్ర విజ్ఞాన జిజ్ఞాస మానవాళిని అంటిపెట్టుకునే వుంది. ప్రాచీన భారత దేశంలో విభిన్న రంగాలలో విశేష కృషి చేసిన మహనీయులు విజ్ఞానాన్ని బహు ముఖాలుగా విస్తరించే ప్రయత్నం చేసిన ఆలోచనాపరులు కోకొల్లలు. ఆర్యభట్టు, వరాహమిహిరుడు, చరకుడు, సుశ్రుతుడు, భాస్కరుడు మొదలైన వారు ఖగోళము, గణితము, వైద్యము లాంటి శాస్త్రాలలో తమ పరిశోధనల ద్వారా కొన్ని మైలురాళ్ళను సృష్టించారు. ఆ కోవలోకి చెందిన వారే 'సురపాలుడు'.

వృక్ష శాస్త్రంలో నిగూఢమైన విషయాలను ఎన్నింటినో పరిశోధించి, అపురూపమైన వృక్ష వైద్య రహస్యాలను గ్రంథస్తం చేసినవాడు సురపాలుడు. మొక్కల లక్షణాలు కూడా మానవుల శరీరాన్ని పోలి వుంటుందన్న శాస్త్ర పరిజ్ఞానాన్ని ఆవిష్కరించినవాడు సురపాలుడు. వృక్ష శాస్త్రంలో విశేషమైన కృషి చేసిన ఈ మహనీయుడి గురించిన సమాచారం ఇటీవలి వరకు మన దృష్టికి రానేలేదు. ఆయన రచించిన "వృక్షాయుర్వేదం" అన్న గ్రంథం ఇంగ్లాండులోని ఒక గ్రంథాలయంలో ఇటీవలే బయట పడింది. ఆ పుస్తక ఆంగ్లానువాదం 'ఏసియన్ అగ్రో హిస్టరీ ఫౌండేషన్ (ఎఎహెచ్ఎఫ్), హైదరాబాద్ వారు **1996**లో ప్రచురించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వృక్ష శాస్త్రం పట్ల ఆసక్తిగల ప్రతి ఒక్కరికీ ముఖ్యంగా పరిశోధకులకు, విద్యార్థులకు, రైతులకు అందుబాటులోకి తీసుకు రావాలన్న ఉద్దేశ్యంతో 'ఐ-సర్వ్', హైదరాబాద్ వారు **2015** లో తెలుగు అనువాద ప్రక్రియకు ఉపక్రమించడం జరిగింది.

ఈ గ్రంథాన్ని 'పల్లెసృజన' పాఠకులకు అందించాలన్న సంకల్పంతో మే-జూన్, **2021** సంచిక నుండి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం. ఈ గ్రంథంలోని మహత్తరమైన జ్ఞానాన్ని పాఠకులు అవగాహన చేసుకుని, ఆచరిస్తారని ఆశిస్తున్నాం. **-ఎడిటర్.**

### (గత సంచిక తరువాయి)

307. అక్కడ మనిషిలో సగం లోతు తవ్విన తర్వాత "రోహిత" చేప (?) కనిపిస్తుంది. మొదటి మట్టి తామ్రవర్ణంలో (ఒక రకమైన పసుపు పచ్చ రంగు) తదుపరి తెల్లగా, ఆ తర్వాత నలుసులు, ఇసుక, నీళ్ళు ఒకటి తర్వాత ఒకటి వరుసగా అగుపిస్తాయి.

308. "బదిరి" (రేగి) చెట్టుకు తూర్పు దిక్కున ఒక చీమల పుట్ట కనిపిస్తే పశ్చిమం వైపు, ముగ్గురు మనుషుల లోతున నీళ్ళు ఉన్నట్టు అంచనా వేసుకోవచ్చు. మనిషిలో సగంలోతు తవ్విన తర్వాత ఒక తెల్లటి చుంచెలుక కనిపిస్తుంది.

309. "బదిరి" (రేగి) చెట్టు ప్రక్కన "పలాశ" (మోదుగ) చెట్టు ఉన్నచో, దానికి పశ్చిమం వైపు ముగ్గురు మనుషుల మీద ఒక పావు లోతులో నీటి జల ఉంటుంది. ఒక మనిషి లోతు త్రవ్విన తరువాత నీటి పాము కనిపిస్తుంది.

310. "కాష్ఠ" మరియు "ఉదుంబర" (మేడి) చెట్ల సమీపంలో చీమల పుట్ట ఉంటే, ముగ్గురు మనుషులపై ఒక పావు లోతులో పశ్చిమం వైపు నీరు ప్రవహిస్తుందని అర్థం.

311. అక్కడ పాలిపోయిన పసుపు రంగులో మట్టి, పాలవలె తెల్లని రాళ్ళు ఉంటాయి. సగం మనిషి లోతు త్రవ్విన తర్వాత తామర పువ్వులాగా తెల్లగా ఉన్న ఒక ఎలుక కనపిస్తుంది.

312. "బిభీతక" (విభీతక) (తాండ్ర) చెట్టు సమీపంలో దక్షిణ దిక్కున చీమల పుట్ట ఉంటే, దానికి తూరుపు దిశన మనిషిన్నర రోతులో నీళ్ళు ప్రవహిస్తుంటాయి.

313. అదే వృక్షానికి ఒక మూర దూరంలో పశ్చిమం వైపు చీమల పుట్ట ఉంటే, నలుగురు మనుషుల మీద సగం మనిషి లోతులో జల ప్రవాహం ఉందన్న మాట.

314. ఆ ప్రదేశంలో ఒక మనిషి లోతు త్రవ్విన తరువాత ఒక తెల్లటి తేలు కనిపించే అవకాశం ఉంది. తదుపరి కాషాయం రంగులో ఉన్న ఒక రాయి కనిపిస్తుంది. కాని, పశ్చిమం వైపు ఉన్న ఈ నీటి జల, రెండేళ్ళలో కనుమరుగు అయిపోయే ప్రమాదం ఉంది.

315. "కోవిదార" (కాంచన) వృక్షానికి ఈశాన్యం వైపు చీమలపుట్ట ఒకటి, "కుశ" (దర్భ) మరియు "అసిత"లు ఉంటే, ఆ రెండు చెట్ల మధ్య అయిదున్నర మనుషుల లోతులో, చిన్నదైనా నిలకడగా ఉండే నీటి ప్రవాహం ఉంటుంది.

316. నీటికోసం భూమిని త్రవ్వుతున్నపుడు ఒక మనిషి లోతులో తామర పువ్వు లోపలి భాగాన్ని పోలిన ఎర్రని పాము ఒకటి, ఎర్రటి నేల మరియు కెంపు వర్ణంతో సరితూగే రంగు గల రాళ్ళు కనిపించిన చో ఆ ప్రదేశంతో నీటి ప్రవాహం ఉందని అర్థం.

317. పలు వృక్షాలు వున్నచోట, ఆ చెట్లమధ్య ఒక కప్ప కనిపించిందంటే, వాటికి ఒక మూర దూరంలో నాలుగున్నర మనుషుల లోతులో తప్పనిసరిగా నీటి ప్రవాహం ఉంటుంది.

318. ఏదైనా పొలం "ముంజ" గడ్డితో గాని, 'కశ" మరియు "కుశ" గడ్డితో గాని నిండి ఉందంటే, ఎక్కడయితే నేల నీలం రంగులో

ఉండి పరకలు, నలుసులతో నిండి ఉంటుందో, అక్కడ పుష్కలంగా తియ్యటి నీటి జల ఉందని అర్థం. అది నల్ల మట్టిగాని, ఎర్రమట్టి గాని అయితే నీళ్ళు తియ్యగా ఉండి సమృద్ధిగా లభిస్తాయి.

319. రేణువులతో నిండి ఎర్ర రంగులో నున్న పొలంలో లభించే నీరు ఒగరుగా ఉంటుంది. తామ్ర వర్ణం అంటే పసుపు పచ్చ రంగు, ఎర్ర రంగు కలిపిన రంగు గల పొలంలో లభ్యమయ్యే నీరు కారం గాను, తెల్లగానున్న భూమిలో ఉప్పగాను ఉంటాయి. అదే రీతిలో, నీలం రంగు పొలంలోని నీటిజల తియ్యటి రుచి కలిగి ఉంటుంది.

**పంట మరియు జంతు ఉత్పత్తికి సంబంధించిన వృక్ష సంబంధమైన సూచనలు:**

320. "న్యాగ్రోధ" (మర్రి లేక జమ్మి) వృక్షం పెరిగిన భూమి, బార్లీ (యవల) పంటకు అనుకూలమైనది. "తిందుక" (తుమ్మికి) చెట్టు మొలకెత్తిన పొలంలో అయితే, "శస్తిక" (60 రోజుల్లో పంటకొచ్చే ఒక రకమైన వరి) బాగా పండుతుంది. ఏ పొలంలోనైతే 'అశ్వత్థ' (రావి) ఉంటుందో ఆ పొలం అన్ని పంటలకు అనుకూలమైనది.

321. ఏదైన పొలంలో "జంబు" (రేగి) వృక్షాలు పెరుగుతూ ఉంటే ఆ భూమి నువ్వులు, మినుముల పంటలకు సానుకూలంగా ఉంటుంది. "శిరీష" (దిరిసెన) చెట్టు ఉనికి పెసల పంటకు, "మధుక" తిప్పతీగ లేక ఇప్ప చెట్లు గోధుమ పంటకు, "సప్తవర్ణ" (ఏడాకుల అరటి) పెరుగుదల బార్లీ పంట అనుకూలతకు సూచన.

322. "హస్తికర్ణ" వృక్షాలు పెరుగుతున్నాయంటే అక్కడ ఏనుగులు ఉన్నాయని అర్థం. అలాగే "అశ్వకర్ణ" (వాటి ఆకులను బట్టి ఆ పేరు వచ్చింది) గుర్రాల ఉనికిని సూచిస్తాయి. పాటల (కలిగొట్టు) చెట్ల పెరుగుదల, అక్కడ ఆవులు ఎక్కువగా ఉండటానికి సంకేతం. అయితే, అరటి చెట్లు గొర్రెలు, మేకలు ఎక్కువగా అక్కడ తిరుగాడటాన్ని సూచిస్తాయి.

323. మామిడి చెట్టు సంతోషానికి, "భల్లాతకి" (జీడి) భయానికి, తాటిచెట్లు ఆరోగ్యానికి ప్రతీకలు. "ఖదిర", "చంద్ర" మరియు "శమి" (జమ్మి) చెట్లు కరువు కాటకాలను సూచిస్తే, "అర్జున" (మద్ది) చెట్లు సంతృప్తికరమైన వర్షాలకు నిదర్శన.

324. "పిచుమంద" (వేప) మరియు "నాగ" పువ్వులు కరువును అడ్డగిస్తే, "కపిత్థము" (వెలగ) ఆకలి కేకలను సూచిస్తుంది. "నిచుల" (ఎర్రగన్నేరు) వృక్షం వర్ష లేమిని లేదా సమస్త ఈతి బాధలను సూచిస్తుంది.

325. ఈ విధంగా వీర శిఖామణులెందరికో నేతృత్వం వహించిన రాజు శ్రీ భీమభూపాలుని ప్రాపకంలో, వృత్తిలో సామర్థ్యాన్ని సాధించి తన సహజ సిద్ధమైన ఆసక్తితో, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన వైద్య నిపుణుడు సురపాలుడు వృక్షాలకు సంబంధించిన ఆయుర్వేదం గురించి, ఈ గ్రంథాన్ని రచించాడు.

**(వృక్ష ఆయుర్వేద గ్రంథం సమాప్తం)**

గత ఆరు సంచికల్లో ప్రచురించిన 'వృక్ష ఆయుర్వేద' తెలుగు అనువాదం పాఠకులకు ఉపయోగకరంగా ఉందని 'పల్లెసృజన' అభిప్రాయం. ఈ వేద జ్ఞానంపై మీ సలహాలు, విమర్శలు, ప్రయోగాలు చేసిన వారి అనుభవాలు 'పల్లెసృజన'తో తప్పక పంచుకోవాలని కోరుతున్నాము. **- ఎడిటర్.**

**వృక్షాయుర్వేద శాస్త్రంలో చెప్పబడిన ఔషధములు**

**అ. మొక్కల పోషణకు, మొక్కల వ్యాధులకు, ఉభయత్ర వాడేవి:**

1. ఆవు పాలు, పెరుగు (మజ్జిగ), పేడ, మూత్రము. 2. వాయు విడంగములు, వీటి తైలము. 3. నువ్వులు, నువ్వుల నూనె, నువ్వుల పిండి. 4. ఆవాలు, తెల్ల ఆవాలు, ఆవ పిండి, ఆవ నూనె. 5. చేప కొవ్వు, చేప నూనె. 6. పులియబెట్టిన సారాయి. 7. యష్టిమధుకం, 8. తేనె 9. పంది కొవ్వు., 10. నేల గుమ్మడి., 11. ఉలవలు. 12. త్రిఫలములు (కరక, ఉసిరి, తాడి), 13. ఊడుగ తైలము, 14. ఊడుగ విత్తులు, 15. ఆముదం గింజలు, 16. వేపాకులు, వేప గింజల పిండి.

**ఆ. పోషణకు:**

1. చెరకు రసం, 2. కొబ్బరి నీళ్ళు, 3. పులిసిన మజ్జిగ, 4. అరటి పండ్లు, 5. బెల్లం, 6. చింతగింజలు, 7. మేకపాలు, పేడ, 8. పెసలు, 9. మినుములు, 10. ఉలవలు, 11. నేరేడు, 12. పగడ, 13. వట్టి వేళ్ళు, 14. వారాహి, 15. జీలకర్ర, 16. బార్లీ (యవలు), 17. ముస్త, 18. మురము, 19. నటము, 20. వెలగ, 21. ధాతకి, 22. ముస్త, 23. మోదుగ, 25. పత్తి విత్తనాలు, 26. మంజిష్ఠ, 27. లోధ్ర, 28. బూరుగ, 29. చెంగల్వ కుష్ఠ, 30. గుండ్రని శెనగలు, 31. పాము చర్మము, 32. ఉప్పు, 33. కొడిశపాల, 34. విషముష్ఠి, 35. నిమ్మరసం, 36. వాయు విడంగాలు, 37. అంబు, 38. అరగ్వధ (రేల), 39. అరిష్ట, 40. నిర్గుండి (వావిలి), 41. కట్పలము (పినగుమ్మడు), 42. కట్వంగము (దుండిగము), 43. కుమేరాక్షి, 44. రోహిణి, 45. శతపుష్పి, 46. అగర, 47. వన, 48. వేపనూనె, 49. మిరపకాయలు, 50. ఉల్లి, 51. ఆముదం గింజలు, 52. వైపర్ణికం, 53. పాదరసం.

**ఇ. వ్యాధులకు చికిత్స:**

1. ఆముదం గింజలు, 2. పొగాకు, 3. ఉప్పు, 4. జిల్లేడు, 5. కొడిశెపాల, 6. విషముష్ఠి, 7. నిమ్మరసం, 8. పావురం మాంసం, మలం, 9. నల్లజీడి (భల్లాతకము), 10. యండ్రకాయ చిప్పలు, 11. వాకుడు, 12. మధుకం, 13. వస, 14. ఉసన, 15. గానుగ పిండి, 16. ఇటుకల పొడి, 17. గోమయ భస్మం, 18. శ్రీఫలం, 19. సర్వతో భద్రము (గుమ్మడు), 20. పాటలము, 21. గనికరికము, 22. స్యోనాకము, 23. వేపాకు, 24. పల్లేరు ఆకు, 26. ఉలిమిడి ఆకులు, 27. పోగాకు, 28. పచ్చి మిర్చి, 29. వెల్లుల్లి, 30. జిల్లేడు, 31. ఇంగువ.

## పాఠకులకు విన్నపము

మీ ప్రాంతంలో పంటల పైన కాని, పశువుల పైన కాని చేసిన, చేస్తున్న ప్రయోగాలను గురించి వివరంగా తెలియజేస్తే మీ పేరున ఈ 'పల్లె జ్ఞానం' సమాజానికి తెలియజేస్తాము. పంటల తెగుళ్ళ నివారణ, పశువుల రోగాల నివారణకు సంబంధించిన మీకు తెలిసిన లేదా మీరు విజయవంతంగా ప్రయోగించిన పద్ధతులను తెలియజేయండి.

**- ఎడిటర్**

## మరుగున పడుతున్న జ్ఞాన దేవాలయాల్లో (గ్రామాల్లో) జ్ఞానాన్వేషణ

# పల్లెసృజన వాలంటీర్ల జ్ఞాన యాత్రలు

| సంఖ్య | తేదీలు | నుండి | వరకు | జిల్లా |
|---|---|---|---|---|
| 1. | 30 ఏప్రిల్ – 1 మే, 2011 | గిర్నిబావి | లక్నెపల్లి | వరంగల్ |
| 2. | 18–20 నవంబర్, 2011 | పాకాల | గంగారం | వరంగల్ |
| 3. | 24–26 ఫిబ్రవరి, 2012 | అచ్చంపేట | బాకారం | మహబూబ్ నగర్ |
| 4. | 15–17 జూన్, 2012 | చింతూరు | మోతుగూడెం | ఖమ్మం |
| 5. | 02–04 నవంబర్, 2012 | కాటారం | మహదేవపూర్ | కరీంనగర్ |
| 6. | 01–03 మార్చి, 2013 | దస్నూర–బి | ఇంద్రవెల్లి | ఆదిలాబాద్ |
| 7. | 21–23 జూన్, 2013 | పాలకొండ | వీరఘట్టం | శ్రీకాకుళం |
| 8. | 27–29 సెప్టెంబర్, 2013 | శ్రీకాళహస్తి | కొత్త కండ్రిగ | చిత్తూరు |
| 9. | 20–22 డిసెంబర్, 2013 | నిజాంపేట్ | నారాయణ్‌ఖేడ్ | మెదక్ |
| 10. | 28ఫిబ్రవరి–2 మార్చి,2014 | రాజాపేట్ | ఆలేరు | నల్గొండ |
| 11. | 9–11 మే, 2014 | ఆత్మకూరు | కపిలేశ్వరం | కర్నూలు |
| 12. | 20–22 జూన్, 2014 | ఇబ్రహీంపట్నం | మాల్ | రంగారెడ్డి & నల్గొండ |
| 13. | 5–7 సెప్టెంబర్, 2014 | వర్ని | తడకపల్లి | నిజామాబాద్ |
| 14. | 26–28 డిసెంబర్, 2014 | ఉలవపల్ల | కావలి | నెల్లూరు |
| 15. | 15–17 మే, 2015 | పార్వతీపురం | సాలూరు | విజయనగరం |
| 16. | 25–27 సెప్టెంబర్, 2015 | మారేడుమిల్లి | రమణయ్యపేట | తూర్పు గోదావరి |
| 17. | 8–10 జనవరి, 2016 | కన్నాపురం | కొండ్రుకోట | పశ్చిమ గోదావరి |
| 18. | 15–17 ఏప్రిల్, 2016 | కంభం | గన్నెపల్లి | ప్రకాశం |
| 19. | 24–26 జూన్, 2016 | వీరపునాయనిపల్లె | గంగిరెడ్డిపల్లె | కడప |
| 20. | 23–25 సెప్టెంబర్, 2016 | హనిమిరెడ్డిపల్లి | కంబాలపల్లి | అనంతపురం |
| 21. | 9–11 డిసెంబర్, 2016 | రేపల్లె | బట్టిప్రోలు | గుంటూరు |
| 22. | 17–19 ఫిబ్రవరి, 2017 | చిన్నబోయినపల్లి | పసర | భూపాలపల్లి |
| 23. | 02–04 జూన్, 2017 | నిర్మల్ | ఖానాపూర్ | నిర్మల్ |
| 24. | 22–24 సెప్టెంబర్, 2017 | జహీరాబాద్ | గంగూర్ | సంగారెడ్డి |
| 25. | 15–17 డిసెంబర్, 2017 | కొత్తకోట | కొమ్మంగి | విశాఖపట్నం |
| 26. | 23–25 ఫిబ్రవరి, 2018 | నాగాయలంక | హంసలదీవి | కృష్ణా |
| 27. | 08–10 జూన్, 2018 | పెద్దకొత్తపల్లి | సోమశిల | నాగర్ కర్నూలు |
| 28. | 12–14 అక్టోబర్, 2018 | వలేటివారిపాలెం | ఈతమొక్కల | ప్రకాశం |
| 29. | 21–23 డిసెంబర్, 2018 | కంబాలపల్లి | గూడూరు | మహబూబ్‌నగర్ |
| 30. | 19–21 ఏప్రిల్, 2019 | పొందూరు | నైరా | శ్రీకాకుళం |
| 31. | 14–16 జూన్, 2019 | వెలుగోడు | తమ్మడపల్లె | కర్నూలు |
| 32. | 20–22 సెప్టెంబర్, 2019 | ఎల్లందు | కొత్తగూడెం | భద్రాద్రి కొత్తగూడెం |
| 33. | 20–22 డిసెంబర్, 2019 | రామచంద్రాపురం | గంగుడుపల్లి | చిత్తూరు |
| 34. | 28 ఫిబ్రవరి–1మార్చి,2020 | భూపాలపల్లి | ముత్తారం | జయశంకర్ భూపాలపల్లి |
| 35. | 25–27 డిసెంబర్, 2020 | బయ్యారం | గంగారం | మహబూబాబాద్ |
| 36. | 26–28 ఫిబ్రవరి, 2021 | తుమ్మాను వలస | గజపతి నగరం | విజయనగరం |
| 37. | 30 జులై–1ఆగష్టు,2021 | 14వ మైల్‌స్టోన్ చెక్‌పోస్ట్ | నాగార్జున సాగర్ | నల్గొండ |
| 38. | 1–3 అక్టోబర్, 2021 | కొండమనాయుని పాలెం | కానిశెట్టిపల్లి | అనంతపురం |
| 39. | 17–19 డిశంబర్, 2021 | తాడ్వాయి | ఏటూరు నాగారం | ములుగు |
| 40. | 25–27 ఫిబ్రవరి, 2021 | ఏపూరు | సోమశిల | నెల్లూరు |
| 41. | 24–26 జూన్, 2022 | మక్తల్ | ధరూర్ | నారాయణ్‌పేట్ & గద్వాల |














భారత పూర్వ రాష్ట్రపతి కీ.శే. డా. ఎపిజె అబ్దుల్ కలాం గారి స్మృత్యర్థం 'హనీబీ నెట్‌వర్క్, సృష్టి, గెయిన్' సంస్థలు 12వ తరగతి వరకు చదువుకుంటున్న బాల బాలికలలోని సృజనాత్మకతను, ఇన్నోవేషన్‌లు చేసే పటిమను ప్రోత్సహించటం కోసం "ఎపిజె అబ్దుల్ కలాం 'ఇగ్నైటెడ్ మైండ్' చిన్న పిల్లల సృజనాత్మకత మరియు ఇన్నోవేషన్" పోటీలు ఏర్పాటు చేయగా, దేశవ్యాప్తంగా 22 రాష్ట్రాలు మరియు కేంద్ర పాలిత ప్రాంతాల నుండి సుమారు 9 వేల మంది బాల బాలికలు పాల్గొన్నారు. వాటిని లబ్ద ప్రతిష్ఠులైన న్యాయ నిర్ణేతలు పరిశీలించి, 9 మంది పిల్లల ఆలోచనలను పురస్కారాలకు ఎంపిక చేసి, మరొక 6 గురి ఆలోచనలకు ప్రోత్సాహక బహుమతులను ఇవ్వటానికి నిర్ణయించారు.


**ఇన్నోవేషన్/ఆలోచన పేరు:** చిన్న రైతుల కోసం వేరుశనగ నుండి పప్పును వేరు చేసే యంత్రం



**విద్యార్థి పేరు :** యాష్ గోకుల్ క్షీర సాగర్, 8వ తరగతి, మాలోజిరాజ్ విద్యాలయం, లోనంద్, సతారా, మహారాష్ట్ర.

**సమస్య:** వేరుశనగ కాయల నుండి పప్పును వేరు చేయటం.

**పరిష్కారం:** రైతులు వేరుశనగ విత్తనం కొరకు మరియు మహిళలు వంటింట్లో వేరుశనగ విత్తనాలను వేరు చేయటానికి ఎక్కువ శ్రమ, ఖర్చు లేకుండా ఒక పరికరాన్ని తయారు చేశాడు యాష్ గోకుల్ క్షీర సాగర్ అనే విద్యార్థి. మోటార్ సైకిల్ మరియు సైకిల్ యొక్క విడి భాగాలను ఉపయోగించి తయారు చేశాడు ఈ పరికరం. ఇందులో వేరుశనగలను నింపి ఈ పరికరానికి ఏర్పాటు చేసిన పెడల్‌ను తిప్పినట్లయితే వేరు శనగ పొట్టు, విత్తనాలు వేరు వేరుగా క్రిందకు వస్తాయి. ఎటువంటి ఇంధనం అవసరం లేకుండా ఇది పని చేస్తుంది. పర్యావరణ అనుకూలమైనది.



**ఇన్నోవేషన్/ఆలోచన పేరు :** వికలాంగుల ఊతకర్రలోనే మడత కుర్చీ ఏర్పాటు

**విద్యార్థి పేరు :** సందీప్ బిస్వాస్, 11వ తరగతి, జవహర్ నవోదయ విద్యాలయ, పిరూలియా, పశ్చిమ బెంగాల్.



**సమస్య :** తక్కువ ఖర్చుతో ఊతకర్రలోనే అలసట వచ్చినపుడు కూర్చునే విధంగా నమూనా.

**పరిష్కారం :** ఈ విద్యార్థి వికలాంగుల ఊతకర్రలలోనే అవసరమైనపుడు కూర్చునే విధంగా ఒక కుర్చీ ఏర్పాటు చేశాడు. వినియోగదారుడు ఎటువంటి శ్రమ లేకుండా ఈ ఊతకర్రలలో ఏర్పాటు చేసిన కుర్చీని ఏర్పాటు చేసుకుని సౌకర్యంగా కూర్చోవచ్చు. వికలాంగులు ఎక్కడికైనా వెళ్ళినపుడు అందరిలా నిల్చునే శ్రమ లేకుండా బొమ్మలో చూపిన విధంగా కుర్చీని ఏర్పాటు చేసుకుని,



అవసరమైనపుడు హాయిగా కూర్చోవచ్చు. ఈ కుర్చీని ఇప్పటికి వారివద్ద ఉన్న చేతి ఊత కర్రలకు కూడా ఏర్పాటు చేసుకోవచ్చు.


**ఇన్నోవేషన్/ఆలోచన పేరు:** $CO_2$ **నుండి ఇంధనం తయారు చేసే యంత్రం**

**విద్యార్థి పేరు:** ప్రియాంక టిర్కీ, 11వ తరగతి, హెూలీ క్రాస్ హైయ్యర్ సెకండరీ స్కూల్, ఛత్తీస్‌ఘర్.



**సమస్య:** వాతావరణ కాలుష్యం నుండి ఉచితంగా ఇంధనం తీసే యంత్రం.

**పరిష్కారం:** వాతావరణంలో సి.ఓ. 2 వల్ల కలిగే కాలుష్యం నుండి విముక్తి పొందటమే కాదు, రోజురోజుకూ పెరిగి పోతున్న పెట్రోలు, డీజిల్ వాడకం సమస్యను తీర్చవచ్చు. వాతావరణం నుండి ఇంధనాన్ని తయారు చేసే ఈ యంత్రాన్ని ఉపయోగించటం వల్ల వతావరణంలోని సిఓ2ను సేకరించి, దాన్ని చాలా అధిక ఉష్ణోగ్రత వద్ద వేడి చేసి, వివిధ రసాయనాల ప్రతిచర్య చేయుటం ద్వారా ప్రజా ప్రయోజనకరమైన ఇంధనాన్ని తయారు చేయవచ్చు. ఈవిధంగా కొన్ని విదేశాల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేశారు. ఇది ఇప్పటికీ ప్రయోగాత్మక దశలోనే ఉంది.



**ఇన్నోవేషన్/ఆలోచన పేరు: రోడ్లను శుభ్రంగా ఊడ్చటం కోసం ఆటో రిక్షాకు బ్యాటరీతో నడిచేలా పరకరం ఏర్పాటు.**

**విద్యార్థి పేరు: విశాల్ కుమార్,** 91వ తరగతి, ప్రభుత్వ సీనియర్ సెకండరీ స్కూల్, దామ్లా, హర్యానా.



**సమస్య:** అపరిశుభ్రంగా ఉన్న రోడ్లను ఆటోమేటిక్‌గా ఊడ్చేందుకు తక్కువ ధరలో రోడ్లను ఊడ్చే యంత్రం.

**పరిష్కారం:** ఈ ఆటోరిక్షా సౌర శక్తితో మరియు బ్యాటరీతో పని చేస్తుంది. ఆటోకు క్రింద ఒక చీపురు ఏర్పాటు చేయుబడి ఉంటుంది. మామూలుగా ప్రయాణీకులను చేరవేయటంతో పాటు, ఎక్కడైనా రోడ్లు అపరిశుభ్రంగా ఉంటే ఈ చీపురు నడిచే యంత్రం స్విచ్ ఆన్ చేస్తే చాలు ప్రయాణీకుల రవాణాకు ఎటువంటి ఆటంకం లేకుండా రోడ్లను కూడా శుభ్రం చేస్తుంది.



**ఇన్నోవేషన్/ఆలోచన పేరు: పండ్లలోకి కృత్రిమ తియ్యదనం వచ్చేలా చేసిన ఇంజక్షన్‌లను గుర్తించే లిట్మస్ పేపర్.**

**విద్యార్థి పేరు: దేగ్ బుస్రా ఇంతియాజ్ ఆదం,** 8వ తరగతి, ప్రైమరీ మిశ్రా పాఠశాల, భరూచ్, గుజరాత్.

**సమస్య:** పండ్లు, కూరగాయలలో కృత్రిమ తీపి ఇంజక్షన్లు చేయటాన్ని గుర్తించడానికి తక్కువ ఖర్చుతో కూడిన పద్ధతి లేకపోవటం.



**పరిష్కారం:** పండ్లు, కూరగాయల వ్యాపారులు తమ ఉత్పత్తులు బాగా అమ్ముడు పోవటానికి కృత్రిమమైన ఇంజక్షన్లను వాటిలోకి పంపి రుచి, తియ్యదనం పెరిగేలా చేయటం వల్ల వినియోగ దారుల ఆరోగ్యం పాడవుతుంది. ఈ సమస్యను గుర్తించటానికి తయారు చేయబడిందీ లిట్మస్ పేపర్. దీన్ని పండ్లు కూరగాయలపై పెట్టి చూసినట్లయితే ఇంజక్షన్ ద్వారా తియ్యదనం వచ్చేట్లు చేసినట్లయితే అది రంగు మారుతుంది. సహజంగా తియ్యదనం ఉన్నట్లయితే అది రంగు మారదు. ఈరకమైన పరీక్షను సులభంగా చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడు కోవచ్చు.



gian

Honey Bee Network

# Submit your Ideas, Innovations, Prototypes

## హనీబీ నెట్‌వర్క్
## క్రియేటివిటీ & ఇన్‌క్లూసివ్ ఇన్నోవేషన్ అవార్డులు
## HBN CRIIA

మీవద్ద మనుషులు, పశువులు, పర్యావరణం ఎదుర్కొనే దైనందిక సమస్యలను పరిష్కరించే సృజనాత్మక, సాంప్రదాయ పద్ధతులు లేదా ఆలోచనలు ఉన్నాయా?

**మీ ఆలోచనలను, ఇన్నోవేషన్‌లను, నమూనాలను పంపండి**

ఎవ్వరైనా దరఖాస్తు చేసుకోవచ్చు !

మీ దరఖాస్తులను ఈ చిరునామాకు పంపండి...
Email : gian@gian.org or post them to
GIAN, Bungalow No. 1,
Sattellite Complex, Nr. Mansi Crossroads,
Satellite, Ahmedabad – 380 015. Gujarat
Call us at : 079 26769686



మోటార్ సైకిల్‌తో పని చేసే పొలం దున్నే యంత్రం
మన్సుఖ్‌భాయ్ జగాని, గుజరాత్

ఎంపికైన ఆలోచనలు, నమూనాలను HBN CRIIA పురస్కారంతో సత్కరించటంతో పాటు, అవి కార్యరూపం దాల్చటానికి తగ్గ ఆర్థిక / ఇతర సహాయం కూడా చేయబడుతుంది.

చివరి తేది
31
ఆగస్టు,
2022

last date



ఎంత ఎత్తున్న విద్యార్థులైనా నీళ్ళు త్రాగటానికి వీలుగా వాలుగా ఏర్పాటు చేసిన కుళాయిలు.
ఛాయా ఠాకూర్, గుజరాత్.

# ఆయుర్వేద జ్ఞాన మథనం



- 'వైద్య' ఉమా మహేశ్వర రావు

## స్థానికంగా లభించేవాటితో ఆరోగ్య చిట్కాలు :

### కలబంద (అలోవీర) :

కలబంద ఒక 2 అంగుళాల పొడవున్న ముక్కను తీసుకుని, పైన వున్న తోలును తీసివేసి, లోపలి గుజ్జునుతీసుకోవాలి. 'పటిక'ను నీళ్ళలో కొద్దిగా వేసి కలబంద గుజ్జును ఆ నీటితో శుభ్రం చేసి, కంటి రెప్ప పైన కొద్ది సేపు ఉంచుకున్నట్లయితే (రెప్ప పైన అటు ఇటు కదుల్చుతూ ఉంటే ఇంకా మంచిది) కంటికి సంబంధించిన మంటలు, కంట్లో దురద, వేడివల్ల ఇతర కారణాల వల్ల కంట్లో నీరు కారటం లాంటి జబ్బులన్నీ నయమౌతాయి.

అలాగే అదే కలబంద గుజ్జుకు చిటికెడు పసుపును పూసి, 30 రోజుల పాటు కడుపులోకి తీసుకున్నట్లయితే లివర్‌కు సంబంధించిన జబ్బులన్నీ నయమైపోతాయి.

### కస్తూరి పసుపు:

ఈ కస్తూరి పసుపు ఏ ఆయుర్వేద మూలికలు అమ్మే దుకాణం లో అయినా లభిస్తుంది. ఆ కస్తూరి పసుపును తీకుని కొద్దిగా నీటితో తడిపి, శరీరంపైన, ముఖంపైన పూసుకున్నట్లయితే శరీరంపైన ఏర్పడ్డ ఎటువంటి చర్మవ్యాధులైనా నయమౌతాయి. ముఖంపైన ఏర్పడ్డ నల్ల మచ్చలు కూడా నయమౌతాయి. ఇది సౌందర్యాన్ని పెంపొందించే అత్యంత ఉపయోగకరమైన ఔషధం.

### కానుగ చెట్టు:

కానుగ చెట్టు లేని గ్రామం సాధారణంగా ఉండదు. ప్రతి ఊర్లో అందరికీ చిరపరిచితమైన చెట్టు ఇది. ఈ కానుగచెట్టు పూత తీసుకుని (ఈ పూత కానుగ చెట్టునుండి రాలి క్రింద పడి వుంటుంది) బాగా ఎండిన తర్వాత దాన్ని పొడిగా చేసుకుని ఒక గాజు సీసాలో భద్రపరచుకోవాలి. ఆ పొడిని ప్రతిరోజూ ఒక చెంచాడు తీసుకుని, నీటిలో లేదా పాలల్లో కలుపుకుని తీసుకున్నట్లయితే 'అతిమూత్రం' వ్యాధి నుండి విముక్తి పొందవచ్చు. కానుగ చెట్టుకు కాసిన కాయలను ఉడికించి తీసుకున్నట్లయితే ఎటువంటి చర్మవ్యాధులైనా సరే ఆఖరికి కుష్టు వ్యాధి నుండి కూడా ఉపశమనం పొందవచ్చు.

మొలల వ్యాధి ఉన్న వారు ఈ కానుగ కాయలను గుజ్జుగా చేసుకుని మలద్వారం వద్ద ఉంచి ఒక గుడ్డతో కట్టిన్నట్లయితే మొలల వ్యాధి నుండి ఉపశమనం పొందవచ్చు.

కానుగ నూనె మరియు ఆముదం సమాన పరిమాణంలో తీసుకుని వేడి చేసి చల్లారిన తర్వాత 'పక్షవాతం' వచ్చిన రోగులకు శరీరంపై పూసినట్లయితే ఆ రోగం నుండి ఉపశమనం పొందవచ్చు.

### క్యాబేజి:

క్యాబేజి కేవలం కూర వండుకుని తినటానికి మాత్రమే పనికి వస్తుంది అని కొందరు అనుకుంటూ ఉంటారు. కానీ, దాంతో శరీరంపైన ఏర్పడ్డ గడ్డలు కరిగి పోతాయి. క్యాబేజి గడ్డ యొక్క ఆకుల పొరలను తీసుకుని శరీరంపైన గడ్డలు ఉన్నచోట పైన వుంచి కట్టు కట్టినట్లయితే ఆ గడ్డలు పండుబారి పగిలిపోతాయి.

క్యాబేజిని నీటిలో బాగా ఉడికించి, ప్రతి రోజూ లేదా రోజు విడిచి రోజూ 50 గ్రాముల చొప్పున తీసుకున్నట్లయితే శరీరంలోని అధిక కొవ్వును కరిగించే గుణం దీనికుంది. ఇలాగే గ్యాస్ ట్రబుల్ ఉన్నవారు కూడా తీసుకున్నట్లయితే ఆ వ్యాధి నుండి విముక్తి పొంద వచ్చు. ఈ చిట్కాతో అల్సర్ వ్యాధి కూడా తగ్గిపోతుంది. క్యాబేజిని కూరగా వండుకుని తింటే ఈ విధంగా పనిచేసే అవకాశాలు తక్కువ. కేవలం నీటిలో ఉడికించి ఏమీ కలపకుండా తీసుకుంటేనే పైన చెప్పిన లక్షణాలన్నిటినుంచి ఉపశమనం పొందవచ్చు.

### పెండలం:

గ్రామాల్లో పెండలం గడ్డను పండిస్తూ ఉంటారు. పెండలం గడ్డ కేవలం కూర వండుకుని తినటానికి మాత్రమే ఉపయోగిస్తారని అనుకోవటం పొరపాటు. ఇది శరీరంలోని వాతాన్ని హరిస్తుంది, శరీరానికి మంచి బలం చేకూరుస్తుంది. ఇది మానవ శరీరానికి చాలా గొప్ప ఔషధ గుణాలు కలిగిన గడ్డ.

### కుంకుడు:

ఒకప్పుడు కుంకుడు చెట్లు దాదాపు ప్రతి గ్రామంలో ఉండేవి. ముఖ్యంగా గ్రామీణ యువతులు ఈ కుంకుడు కాయలతోనే తల స్నానం చేసేవారు. మారుతున్న కాలంలో కుంకుడు కాయలకన్నా 'షాంపూ' వాడకం పెరిగిపోవటంతో దీని ఔషధ గుణాలు కూడా మరుగున పడిపోయాయి. ఈ కుంకుడు చెట్టు ఆకులను తెచ్చుకుని, తలపైన నిండుగా కప్పి ఒక గుడ్డతో తలకు ఒక గంట పాటు కట్టు కట్టుకుని స్నానం చేసినట్లయితే ఎన్ని సంవత్సరాల నుండి బాధిస్తున్న తలనొప్పి కూడా కేవలం వారం రోజుల్లో నయమై పోతుంది.

ఈ ఆకులు మరో రకంగా కూడా పని చేస్తాయి. తలలో 'తిరోవాతం' అని మెదడులో నీరు చేరింది అని డాక్టర్లు అంటూ ఉంటారు. పైన చెప్పిన విధంగా కుంకుడు కాయల చెట్టు ఆకులను తలకు కట్టుకుంటే చాలు మెదడులో చేరిన నీటిని కూడా ఇది పూర్తిగా తొలగిస్తుంది.

**గమనిక:** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

'వైద్య' ఉమా మహేశ్వర రావు ఫోన్ నెం.: 9440286854

**సెగ గడ్డల నివారణకు ప్రకృతి వైద్యం :**

కొందరికి శరీరంపై అక్కడక్కడా 'సెగ గడ్డలు' ఏర్పడుతూ ఉంటారు. శరీరం అధిక వేడికి గురవటం వల్ల ఇలాంటి గడ్డలు కొందరి శరీరంపై ఏర్పడుతూ ఉంటాయి. వాటి నివారణకు పొలాల్లో లభించే 'రణపాల' ఆకులను సేకరించి, ఆముదం నూనెలో బాగా వేడి చేసి, చల్లారిన తర్వాత ఆ ఆకును శరీరంపైన ఏర్పడిన 'వేడి గడ్డ'పైన ఉంచి, ఆ ఆకుపైన ఒక తమలపాకును బోర్లించి, ఆపైన మెత్తని గుడ్డతో కట్టు కట్టాలి. ఇలా ఒక వారం రోజుల పాటు రోజూ రాత్రి పడుకునే ముందు ఆకును కట్టుకుని తెల్లారిన తర్వాత తీసివేస్తూ ఉండాలి. ఇలా చేయటం వల్ల గడ్డలు పాకానికి వచ్చి, చీము లేదా చెడు రక్తం బయటకు వచ్చి, గడ్డలు నశించిపోతాయి.

**పులిపిర్ల సమస్యతో బాధపడే వారికి చికిత్స :**

కొంతమందికి శరీరంపైన ముఖ్యంగా మెడ క్రింది భాగం మరియు చంకలలో విపరీతంగా పులిపిర్లు ఏర్పడి చాలా ఇబ్బందికి గురి చేస్తూ ఉంటాయి. మరి కొందరు మానసిక వేదనకు కూడా గురవుతూ ఉంటాయి. వీటి నివారణకు ఒక చిన్న చిట్కా. అడవులలో లభించే "కామంచి ఆకు"లను సేకరించి, ఒక రోట్లో వేసి మెత్తగా నూరిన తర్వాత (మిక్సీలో వేయవద్దు) దాన్ని చేతితో పిండి రసాన్ని తీయాలి. అలా తీసిన రసంలో ఒకటి రెండు చిటికెల 'సైంధవ లవణం' పొడిని కలిపి ఉంచుకోవాలి. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ఈ రసాన్ని పులిపిర్లపై కొద్దిగా పూసినట్లయితే ఒక వారం రోజుల్లో పులిపిర్లు రాలిపోతాయి.

**తలలో పేల నిర్మూలనకు చిట్కా:**

చాలా మందికి తలలో పేలు చాలా ఇబ్బందిని కలిగిస్తూ ఉంటాయి. ఈ సమస్య నివారణకు సీతాఫలం పండు గింజలను సేకరించి, వాటి పొట్టును వలిచినట్లయితే లోపల తెల్లటి విత్తన పప్పు ఉంటుంది. ఆ పప్పును రోట్లో వేసి బాగా మెత్తగా దంచాలి. ఆ తర్వాత దాన్ని తీసి ప్రక్కన ఉంచుకుని, అదే రోట్లో కొద్దిగా 'గసగసాలు' వేసి మెత్తగా దంచినట్లయితే గసగసాల పాలు వస్తాయి. అందులో మొదట దంచి పెట్టుకున్న సీతాఫలం గింజల పప్పును కలిపి మళ్ళీ మెత్తగా నూరినట్లయితే ఆ మిశ్రమం ఒక పేస్టులాగా తయారవుతుంది. ఈ పేస్టును ఒక వారం రోజుల పాటు తలకు అంటించుకుని, ఒక గంట తర్వాత స్నానం చెసినట్లయితే తలలోని పేలన్నీ చనిపోయి, వెంట్రుకలు కూడా పొడిపొడిగా తయారౌతాయి.

**శరీరంపైన ఏర్పడే తెల్ల మచ్చల నివారణకు సాంప్రదాయ వైద్యం :**

కొందరికి శరీరంపై అక్కడక్కడా తెల్లటి మచ్చలు ఏర్పడుతూ ఉంటాయి. ముఖ్యంగా చిన్న పిల్లలకు ఇటువంటి సూచనలు బాగా కనిపిస్తూ ఉంటాయి. అలాంజి జబ్బు ఉన్నవారు 'కృష్ణ తులసి' ఆకులను ప్రధానంగా తీసుకుని, అందులో మరో రెండు రకాల తులసి (తులసి లో చాలా రకాలు ఉంటాయి) ఆకులను కొన్నింటిని జత చేసి అన్నిటినీ కలిపి రోట్లో వేసి బాగా మెత్తగా రుబ్బాలి. తర్వాత ఆ పేస్టును లేదా దాని నుండి తీసిన రసాన్ని తెల్ల మచ్చలపై ఒక వారం – పది రోజుల పాటు పూసినట్లయితే ఈ తెల్లమచ్చలు నయమౌతాయి.

**మహిళల రొమ్ముపై ఏర్పడే గడ్డల నివారణకు వైద్యం :**



- 'వైద్య' కొమెర జాజి

పొలాల్లో 'గొర్రె జిడ్డు ఆకు' లభిస్తుంటుంది. వాటి ఆకులను సేకరించి, మెత్తగా రుబ్బిన తర్వాత ఆ పేస్టును ఒక తమలపాకులో పెట్టి రొమ్ముపైన గడ్డ ఉన్నచోట పెట్టి ఒక మెత్తటి గుడ్డతో కట్టు కట్టినట్లయితే ఒక వారం రోజుల్లో ఈ గడ్డలు మెత్తబడి పగిలి పోతాయి. ఈ వైద్యం శరీరంపై ఏర్పడే సాధారణ గడ్డలకు కూడా చేసుకోవచ్చు.

**రక్త హీనత నుండి శరీరాన్ని కాపాడుకునే చిట్కా:**

కొంతమందిలో రక్త హీనత చాలా ఎక్కువగా ఉంటుంది. అటువంటి వారు త్వరతగతిని వివిధ రోగాల బారిన పడుతూ ఉంటారు. నీరసంగా ఉంటారు. ఈ సమస్య నివారణకు బాగా మాగిన అరటి పండు (పైన తోలు నల్లగా మారి ఉంటుంది) తీసుకుని, దాన్ని తేనెలో అద్దుకుని ప్రతిరోజూ ఉదయం తిన్నట్లయితే వీలైనంత త్వరలో రక్త వృద్ధి జరిగి, మనిషి ఆరోగ్యంగా తయారౌతాడు.

**కీళ్ళు, మోకాళ్ళ నొప్పులు, వాపుల నుండి ఉపశమనానికి మందు :**

ఈ సమస్యల నుండి బయట పడటానికి సాధారణంగా అడవుల్లో లభించే "బందెడు" చెట్టు ఆకులను సేకరించాలి. ఈ బందెడు ఆకును అడవి సమీపంలో ఉండే గ్రామాల వారు తమ ఇళ్ళకు దడిగా కూడా కట్టుకుంటూ ఉంటారు. ఇది అడవుల్లో ఎక్కువగా లభించే ఆకు. ఈ బందెడు ఆకు ఒక గుప్పెడు, మునగ ఆకు ఒక గుప్పెడు తీసుకుని ఒక బాణిలో వేసి పొయ్యిపైన పెట్టి బాగా వేడి చెయ్యాలి. ఆ తర్వాత కొద్దిగా నీరు అందులో పోసి ఆ నీటిని ఆకులు బాగా ఇముడ్చుకునేలా పొయ్యిపైన వేడి చెయ్యాలి. ఆ తర్వాత పొయ్యిమీద నుండి బయటకు తీసి కాస్త గోరు వెచ్చగా అయిన తర్వాత ఒక మతలపాకు లేదా ఏదైనా ఆకుపైన ఈ వండిన ఆకు మిశ్రమాన్ని ఉంచి, దానిపైన కూడా మరో ఆకును కప్పి, శరీరంలో నొప్పి ఉన్నచోట పెట్టి మెత్తటి బట్టతో కట్టు కట్టాలి. ఇలా ఒక వారం రోజుల పాటు చేసినట్లయితే అన్ని రకాల కీళ్ళ నొప్పులు, మోకాలి వాపులు కూడా నయమౌతాయి. వాపులు ఉన్నవారి మోకాళ్ళలోని నీటిని కూడా ఈ వైద్యం లాగేస్తుంది.

**చర్మంపైన విపరీతమైన దురద నివారణకు చిట్కా:**

కొందరికి చర్మంపైన విపరీతంగా దురద ఏర్పడుతుంది. అక్కడ ఎటువంటి గాయాలు, ఇతర ఏవీ ఉండకున్నా దురద మాత్రం విపరీతంగా ఉంటుంది. అటువంటి వారు ఒక చిన్న పని చేస్తే త్వరగా నయమౌతుంది. వాము ఒక గుప్పెడు తీసుకుని ఒక చిన్న గరిటలో వేడి నిప్పులు తీసుకుని, వామును అందులో వేస్తూ ఉంటే పొగ వస్తుంది. ఈ పొగను శరీరంలో జిల ఉన్నచోట పట్టించినట్లయితే దురద త్వరలో నయమౌతుంది. ●

**గమనిక :** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

'వైద్య' కొమెర జాజి, ఫోన్ నెం. : 9908411700

### 41వ శోధయాత్ర గురించి ఒక యాత్రికుడి స్పందన

కొన్నిసార్లు మనం చేసే చిన్న 'మాట సాయం' కూడా ఎదుటి వారికి ఎంతో ఉపకారము చేకూర్చగలదు. ఒక వ్యవసాయ సంబంధిత టెలిగ్రామ్ గ్రూప్‌లో 41వ శోధయాత్ర గురించి కరపత్రము (బ్రోచర్) ఆ గ్రూపులో ఇంతకు ముందే ఎవరో పెట్టి ఉన్నారు. నేను దాన్ని గమనించలేదు. కానీ అది పెట్టిన తర్వాత రోజు కరపత్రాన్ని జోడించి చూపిస్తూ గ్రూప్ అడ్మిన్ గారు ఇలా రాసినారు. అందరూ తప్పక వీలు చేసుకొని మరీ ఈ శోధయాత్రకు వెళ్ళిరండి అని. ఆ ఒక్కమాట నన్ను శోధయాత్రికున్ని చేసింది. ఎందుకంటే ఆ మాట ఆయన చెప్పకపోతే నేను ఆ బ్రోచర్ని చూసి ఉండేవాన్ని కాదు.

ఇంతటి అద్భుతమైన శోధయాత్రని నాకు పరిచయం చేసిన ఆ పెద్దమనిషికి నా కృతజ్ఞతలు.

ఆ బ్రోచర్ చదువుతున్నపుడు అక్కడ ఇలా ఉంది. ఈ యాత్రలో మీకు నలుగురు గురువులు. 1. ప్రకృతి, 2. సహ యాత్రికులు, 3. గ్రామ ప్రజలు, 4. మీరు.

ఈమాట నన్ను చాలా ఆకర్షించింది. ఆ యాత్ర యొక్క ఉద్దేశ్యం సున్నితంగా మనసులోకి నిండింది.

ఈ యాత్ర తెలియక ముందు ఆ మూడురోజులపాటు నేను వేసుకున్న షెడ్యూల్ అంతా క్షణాల్లో మాయమైపోయింది.

చిన్న శోధయాత్ర అనే పెద్ద పడవముందు నా షెడ్యూల్ అంతా చిన్న నీటి తెప్పలుగా మారిపోయాయి.

ఈ యాత్రకు నేను ఎందుకు వెళుతున్నాను?

ఈ యాత్ర నుండి నేను ఆశిస్తున్నది ఏమిటి?

అనే కొన్ని ప్రశ్నలకు ప్రయాణం ప్రారంభమవుతున్న మొదటిరోజు నావద్ద సమాధానము లేదు.

కానీ ఏదో అమూల్యమైన జ్ఞాపకాలు ఇచ్చే దీవిలోకి నేను ప్రయాణించబోతున్నాను అన్నట్టుగా ఉత్సాహం కలిగింది.

ఆ యాత్ర నాకిచ్చిన స్వాతంత్ర్యమో లేక అసామాన్య సహ యాత్రీకుల సాంగత్యమో నాకు తెలియదు కానీ, ఆ మూడు రోజులపాటు 50 కి.మీ. దూరం చెప్పులు (పాదరక్షలు) లేకుండా నడవాలి అని నేను నిశ్చయించుకున్నాను. చివరి వరకు నడిచి అందమైన అనుభూతిని సొంతం చేసుకున్నాను.

బ్రిగేడియర్ గణేశం గారి ఆధ్వర్యంలో యాత్రీకులకు ఈ యాత్రలో ఎటువంటి నిర్బంధాలు ఉండవు. పూర్తి స్వాతంత్ర్యం యాత్రీకుల సొంతం.

ఆ మూడు రోజులు జూక్కో నిముషం ఒక్కో అనుభవం.

ఆ మూడు రోజులు ఒక్కో గ్రామము ఓ గ్రంథాలయం.

ఆ మూడు రోజులు ఒక్కో సహ యాత్రీకుడు ఒక ప్రొఫెసర్.

ఆ మూడు రోజులు పూర్తి యాత్ర ఓ విశ్వవిద్యాలయం నుండి పొందిన డాక్టరేటులా తోచింది.

యాత్ర పూర్తి చేసుకుని తిరుగు ప్రయాణంలో ఉన్న నేను నా గతం అనే సంచిలోకి తొంగి చూస్తే....

ఆనందము, అనుభవము, విజ్ఞానము, ప్రకృతి జ్ఞానము అలాగే విలువలు కలిగినవారి పరిచయం. ఇలాంటి కొన్ని అందమైన తేలికపాటి వస్తువులు ఉండటం గమనించాను.

ధన్యవాదములు. **– శోధయాత్రి హరీష్.**

### ఆరుణా గణేశం గారికి,

మీరు పంపిన 'పల్లెసృజన' పత్రిక అందింది. 75 సంవత్సరాలుగా చందా కట్టి చదువుతున్న 'రీడర్స్ డైజెస్ట్' పత్రికను ప్రక్కన పడేసి, వెంటనే ఈ పత్రికను చదివాను. రీడర్స్ డైజెస్ట్ కన్నా నేను పల్లెసృజన పత్రికకు ప్రాధాన్యతనిస్తాను. పత్రికలో మోటార్ సైకిల్‌పై వెళ్ళే ప్రయాణీకులకు నడుం నొప్పి రాకుండా నివారించే పరికరం వ్యాసం చాలా బావుంది. ఇది సమాజానికి చాలా అవసరం కూడా. ఇటువంటి వాటిని వెంటనే తయారు చదేయించి, సమాజానికి అందజేయడం ఎంతో అవసరం. ఇది చాలా చిన్నది మరియు అత్యవసరమైన పరికరం అని భావిస్తున్నాను. **– కామేశ్వరమ్మ.**

### కామేశ్వరమ్మ గారూ,

పల్లెసృజన పత్రిక పట్ల మీకున్న అభిమానానికి కృతజ్ఞతలు. మీలాంటి వారి సహకారమే మమ్మల్ని ఎంతగానో ప్రోత్సహిస్తోంది. మీరు సూచించిన విధంగా మోటార్ సైకిల్ బ్యాక్ రెస్ట్ పరికరం తయారు చేయించి, సమాజానికి అందించేలా ఇన్నోవేటర్ సంతోష్‌కు తప్పక సహకరిస్తాము. **– ఎడిటర్.**

### శోధయాత్రికుడి స్పందన

పల్లెలకు పట్టణాలకు మధ్య 'వారధి' ఈ పల్లెసృజన.

రైతులను రాజ్యాధికారులను కలిపే 'సన్నిధి' ఈ పల్లెసృజన.

ప్రకృతికి ప్రాణికి మధ్య 'పెన్నిధి' ఈ పల్లెసృజన.

గతం మరిచి గతి తప్పే తరానికి దిక్సూచికా 'వరమిది' ఈ పల్లెసృజన. **– పల్లెసృజన శోధయాత్రికుడు "హరి"**

### హరి గారూ,

ధన్యవాదములు. మీరు 'పల్లెసృజన' గురించి ఇంతగా ప్రేరేపితులు అయినందుకు మాకెంతో సంతోషంగా ఉంది. మాకు తెలియని విషయాలు చెప్పి 'పల్లెసృజన'కు వన్నె తెచ్చారు. కృతజ్ఞులం. **– ఎడిటర్**

పల్లెసృజన
www.pallesrujana.org

# అమ్మకానికి సిద్ధంగా వున్న రైతుల కోసం రైతుల ఇన్నోవేషన్లు

## శ్రీతైలం

ప్రకృతిలో లభించే మూలికలతో తయారు చేయబడిన "కండరాలు, కీళ్ళ నొప్పులు, గాయాలు, దోమల నివారణ" అన్నిటికీ పనిచేసే ఒకే ఒక్క అద్భుత ఔషధం. శరీరంలోని అన్ని రకాల నొప్పులు, చర్మ వ్యాధులు, కాలిన గాయాలు, పుండ్లకు ప్రత్యేకించి మధుమేహం (షుగర్) రోగులకు ఏర్పడే పుండ్లను కూడా ఇది సమర్ధవంతంగా తగ్గిస్తుంది. దోమల నివారిణిగా కూడా పని చేస్తుంది.






శ్రీతైలం వాడక ముందు చక్కెర వ్యాధి గల ఒక వ్యక్తి కి అయిన గాయం

శ్రీతైలం వాడిన మూడు వారాల తర్వాత గాయంలో మార్పు





## అలుపు లేకుండా ఎరువు వేసే పరికరం

ఇన్నోవేటర్ : **మహేష్ రెడ్డి**, నిజామాబాద్

మొక్కల మొదళ్ళవద్ద యూరియా వేయాలంటే వంగి మొక్కవద్ద వేయాలి. భూమిపైన వెయ్యటం వల్ల కొంత ఎరువు ఆవిరి రూపంలో పోయి, తక్కువ శాతం మొక్కకు అందుతుంది, కూలీల ఖర్చు కూడా ఎక్కువ. ఈ సమస్యలన్ని పరిష్కరిస్తుంది ఈ ఫర్టిలైజర్ గన్. దీని సహాయంతో సులభంగా మొక్క వద్ద వంగాల్సిన అవసరం లేకుండా నిలబడి, వేసిన మొత్తం ఎరువు మొక్కకు పూర్తిగా అందేలా భూమిలో వేయవచ్చు. మొక్క వద్ద భూమిలోకి పరికరాన్ని గుచ్చి ఒక మీటను నొక్కడం ద్వారా ఆ మొక్కకు ఎంత అవసరమో అంతే ఎరువు నేరుగా మొక్క ప్రక్కనే భూమిలోకి పడిపోతుంది. ఇలా చేస్తే ఎరువు గాలిలో కవకుండా 90 శాతం ఎరువు మొక్కకు అంది పంట దిగుబడి పెరిరుగుతుంది. ఒక మనిషి రోజుకు 4 ఎకరాల వరకు మిరప, మొక్క జొన్న, ప్రత్తి, ఇతర పంటలకు ఎరువులు వేయవచ్చు.

## సమాన దూరం, లోతులో విత్తనం వేసే జడిగం

ఇన్నోవేటర్ : **గొర్రె అశోక్**, సూర్యాపేట



ఏ విత్తనమైనా సమాన దూరంలో, సరియైన లోతులో నాటితేనే విత్తనాలు వృధా కాకుండా మొలకెత్తుతాయి లేకుంటే విత్తనం వృధా, పంట దిగుబడి కూడా తగ్గుతుంది. ఈ సమస్య పరిష్కారానికి సన్న చికన్నకారు రైతుల కోసం తయారు చేయబడిన చేతి పరికరం ఈ జడిగం. ఒక అడుగు నుండి 2-3 అడుగుల దూరం, 2-3 అంగుళాల లోతులో విత్తనం వేసుకోవచ్చు. సాధారణ రైతు కూడా దీన్ని అందుబాటులో ఉంచుకోవటానికి అనువైన తక్కువ ఖరీదులో లభిస్తుంది. ప్రత్తి, మొక్కజొన్న లాంటి విత్తనం నాటే పనులు ఇక వంగి భూమిలో నాటి అలసి పోవాల్సిన అవసరం లేకుండా నిలబడే విత్తనం వేసుకుంటూ సమాన దూరంలో నాటుకోవచ్చు.

### తులసి

పంటల ఎదుగుదలకు, వైరస్ నివారణకు సేంద్రియ మందు




### పర్ఫెక్ట్

వరిలో సుడిదోమ
పత్తి, మిరప, ఇతర కూరగాయ పంటలను ఆశించే రసం పీల్చే పురుగు, తెల్లదోమ, పచ్చదోమ, పేండినల్లి మొదలైన వాటిని సమర్థవంతంగా నివారిస్తుంది




### స్టాప్

మిరప లో 'బొబ్బర' అనే ఆకు ముడత తెగులును సమర్థవంతంగా నివారించింది.




### వండర్

పంటలను ఆశించే లద్దె పురుగు, పచ్చపురుగు, కాయతొలుచు పురుగు, కాండం తొలుచు పురుగు, ఆకుచుట్టు పురుగు లను సమర్థవంతంగా అరికడుతుంది.




కావలసిన వారు సంప్రదించండి : బి. సుభాష్ చందర్, ఫోన్ : 9652801700

PALLE SRUJANA Telugu Bi-monthly July - August 2022 RNI No. TELTEL 2012/74620

# పల్లెసృజన

## పాత సంచికలు కావాలా?

ఒక్కో సంచిక రూ. 30/-లు మాత్రమే

ఇన్నోవేషన్ల వీడియోల కొరకై ఈ QR కోడ్‌ను స్కాన్ చేసి చూడవచ్చు.


























పల్లెసృజన సభ్యులు కండి, పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి. సభ్యులుగా చేరాలనుకున్నవారు చందా కట్టి, మీ చిరునామాను స్పష్టంగా 9866001678 కి పంపడం మరవకండి.

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్ - 500 094. ఫోన్: 040-40253096

లేదా నేరుగా ఈ బ్యాంక్ లో జమ చేయండి.

**M/s Pallesrujana, Canara Bank, Sainikpuri, Secunderabad.**
**SB A/c No. 30232200019150, IFS Code : CNRB0013023**

PhonePe

"Phone Pe" no 9866 00 1678

QR code for Phone Pe

లేదా

'గూగుల్ పే' చెయ్యాలనుకున్న వారు 9652801700 నెంబరుకు పంపి మీ చిరునామా ఎస్ఎంఎస్ లేదా వాట్స్‌యాప్‌లో పంపండి.

## సభ్యత్వ వివరాలు

| వివరములు | వ్యక్తిగతం | లైబ్రరి |
|---|---|---|
| రెండు సంవత్సరాలకి | 400/- | 1,000/- |